
తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

జనవరి 2021

వెల రూ. 5/-



"శ్రీవేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే"







తిరుమలలో 30-12-2020 నాడు వేడుకగా జరిగిన
**శ్రీవారి ప్రణయకలహ మహోత్సవ** దృశ్యాలు




తిరుమలలో 25-12-2020 తేదీన వైకుంఠఏకాదశి సందర్భంగా
వేడుకగా జరిగిన **'స్వర్ణరథోత్సవం'**




తిరుమలలో 26-12-2020 నాడు
శాస్త్రోక్తంగా జరిగిన వైకుంఠద్వాదశి చక్రస్నానం




తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారికి బంగారు ఆభరణాలను 30-12-2020 నాడు
తి.తి.దే. తిరుపతి సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ పి.బసంత్ కుమార్, ఐ.ఏ.ఎస్. గారికి
శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామివారు అందజేస్తున్న దృశ్యం




ఢిల్లీ శ్రీవారి ఆలయానికి **'గుడికో గోమాత'**లో భాగంగా ఆవు, దూడను
29-12-2020న అందించిన తి.తి.దే. అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి,
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్. గార్లు



# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** దృపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే ।
సౌభద్రశ్చ మహాబాహుః శంఖాన్ దధ్ముః పృథక్ పృథక్ ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం-18వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** పృథివీపతే= ఓ రాజా!; ద్రుపదః= ద్రుపదమహారాజు; ద్రౌపదేయాః చ= ద్రౌపదియొక్క కుమారులు ఐదుగురును; మహాబాహుః= గొప్ప బాహువులు గలవాడైన; సౌభద్రః చ= అభిమన్యుడును; సర్వశః= అన్నివైపులనుండి; పృథక్-పృథక్= వేర్వేఱుగా; శంఖాన్= శంఖములను దధ్ముః= పూరించిరి.

**భావం:** ఓ రాజా! ద్రుపదమహారాజు, ద్రౌపదియొక్క ఐదుగురు పుత్రులును, భుజబల శాలియు సుభద్రాపుత్రుడును అగు అభిమన్యుడును తమ తమ శంఖములను వేర్వేరుగా పూరించిరి.

## ఇది గాక సౌభాగ్య మిది గాక.. వైభవం బిక నొకటి గలదా

ఇది గాక సౌభాగ్య మిది గాక తపము మఱి
ఇది గాక వైభవం బిక నొకటి గలదా

అతివ జన్మము సఫలమై పరమ యోగివలె
ఇతర మోహాపేక్ష లిన్నియును విడిచె
సతి కోరికలు మహాశాంతమై యిదె చూడ
సతత విజ్ఞాన వాసనవోలె సుండె

తరుణి హృదయము కృతార్థతఁ బొంది, విభు మీఁది
పరవశానంద సంపదకు నిరవాయ

సరసిజానన మనోజయ మంది ఇంతలో
సరిలేక మనసు నిశ్చల భావ మాయ

శ్రీవేంకటేశ్వరుని చింతించి, పరతత్త్వ
భావంబు నిజముగా, పట్టె చెలియాత్మ
దేవోత్తముని కృపాధీనురాలై యిపుడు
లావణ్యవతికి నుల్లంబు తిరమాయ

(అన్నమాచార్య సంకీర్తన -5-17 )

పదకవితాపితామహుడు అన్నమాచార్యుడు శ్రీవారి దేవేరి సౌభాగ్య ఆనందాలను ఈ క్రింది విధంగా వివరిస్తున్నాడు.

"శ్రీవారి దేవేరియైన నాయిక గమ్యం, ధ్యేయం ఒకటే. అదే పరతత్త్వ భావరూపుడైన శ్రీవేంకటేశ్వరుని చింతించి, చింతించి తాదాత్మ్యం పొంది ఆనందించడం. ఇతరేతరమైన కోరిక లన్నీ త్యజించి, నిరంతర పారవశ్యంతో, విజ్ఞాన సంస్కారంతో, మనస్సును గెలిచిన యోగా వస్థతో, స్థిరమైన సంకల్పంతో శ్రీవారి అనుగ్రహం పొందిన నాయిక, ఇంతకంటె సౌభాగ్యంలేదని ఆనందిస్తూ ఉంది."



# వాఙ్మయ తపస్సు

– కీ.శే. శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియహితం చ యత్।
స్వాధ్యాయాభ్యసనం చైవ వాఙ్మయం తప ఉచ్యతే॥

“ఎదుటి వారిలో భయం కలుగజేయనిమాట సత్యమైనది. ప్రియమైన, హితమైన పలుకులు, వేదాధ్యయనం మొదలగునవి వాఙ్మయ తపస్సులు!”



మాట అత్యంత శక్తిమంతమైనది. ఒక వ్యక్తిని ఉద్దేశించి నిందాత్మక పదాన్ని ఉపయోగించినా అది అతనిలో వెంటనే ఉత్పాతాన్ని కలిగిస్తుంది.

ఒక చల్లని మాట, హితమైన మాట వ్యక్తి జీవన విధానాన్నే మార్చి బాధాతప్త హృదయానికి శాంతిని ప్రసాదిస్తుంది.

వ్యక్తి మృదువుగా మాట్లాడితే అదే అతనికి ఆభరణం. కర్కశంగా మాట్లాడే వ్యక్తి ప్రజల మన్ననలను పొందలేడు. మాట జ్ఞానజ్యోతి వెలుగులో తేజోమయం కావాలి. మాట జ్ఞాన పూర్ణం కావాలంటే, వ్యక్తి జ్ఞానకాంక్షిగా ఉండాలి. ‘మూర్ఖుని హృదయం అతని నోట ఉంటుంది. జ్ఞాని నోరు అతని హృదయంలో ఉంటుంది’ అని విజ్ఞులు అంటారు.

మన మాట కేవలం జనులను మెప్పించుటకు కాదు, భగవంతుని మెప్పించే విధంగా ఉండాలి. అదొక వాఙ్మయార్చన కావాలి. మన మాటలన్నీ భగవత్‌స్తోత్రాలుగా ఉండాలి. “స్తోత్రాణి సర్వా గిరో”– మాట్లాడే తీరును బట్టి మన సంస్కారం, సభ్యత బయట పడతాయి. అందుకే ‘నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందన్నారు.’

మాటల చేత దేవతలు మన్నన చేసి వరములిస్తారు. అప్రియమైన మాటలను ఎవరిని గురించి మాట్లాడరాదు. ‘నోరే రసభరితమైన మాటలకెల్లన్’ అన్న సుమతి శతకకారుని మాట సత్యపూర్ణం. సమయోచితంగా మనిషి స్వభావానికి తగినట్లు ఇంపుగా మాట్లాడే వాడే పండితుడు.

సులభాః పురుషా రాజన్! సతతం ప్రియవాదినః,
అప్రియస్య చ పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః.

ఎప్పుడూ సత్యమే పలుకువారు అరుదుగా దొరుకుతారు. శ్రేయస్సును కలిగించే హితమైన మాట చెప్పేవాడు, వినేవాడు దొరకటం కష్టమే. మనం మంచిని పొందడానికి సదుద్దేశంతో పలుకుతున్నామన్నది ముఖ్యం.

‘మాటకు ప్రాణము సత్యము’ అన్న సుమతి మాట మనిషికి శిరోధార్యం కావాలి. భగవంతుడిచ్చిన వాక్కును ఒక తపస్సుగా భక్తితో వినియోగించుకోవటం మన కర్తవ్యం.


పాఠకులకు, రచయిత(త్రు)లకు, ఏజెంట్లకు అందరికీ....

నూతన ఆంగ్ల సంవత్సర
మరియు
సంక్రాంతి శుభాకాంక్షలు!



దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని కరుణాకటాక్షవీక్షణాలు
అందరిపై అనవరతం ప్రసరించాలనీ మరియు
ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలనీ
స్వామివారిని ప్రార్థిస్తూ...

మీ... ప్రధానసంపాదకుడు





వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥


**గౌరవ సంపాదకులు**
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
ఆచార్య కె.రాజగోపాలన్, పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
డా॥ అల్లాడి సంధ్య
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,



సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360



విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-



50 వసంతాల 1970-2020
తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక


# సప్తగిరి


సంపుటి : 51 జనవరి, 2021 సంచిక : 08


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| వాఙ్మయతపస్సు | కే.శే. శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రి | 04 |
| సంక్రాంతి యజ్ఞం | 'వాచస్పతి' బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 07 |
| అభ్యుదయక్రాంతి సంక్రాంతి | శ్రీ గత్తం వేంకటేశ్వరరావు | 08 |
| శ్రీమద్భగవద్గీత | విద్వాన్, డా॥ ఈ.జి.హేమంత కుమార్ | 12 |
| తిరుమల క్షేత్రము - ఆళ్వారుల శ్రీసూక్తులు | శ్రీ జి.మురళీధర్ | 15 |
| భగవత్ స్వరూపం | శ్రీ పి.వి.లక్ష్మీనారాయణరాజు | 18 |
| అన్నమయ్య జీవితచరిత్ర | డా॥ మన్నూరు శివప్రవీణ్ | 20 |
| శ్రీవారి సన్నిధిలో... పెద్దశాత్తుముఱ | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 23 |
| శ్రీగోదాదేవి చరితం భక్తిదాయకం | ధర్మప్రచారపరిషత్ | 31 |
| సక్రమజీవితం | శ్రీమతి జి.సత్యవతి | 34 |
| ధర్మప్రబోధకులు 'సప్తమహర్షులు' | శ్రీ అత్తివిల్లి బాలసుబ్రహ్మణ్యం | 35 |
| సహనవతి సీతమ్మ | శ్రీ దీవి సుబ్బారావు | 39 |
| శ్రీరామ పుణ్యక్షేత్రం | శ్రీ చివుకుల రమాకాంత శర్మ | 41 |
| తిరుమళిశై ఆళ్వార్ | శ్రీ పి.బాలాజీ | 43 |
| తిరుప్పావైలో... శ్రీవేంకటేశ్వరుడు | డా॥ ఈ.ఏ.శింగరాచార్యులు | 45 |
| ఆయుర్వేద దివ్యౌషధం 'త్రికటు చూర్ణం' | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 47 |
| పోయిన పుస్తకం దొరికింది! | శ్రీమతి జోగి మహంతి సుధాకర్ రావు పట్నాయక్ | 49 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>నిర్వహణ- మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 50 |
| కేశవుడి పూజ | డా॥ శ్రీనివాసరావు | 51 |
| శ్రీగోదా కల్యాణం (చిత్రకథ) | కథ : శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు : శ్రీ కె.తులసీప్రసాద్ | 52 |
| క్విజ్ | నిర్వహణ: డా॥ అల్లాడి సంధ్య | 54 |


ముఖచిత్రం : తిరుమల శ్రీవేంకటేశ్వరుడు
వెనుక చిత్రం : తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారు


ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333





వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

సంపాదకీయం..

# మకరసంక్రమణం

మకరసంక్రమణం వచ్చింది. మనుషులలో మనసులలో సందడి హెచ్చింది. పర్వపరమార్థం ఎలా ఉన్నా సంక్రాంతి అంటే కనబడేది చలిమంటలు, గోవిందదాసరులు, వీథిగొబ్బెమ్మలు, కొత్త అల్లుళ్లకు కొలువులు, కోడి పందాలు, ఇంటింటా ముగ్గులు, ఇంపైన భోజనాలు, ఒకటేమిటి అదొక క్రొత్త కళ.

నిజానికి పండుగ ఏమిటా? అని ఆలోచిస్తే, ఆలోచనల చేలల్లో. కొత్తపంట కావల్సినంత లభిస్తుంది. సంక్రమణం అంటే ఒక స్థితిని దాటి మరొక స్థితికి ముందుకు పోవటం. గతివేగం, కాలభేదం తప్ప రాశిచక్రంలో నవగ్రహాలన్నిటికీ ఈ సంక్రమణం ఉన్నది. మరి రవి సంక్రమణానికే ఎందుకింత కోలాహలం? పోనీ సూర్యుడు ప్రతి నెల ఒక రాశి నుండి మరొక రాశిలోనికి మారుతున్నాడు గదా? కేవలం ఈ మకర, కర్కాటక సంక్రమణాలే ఎందుకు మనకు వచ్చినట్లు?

మనం కొలిచే దేవుళ్ళందరూ కనబడకుండా తమ బలం చూపించేవాళ్లు, కానీ సూర్యచంద్రులు మాత్రం కంటికి కావల్సినంత నిండుగా కన్పిస్తూ, తమ గతుల భేదాల వల్ల మన 'గతు'లలో మార్పు తీసుకు వస్తూంటారు. సూర్యగతులవల్లనే ఋతుధర్మాలేర్పడుతున్నవి. సూర్యరశ్మిలేని ప్రాంతంలో పెరుగుదల తక్కువగానే ఉంటుంది. అందువల్లనే జ్యోతిశ్శాస్త్రం కూడా రవిని ఆత్మకారకుడుగా, శనిని ఆయుష్కారకుడుగా పేర్కొంటున్నది. జాతక బలాలకు ఎక్కువగా రవి సంచారమే ఆధారం.

నిజానికి మనం చాంద్రమానాన్నే అనుసరిస్తున్నా, ఆధ్యాత్మికంగా మకరం నుండి మకరం దాకా జరిగే సూర్య సంక్రమణాన్ని ఒక సంవత్సరంగా, కర్కాటక సంక్రమణం తదర్ధభాగంగా ఏనాడన్నా పరిగణించి ఉంటారేమో అనిపిస్తున్నది.

ఇక వైదిక వాఙ్మయం సూర్యుణ్ణి నారాయణుని నేత్రరూపంగాను, చంద్రుణ్ణి 'చంద్రమా మనసో *జాతః*' అని వర్ణించింది. ఈ రెండూ కూడా ఆయా వస్తువుల ధర్మాలకు అనుగుణంగానే ఉండాయనవచ్చు. ఉపనిషత్తులు– పునస్సృష్టి సంకల్పించిన ప్రజాపతి మొట్టమొదటిగా ఆదిత్య, రయిలను దివారాత్ర భావనగా సృష్టించాడని, ఆదిత్య రూపమే పురుష రూపమని, రయి స్త్రీ రూపమనీ అంటున్నవి. ఈ రూపంగా చూచినా పదునాల్గు భువనాలకు కర్త శ్రీమన్నారాయణుడైనప్పుడు ఈ విశాలపురుషస్వరూపుడు సూర్యుడు కావటంలో సందేహం లేదు. పైగా పురాణ వాఙ్మయమంతా 'సవితృమండల మధ్యవర్తీ ధ్యేయో నారాయణ *స్సదా!*' అని ఆదిత్య మండలాంతః స్థిత 'నారాయణోపాసన'ను వ్యక్తం చేస్తున్నది. అందుకేనేమో బహుశా సూర్యునకు నారాయణత్వం కలిగి 'సూర్యనారాయణుడు' అయ్యాడు. కనుక, రవికి మానవలోకం చేసే నమస్కారం నారాయణునకే చెందుతుంది. అందువల్లనే మకరసంక్రమణం నుండి ఉత్తరాయణ కాలమంతా 'పారమార్థిక' ప్రయోజనాలకు ముఖ్యమనీ, 'ఐహిక' ప్రయోజనాలకు దక్షిణాయనం శ్రేష్ఠమనీ పెద్దల వాక్కు. అసలు విషయం మరచి మనం పండుగ చేసుకుంటున్నా, అంతరార్థం మాత్రం ఇదే.

తార్కికంగా గొప్ప సందేశం మన పండుగలలో ఉంది. సూర్యాయనానికి సంబంధించిన కర్కాటక, మకరాలు రెండూ ఉభయచరాలకు సంబంధించినవి, రవి మకరగతుడైనా, ఋతు శాసకుడు గనుక ప్రమాదం లేదు.

కానీ, పంచభూతాలు సార్వజనీనాలనీ, సార్వకాలికాలనీ తెలిసికూడా, ధన, బల, అధికార గర్వాలు, వర్గ–వర్ణ వ్యత్యాసాలనే మకరబలానికి లోనై, తనను తానుద్ధరించుకొనక, సంసారంలో నరుడు చిక్కుకున్నంత కాలం, జ్ఞాన భాస్కరునకు 'నిత్యమకరసంక్రమణమే'. దానిని దాటగలిగినవానికే ఇంపైన ఇహము, పరమూ సిద్ధిస్తాయి.

తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై



# సంక్రాంతి యజ్ఞం

– 'వాచస్పతి' బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

మన పృథ్వికి శాస్త్రప్రదాత జీవనవిధాత ఆదిత్యదేవుడు. ఆయన నుంచి భూమిపై ప్రసరిస్తున్న కిరణజాలాలు ఒక్కొక్క కాలంలో ఒక్కోవిధంగా ఉంటాయి.

సూర్యకిరణ పుంజాల ప్రసరణమే 'సూర్యక్రమణం'. సూర్యకిరణాల్లోనే అగ్ని-జల శక్తులు రెండూ ఉన్నాయి. శుద్ధధవళమైన సూర్యకాంతి, జలతత్త్వంచేతనే బహువర్ణాలుగా భాసిస్తున్నది.

అందుకే ఆ కిరణాలు పోషిస్తున్న సర్వజీవరాశి కూడా అగ్నిజలతత్త్వాల సమ్మేళన స్వరూపాలే.

ఈ రహస్యాన్నే **'అగ్నీ షోమాత్మకం జగత్'** అని వేదవిజ్ఞానం పేర్కొంది. అగ్ని శివతత్త్వంగా, సోమం శక్తి తత్త్వంగా ప్రపంచాన్ని కాలాన్నీ శివ శక్త్యాత్మకంగా దర్శించి, ఉపాసించే విజ్ఞానమే యజ్ఞాలుగా, అర్చనలుగా మన సంప్రదాయంలో స్థిరపడింది.

పగలు అగ్ని(శివ) స్వరూపం, రాత్రి శక్తి(జగదంబ) స్వరూపం. సంవత్సరానికి పగటివంటిది **ఉత్తరాయణం.** రోజులో పగటిప్రారంభంలో భగవదర్చనతో మనం పనులు ప్రారంభిస్తాం. తద్వారా పనికి అవసరమైన 'సంకల్పం, క్రియ, సిద్ధి'-ఈ మూడూ దైవశక్తితో పవిత్రమై సాఫల్యాన్ని ఇస్తాయి.

అలాగే 'ఉత్తరాయణం' అనే సంవత్సరపు పగటి భాగం ఈ మకర సంక్రమణ వేళతోనే శ్రీకారం చుట్టుకుంటుంది.

> **సూర్యకిరణాలే కాంతిస్వరూపులైన దేవతలకు రాచబాటలు. ఆదిత్యుని నుంచి మనవైపు వచ్చే దివ్యానుగ్రహం కానీ, మననుంచి భానుమండలంలోని పరమేశ్వరునికి సమర్పించే భక్తిభావాలు కానీ ఈ కిరణమార్గాల ద్వారానే పయనిస్తాయి. అంటే ఈ కిరణాలు మనకీ దైవానికి నడుమ మాధ్యమాలన్న మాట. ఈ కిరణపుంజమే యజ్ఞాగ్నిపుంజం. 'సంక్రాంతి'ని సక్రమంగా పాలించడమే ఒక పావనయజ్ఞం.**


కాంతితత్త్వాన్ని ఉపాసించే భారతీయులు వెలుగులకు పూర్ణావకాశమిచ్చే ఉత్తరాయణారంభాన్ని (మకర సంక్రాంతిని) పరమపుణ్యకాలంగా సంభావించారు. ఇది సంవత్సరానికి **'ప్రాతఃసంధ్య'**. అదేవిధంగా ఆషాఢంలో ప్రవేశించే కర్కాటక సంక్రమణం- ఏడాదికి **'సాయంసంధ్య'**. అందుకే దాన్ని కూడా పుణ్యకాలంగా పేర్కొన్నారు.

కాలంలో స్పష్టంగా గోచరించే అనుభవానికి వస్తున్న దివ్యత్వం ఈ మకర సంక్రమణం. కాంతి గమనంలో మార్పును ప్రత్యక్షంగా అందుకొనేది ఈ పర్వం నాడే. ఆ మార్పు (క్రాంతి) మంచిని కలిగించాలని 'వెలుగుల స్వామి'ని వేడుకుంటున్నాం. ఈ పుణ్యవేళ దైవీశక్తులను సులభంగా పొందగలవచ్చు.

కనుకనే, ఈ రోజున ధ్యాన, దాన, జపానుష్ఠానాలు, పితృతర్పణం వంటి సత్కర్మలు అమోఘ ఫలితాల నిస్తాయని శాస్త్రోక్తి.

యజ్ఞాల్లో తొలిపంటగా లభించిన బియ్యంతో పాకం చేసి దేవతలకు ప్రీతిగా ఆహుతివ్వడం సంప్రదాయం.

ఈ యజ్ఞాంశమే, కొత్త పంటలోని బియ్యంతో పాయసాన్ని 'పొంగించే' పండుగగా సామాన్యజనుల్లో సైతం ప్రశస్తి పొందింది.



# అభ్యుదయ క్రాంతి సంక్రాంతి

- శ్రీ గత్తం వేంకటేశ్వరరావు

హిందువులు పెద్దలనుండి పిన్నల వరకు అత్యంత ప్రీతిపాత్రంగా ఆచరించే పండుగలలో సంక్రాంతిది ప్రముఖస్థానం. ఇది పుష్యమాసంలో సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిన పుణ్యదినం.

తెలుగువారికి పెద్దపండుగ **'సంక్రాంతి'.** ఉత్సాహంతో అందరూ వచ్చే బంధుమిత్ర గణంతో కొత్తవత్సరంలో జరుపుకునే ఈ తొలిపండుగ, ప్రతి ఇంటిలోనూ ఆనందపు పరవళ్లు తొక్కిస్తుంది. ఇంటికొచ్చే పాడిపంటలు, వాకిళ్లలో ఆహ్వానించే ముగ్గులు, ముద్దుగొలిపే గొబ్బెమ్మలు, ఇళ్ల ముంగిట పాలముంగురులు, గంగిగోవుల ఆరాధనలు, హరిదాసుల కీర్తనలు, బుడబుక్కలోళ్ల ఢమరుకనాదాలు, గంగిరెద్దుల విన్యాసాలు, కమ్మని పిండివంటలు, కోడిపందాలు, పతంగుల ఆటలు.. అన్నీ కలబోసిన క్రాంతి **"సంక్రాంతి"**. కాబట్టి మకరసంక్రాంతిని **'ఉత్తరాయణ పుణ్యకాలం'**గా వ్యవహరిస్తారు.

సూర్యుడు ఒక్కొక్క నెలలో ఒక్కొక్క రాశిలోనికి వస్తూ, మకర రాశిలోకి ప్రవేశిస్తాడు. అలా సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించడాన్నే **'మకరసంక్రమణము'** లేదా **'మకర సంక్రాంతి'** అంటారు.

సూర్యభగవానుడు సప్తాశ్వాల మహారథం మీద పయనిస్తూ, ప్రతినెలలో మేషాదిగా ఉన్న పన్నెండు రాశులలో ఒక్కొక్క నెలచొప్పున ఉంటూ వస్తాడు. ఆ విధంగా ఆయా రాశులలో 'సంక్రమణాలు' వస్తూంటాయి. మకరరాశితో పుణ్యకాలం వస్తుంది. ఈ విధంగా సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిన పుణ్యదినమే 'మకరసంక్రమణం'గా, 'సంక్రాంతి'గా ప్రాధాన్యం సంతరించుకుంది.

సంక్రాంతిలో **'సం'** అంటే మిక్కిలి, **'క్రాంతి'** అంటే అభ్యుదయం. మంచి అభ్యుదయాన్ని ఇచ్చే క్రాంతి కనుక దీనిని 'సంక్రాంతి'గా పెద్దలు చెబుతారు.

'మకరం' అంటే మొసలి. ఇది పట్టుకుంటే వదలదు. మానవుని యొక్క ఆధ్యాత్మిక మార్గానికి అడుగడుగునా అడ్డు తగులుతూ మోక్షమార్గానికి అనర్థాణ్ణి చేస్తుంది.

అందువల్ల ఈ మకరసంక్రమణం పుణ్యదినాల్లో దీని బారినుండి తప్పించుకునేందుకు ఎవరికి వారు యథాశక్తి దానధర్మాలు చేయాలని శాస్త్రకోవిదులు చెబుతారు.

**'భోగి'** పండుగ తర్వాత **'సంక్రాంతి'** ఆ తర్వాత **'కనుమ'** పండుగలు వస్తాయి.

## భోగిపండుగ

మకర సంక్రమణానికి ముందురోజు **భోగిపండుగ.** భోగిపండుగనాడు ఇంద్రుని పూజించే ఆచారం ఉంది. ద్వాపర యుగంలో ఇంద్రునికి ఈ పూజల వల్ల గర్వం హెచ్చుకాగా, అతడికి గర్వభంగం చేయాలని శ్రీకృష్ణుడు తలచాడు. ఒకానొక భోగిపండుగనాడు యాదవులందరూ ఇంద్రపూజకు సమాయత్తమయ్యారు. అప్పుడు శ్రీకృష్ణుడు గొల్లలతో ఈ విధంగా చెప్పాడు. 'మనం గోవులను మేపుకునే గొల్లలం. కర్షకుల వలె మనకు వర్షాలు అంతగా అక్కరలేదు. మన గోవులకు మేతనిచ్చేది గోవర్ధనపర్వతం మీది పచ్చికబయలు. కాబట్టి మనం గోవర్ధన పర్వతాన్ని పూజిద్దాము. అందుచేత ఇంద్రపూజ జోలికి మనం పోవద్దు' అని చెప్పాడు. శ్రీకృష్ణుని మాటలకు అంగీకరించిన



గొల్లలు ఇంద్రపూజకు స్వస్తి చెప్పి, గోవర్ధనగిరిని పూజించడంతో ఇంద్రుడు కోపంతో పెద్దవర్షం కురిపించాడు. ఆ జడివానలో తడిసి ముద్దయి, వారు శ్రీకృష్ణునితో చెప్పుకున్నారు. అప్పుడు శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని ఎత్తి పట్టుకుని యాదవులందరికీ, వారి గోవులతో దాని క్రింద ఆశ్రయం కల్పించాడు. తన వద్ద నున్న ఏడు రకాల మేఘాలను వదిలినా, ఇంద్రుడు యాదవులను ఏమీ చేయలేకపోయాడు. దాంతో ఇంద్రుడికి గర్వభంగమై బుద్ధి వచ్చింది. శ్రీకృష్ణుని మహత్తు తెలుసుకొని ఇంద్రుడు పాదాక్రాంతుడయ్యాడు. శ్రీకృష్ణుడు అతనిని మన్నించి, భోగి పండుగ నాడు మామూలుగా మళ్ళీ ఇంద్రపూజ జరిగేట్టుగా ఆనతి ఇచ్చాడు.



ఈ రోజునే విష్ణుమూర్తిచే బలిచక్రవర్తి పాతాళమునకు అణచిన దినంగా చెపుతారు. ఈనాటికీ వామన నామస్మరణము, బలిచక్రవర్తిని ప్రస్తుతి చేయడం కొన్ని ప్రాంతాలలో ఆచారంగా ఉంది.

భోగి పండుగనాడు తెల్లవారుజామునే నిద్రలేచి, అభ్యంగన స్నానం ఆచరించాలి. చంటిపిల్లలకు తలంటుపోసి, మధ్యాహ్నం భోగిపళ్లు పోస్తారు. ఈ భోగిపళ్ళు పోయడమనేది దృష్టి పరిహారార్థంగా చేసే కర్మగా తెలుస్తుంది.

## సంక్రాంతి పండుగ

సంక్రాంతి పర్వదినంనాడు సాంప్రదాయికంగా తమ ఇళ్లలో యమ, రుద్ర, ధర్మదేవతలకు ప్రతీకలుగా మూడుకలశాలు ప్రతిష్ఠించి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు పూజ చేస్తారు. సమాజానికి, తమ కుటుంబానికి శుభశాంతులు, సమస్తసుఖాలు కలగాలని ప్రార్థిస్తారు. పేదలకు దానధర్మాలు, కానుకలు ఇస్తారు. స్త్రీలు పూలు, పసుపు, కుంకుమ, పండ్లు మున్నగునవి దానం చేయడంవల్ల సకలసంపదలతో పాటు చక్కని సౌభాగ్యం కలుగుతుందని నమ్మకం. ఈ రోజు పితృదేవతారాధన చేయటం వల్ల, వారి శుభాశీస్సులతో వారి వారి వంశాలు వర్ధిల్లుతాయని శాస్త్రవచనం.

దీనికి ఉదాహరణగా– గుణవంతురాలు, పతివ్రత అయిన కృపి, ఋషితుల్యుడైన ద్రోణాచార్యుల భార్య ఆ భార్యాభర్తలు ఒక ఆశ్రమంలో ఉండేవారు. ఒకనాడు ద్రోణాచార్యుడు బయటకు వెళ్ళిన సమయంలో కృపి ఒక్కటే ఆశ్రమంలో కూర్చుని ఉండగా, దుర్వాసముని సమిధల కొరకు అన్వేషణ సాగిస్తూ అచ్చటికి వచ్చాడు. ఆ మునిని కృపి పూజించి, తమ పేదతనాన్ని, తమకు ఒక ముసలి ఆవు తప్ప ప్రపంచంలో ఏమీ ఆస్తిలేదని, తమకు పిల్లలు కూడా లేరని చెప్పి, తమకు భాగ్యప్రదమైన సాధనమేదైనా చూపించమని కోరింది. ఆమె ప్రార్థనకు దయార్ద్రహృదయుడై, సంక్రాంతి పర్వాన్ని, సంక్రాంతినాడు గంగానదిలో స్నానంచేసి, బ్రాహ్మణుడికి పెరుగుదానం చేయమని చెప్పాడు.

అదృష్టవశాత్తు ఆ రోజు సంక్రాంతి కావడం వల్ల, ఋషి కృపితో ఆ విషయం గుర్తుచేయగా, దగ్గరే ఉన్న నదికి వెంటనే వెళ్ళి శరీరానికి నువ్వులపిండి రాసుకుని స్నానం చేసి రమ్మన్నాడు. వచ్చి తనకు పెరుగుదానం చెయ్యమన్నాడు. అలా దానం చేయడంవల్ల ఆమెకు చక్కని కొడుకు పుడతాడని, అతడు తండ్రియొక్క మూడువిధాలైన ఋణాలు తీరుస్తాడని చెప్పాడు.

అతడు చెప్పిన విధంగానే చేసింది కృపి. కాలక్రమాన ఆమెకు ఒక చక్కని కొడుకు పుట్టాడు. అతడే అశ్వత్థామ. ఆ కొడుకు పుట్టినప్పటి నుంచి వారు చీకూ, చింతా లేకుండా జీవించసాగారు.

సంక్రాంతినాడు స్త్రీలు పంచదారలో నువ్వులు కలిపి చిమ్మిలి చేసి దానిని మిత్రుల ఇంట, బంధువుల ఇళ్లలో పంచిపెడతారు. స్త్రీలు ఈ సందర్భంలో "పంచదారలో కలపబడ్డ ఈ నువ్వుల గింజలు పుచ్చుకోండి. సంవత్సరం పొడవునా మాకు స్నేహితులై ఉండండి" అని అంటారు. మధ్యాహ్నం పిల్లల్ని పీట మీద కూర్చోబెట్టి, వారి తల మీద నుంచి వేరుశెనగ పలుకులు, మిఠాయి ఉండలు, దిగువార పోస్తారు. వచ్చిన పేరంటాండ్రకు పసుపు కుంకుమలు, నువ్వుపప్పు పంచి పెట్టడం ముఖ్యమైన అంశంగా చెప్తారు. సంక్రాంతిలో నువ్వులకు (తిలలకు) అధిక ప్రాముఖ్యం ఉంది. అందువల్ల సంక్రాంతి పర్వాన్ని 'తిల

సంక్రాంతి' అని కూడా అంటారు. ఈనాడు స్నానం చేయనివాడు ఏడుజన్మలవరకూ రోగి, దరిద్రుడుగా పుడతాడు. సంక్రాంతిరోజు సూర్యుని ఆరాధించి నువ్వులు, గుమ్మడికాయ, పెద్దపాత్ర, ధాన్య, లోహ, వస్త్ర, తైల దీపదానాలు చేయాలని శాస్త్రవచనం.

అలనాటి చల్లని చూపు గొబ్బెయెల్లో
మళ్ళీ చూడ వచ్చావా గొబ్బెయెల్లో
మంచి గంధం పూతలను గొబ్బెయెల్లో
మళ్ళీ పూయవచ్చావా గొబ్బెయెల్లో
చల్లని పన్నీటి జల్లు గొబ్బెయెల్లో
మళ్లీ కురియ వచ్చా గొబ్బెయెల్లో ॥



అంటూ గొబ్బియలకు కన్నెపిల్లలు స్వాగతం పలుకుతారు. పేడముద్దలు చేసి ముగ్గుల మధ్యన, గుమ్మాల ప్రక్కన పెట్టి వాటికి పసుపు, కుంకుమ అద్ది, పిండితో ముగ్గులు వేసి, చామంతి పువ్వులతో గౌరీదేవిని పూజిస్తారు. సాయంత్రం వేళల్లో గొబ్బెమ్మల చుట్టూ చేరి, చేతులు తడుతూ ఎంతోమంది ఉత్సాహంగా పాటలు పాడుకుంటారు. స్త్రీలు భోగి నుంచి నాలుగు రోజులు 'గొబ్బి గౌరీవ్రతం' చేసి, బంకమన్నుతో గౌరీదేవి ప్రతిమను తయారుచేసి, పూజించి నదులు, చెరువులు, కాలువలలో వదులుతారు. 'మకర సంక్రాంతి'ని గ్రామీణ స్త్రీలు కొందరు **'గొబ్బెమ్మల పండుగ'** అని కూడా పిలుస్తారు. ఈ గొబ్బెమ్మలు గోవర్ధనగిరికి, గోమాతకు, గోపాలకృష్ణునకు సంకేతాలుగా చెప్తారు.


ప్రతి ఇల్లు నూతనంగా, ముత్యాలముగ్గుల్లో, పచ్చని తోరణాలతో, కళకళలాడుతూ ఉంటుంది. ధనుర్మాసం ప్రారంభమైననాటి నుండి వివిధ ఆలయాలలోని అర్చకస్వాములు, సూర్యోదయానికి పూర్వమే మంగళవాయిద్యాలతో, నదీజలాలతో విశేషార్చనలను నిర్వహిస్తారు. మహిళలు తెల్లవారుజామునే తదేక దీక్షతో రంగవల్లులను తీర్చిదిద్దటం, ఆరోజున చూపరులను ఆకర్షించే మనోహర దృశ్యం. సంక్రాంతి సమయాల్లో రంగవల్లుల పోటీలు కూడా నిర్వహిస్తారు. భోగి, సంక్రాంతికి ఈ ముగ్గుల పండుగకు వీడ్కోలు చెప్పినట్లుగా రథం ముగ్గును కనుమ రోజున వేస్తారు.

## కనుమ పండుగ

మకరసంక్రాంతి వెళ్ళిన మరునాడు **కనుమపండుగ.**

ఈ రోజు రైతన్నలకు అత్యంత ప్రీతికరమైనది. వారి బిడ్డలకు ఏ లోటూ లేకుండా పాడిని అందించే 'గోమాత'ను, వ్యవసాయ పనులలో రైతన్నకు చేదోడు వాదోడుగా ఉంటూ చివరకు ధాన్యపురాశులను ఇంటికి చేర్చేవరకు తోడ్పడే 'బసవన్న'కు పూజలు జరిపి పశువులకు పండుగ చేస్తారు.

కనుమనాడు ఆ పశువులశాలలు పరిశుభ్రం చేసి, మావిడాకు తోరణాలు కట్టి, పువ్వులతో అలంకరిస్తారు. ఆవులను, దూడలను, ఎద్దులను శుభ్రంగా కడిగి, వాటి కొమ్ములకు ముఖానికి పసుపురాసి కుంకుమ పెడతారు, రంగులు వేస్తారు.



అలంకరణకొరకు కుచ్చులు, పూలమాలలు మొదలైనవి కడతారు. కొన్నిప్రాంతాల్లో కట్టు తాళ్ళు కూడా కొత్తవి పెడ తారు. తర్వాత పూజ చేస్తారు.

సాయంకాలం పశువులశాలవద్ద పొంగలి వండి నైవేద్యం పెడతారు. ఆ తర్వాత వాటిని వీథుల వెంట మేళతాళాలతో ఊరేగిస్తారు. పశువులన్నీ అలంకరింపబడి ఒక మైదానం వద్దకు చేరతాయి. అక్కడ వాటి మీద 'పవిత్రజలం' చల్లుతారు. అవి తిరిగి ఇంటికి వచ్చినప్పుడు లక్ష్మిరాకకు సంతోషించినట్లు ఇంటిల్లిపాది ఎంతగానో సంతోషిస్తారు.

ఈ పండుగ దినాలలో "కోటి విద్యలు, కూటి కోసమే!" అన్నట్లుగా హరిదాసులు హరినామ సంకీర్తనలు చేస్తూ వచ్చి 'కృష్ణార్పణం' అంటూ ముంగిట భిక్షను స్వీకరిస్తూ ఉంటారు. గంగిరెద్దుల వారు 'బసవన్న'ను ఆడిస్తూ చిన్నారులను దీవిస్తారు. జంగమదేవరలు, బుడబుక్కలవారు, కొమ్మదాసరులు, పిట్టల దొరలు, విచిత్రవేషధారులు మున్నగు కళాకారులంతా ఈ పండుగ దినాలలో వచ్చి, వారి వారి కళలను ప్రదర్శిస్తూ, ఎవరికివారు ఆనందంగా ఇచ్చే కానుకలను స్వీకరిస్తూ, చివరగా ఒక పాత వస్త్రాన్ని ఇమ్మని కోరి భుజాన వేసుకుని పోతూ 'సుభోజ్యంగా' ఉండాలమ్మా అంటూ దీవించి పోతుంటారు.

ఈ గ్రామసీమల్లో గ్రామీణులు ఏ కళాకారులనూ రిక్తహస్తాలతో పంపకుండా కలిగిన దాంట్లో కలిగినంత ఇచ్చి పంపడం ఆచారం.

## ముక్కనుమ పండుగ

ఈమూడు పండుగలు గడచిన నాల్గవరోజు క్రొత్తగా పెళ్లైన ఆడపిల్లలు 'సావిత్రీగౌరీవ్రతం' అంటే 'బొమ్మల నోము' చేస్తారు. ఈ దేవిని తొమ్మిదిరోజులు పూజించి, తొమ్మిది



పిండివంటలతో రోజూ నివేదన చేసి, పిదప ఆ మట్టిబొమ్మలను పుణ్యతీర్థమందు నిమజ్జనం చేస్తారు.

సంక్రాంతి నాడు దేవతలకు, పితృదేవతలకు ఏ ఏ పదార్థాలు దానం చేస్తామో అవి జన్మజన్మలకీ అత్యధికంగా లభిస్తాయని చెప్తారు.

ప్రత్యేకంగా వచ్చే సంక్రాంతి పండుగను ఆహ్వానిద్దాం. పౌష్యలక్ష్మిని ఆరాధించి సమస్త సుఖాలను పొందుదాం.

సర్వేజనాః సుఖినో భవన్తు

**హిందువులకు గోవు ఆరాధ్యమైనది. గోవులో సకల దేవతలు ఉంటారని పురాణాలు చెపుతున్నాయి. అందుకే గోమాతకు ప్రదక్షిణ చేస్తే సకలదేవతలకు ప్రదక్షిణ చేసి నంత ఫలితం వస్తుందని ప్రదక్షిణలు చేస్తుంటారు. పూజలు చేస్తుంటారు. గోవు నుండి లభించే అన్ని పదార్థాల్లో ఎన్నో ఔషధగుణాలున్నాయని ప్రతీతి. శుభాల్ని ఆకాంక్షించే గృహస్థులు తప్పక గోసేవ చేయాలని ఋగ్వేదం తెలిపింది. అలా గోసేవ చేసే వారికి సంపద చిరకాలం వర్ధిల్లుతుందని తెలిపింది. సామవేదం ఋగ్వేదంలో ఇంద్రుణ్ణి స్తుతిస్తూ దేవతలకు యజ్ఞం ద్వారా, హవిస్సులు సమర్పించడం వల్ల ధేనువు గరిక తిని తృప్తి పొంది పాలు, పెరుగు, నెయ్యి ఇవ్వడం వల్లనే యజ్ఞకర్మలు నిర్విఘ్నంగా జరుగుతున్నాయి. అందుకే సర్వసంపదలకూ సాధనంగా గోవును గ్రహించా లని శుక్లయజుర్వేదంలో పేర్కొన్నారు. గోమాత వ్రతం చేసి, ఉపవాసం చేస్తే వారి సమస్య మహాపాతకాలు హరిస్తాయి.**

# శ్రీమద్భగవద్గీత

2

విద్వాన్, డా॥ ఈ.జి. హేమంత కుమార్



## 2వ - అధ్యాయం (సాంఖ్యయోగం)

### అధ్యాయ నామౌచిత్యం

సంఖ్యతో కూడింది సాంఖ్యం. సాంఖ్యమంటే జ్ఞానం, వివేకం, పరిశీలన, చర్చించునది, తర్కించునది అని అర్థాలు. ఆత్మజ్ఞానమే ఇక్కడ సాంఖ్యం. సారథిగా వచ్చిన కృష్ణుడు అర్జునుని దైన్యం చూచి విస్మితుడై అతడ్ని కర్తవ్యోన్ముఖుడ్ని చెయ్యాలని నిశ్చయించుకున్నాడు. దీనికి మార్గమేమి? ఆత్మ తత్త్వాన్ని ఉపదేశించడమే అందుకు తగిన ఉపాయం. ఆత్మ నశించేది కాదని అర్జునునికి తెల్పటం కొరకే ఈ అధ్యాయాన్ని శ్రీకృష్ణుల వారుపదేశించారు

న జాయతే మ్రియతే వా కదాచి
న్నాయం భూత్వా భవితా వా న భూయః ।
అజో నిత్య శ్శాశ్వతోఽయం పురాణో
న హన్యతే హన్యమానే శరీరే ॥ 20

ఓ అర్జునా! ఆత్మకు చెందిన ఈ శరీరాలు నశిస్తే నశింపవచ్చు. కానీ, అవ్యయమైన ఈ ఆత్మకు ఎవడూ వినాశం కల్గించలేడు. ఎవడీ ఆత్మను చంపుదానిగా, చంప బడిన దానిగా భావిస్తాడో వాడు అజ్ఞాని. ఈ ఆత్మఎప్పుడూ గానీ పుట్టదు. చావదు.

ఈ అధ్యాయంలో శ్రీకృష్ణులవారు ఆత్మోపదేశ తత్త్వాన్ని మరో రెండు శోకాల్లోనూ ఇలా బోధిస్తున్నారు.

నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః ।
న చైనం క్లేదయన్త్యాపో న శోషయతి మారుతః ॥ 23

అచ్ఛేద్యోఽయ మదాహ్యోఽయ మక్లేద్యోఽశోష్య ఏవ చ।
నిత్య స్సర్వగతస్థాణురచలోఽయం సనాతనః ॥ 24

శస్త్రాలు ఈ ఆత్మను ఛేదింపలేవు. అగ్ని దీనిని దహింపజాలదు. నీరు తడుపలేదు. గాలి దీనిని ఎండింప జేయలేదు. ఈ ఆత్మ నరకడానికి, తగలబెట్టడానికి, తడపడానికి, ఎండించడానికి వీలుకానిది. ఇది నిత్యం, స్థిరం, సనాతనం అని కృష్ణుడు ఆత్మస్వరూపం వివరించాడు. అందుకే ఈ అధ్యాయానికి "ఆత్మోపదేశమని" కూడా మరో పేరు. ముముక్షువులకు ఈ అధ్యాయం ప్రాణం వంటిది. ముక్తి సాధనకు కావల్సిన అనుష్ఠానం, స్థితప్రజ్ఞుని లక్షణాలు ఈ అధ్యాయంలో చెప్పబడి ఉన్నాయి. భగవంతుడు ఈ అధ్యాయంలో క్షుద్రమైన హృదయ దౌర్బల్యం తగదంటున్నాడు. క్లీబత్వం వదలమన్నాడు. అపకీర్తి కరమైన దైన్యం కంటే మరణమే మేలన్నాడు. ఆత్మజ్ఞుడు ఏ పరిస్థితిలోనూ శోకించడనీ, కర్తవ్యవిముఖుడు కాడనీ ఉద్బోధించాడు. ఈ విధంగా పంచభూతాత్మకమైనటువంటి దేహాదుల యొక్క నశ్వరత్వం ఇందు ప్రతిపాదింపబడటం వల్ల, జ్ఞాన సంబంధమైన అంశాలు అనేకం చెప్పటం చేత దీనికి 'సాంఖ్య యోగం' అనే పేరు ఉచితమే. ఈ అధ్యాయం చదవడం వలన ఆత్మస్వరూపం అవగతమౌతుంది.

### సంజయుడు చెబుతున్నాడు

ఓ ధృతరాష్ట్రమహారాజా! ఆ విధంగా తనవారి కోసం వగచి దుఃఖభర హృదయంతో ఉన్న అర్జునునితో కృష్ణుడు ఇలా అంటున్నాడు.

### శ్రీకృష్ణుడు అంటున్నాడు

అర్జునా! ఎక్కడిదీ కశ్మలం? విషమ సన్నివేశంలో నిన్ను దుర్బలత్వం ఆవహించింది. ఇట్లా చేయటం నీకు తగదు. కీర్తినీ, స్వర్గాన్ని దూరంచేసే దశ ఇది. ఈ నపుంస కత్వాన్ని వదలిపెట్టి యుద్ధానికి నడుంకట్టు అన్నాడు.

## అర్జునుడంటున్నాడు

ఓ కృష్ణా! పూజనీయులైన భీష్మద్రోణాదులను వధించి ఆ రక్తపు కూడు నన్ను తినమంటావా? భిక్షమెత్తుకొని బ్రతక మంటావా? నాకేమీ తోచడం లేదు. నేను నీకు శిష్యుడను. నీవు నాకు గురుడవు. నిన్ను శరణుజొచ్చాను. ఇప్పుడు నా కర్తవ్య మేమిటో సెలవివ్వు అన్నాడు. ఇంద్ర పదవి లభించినా నా మనసు పొందే శోకం చల్లారే దారి కనిపించడం లేదు. గోవిందా! ఏది ఏమైనా నేను యుద్ధం చేయను అని, రెండు సేనల మధ్య విషాదంతో కూర్చున్న అర్జునుణ్ణి చూచి గీతాచార్యులు ఈ వాక్యాలను పలికారు.

## శ్రీకృష్ణుడు అంటున్నాడు

అర్జునా! మహాజ్ఞాని మాదిరి వాపోవుచున్నావే.

అశోచ్యానన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।
గతాసూన గతాసూంశ్చ నానుశోచన్తి పండితాః॥ 11

బ్రతికి ఉన్నవారి కోసం గాని, చచ్చిన వారి కోసం గాని పండితులు విచారించరు. ఈ దేహానికి బాల్యం, యౌవనం, వార్ధక్యం ఎలా ప్రాప్తిస్తాయో, అలాగే మరణం తప్పక సంభవించి తీరుతుంది. మరో దేహం లభిస్తుంది. బాల్యం, యౌవనం, వార్ధక్యం మొదలైన మార్పులు దేహానికి కలిగి నప్పుడు మనం ఎలా దుఃఖించటంలేదో, అట్లే మరణానికి కూడా దుఃఖించరాదు.

అందుకే ధీరులైనవారు వ్యామోహంలో పడరు. పుట్టటం, పెరగటం, చావటం అనేవి దేహ ధర్మాలేగాని "దేహి" ధర్మాలు కావు. దేహం కాల గర్భంలో విలీనమవుతుంది. కాని "దేహి" శాశ్వతం. అది పుట్టదు. చావదు. నిత్యమైనటువంటి ఆత్మను చంపానని, చంపగలనని అనుకునేవాడు అవివేకి. ఆత్మనాశము లేనిది. దానినెవ్వరూ అంతమొందింపలేరు. ఈ రహస్యం తెలిస్తే చంపడం చావడం లేదు.

అర్జునా! మనం చిరిగిన బట్టలను విడిచిపెట్టి నూతన వస్త్రాలను ధరిస్తున్నట్లే ఈ దేహి (ఆత్మ) శరీరాన్ని మారుస్తున్నది. కనుక నీవు దిగులుపడవలసిన పనిలేదు. నీవు క్షత్రియుడవు. నీవు యత్నించకనే సంభవించింది ఈ ధర్మయుద్ధం. గెలిస్తే రాజ్యం వస్తుంది. చనిపోతే స్వర్గం చేకూరుతుంది. నీ క్షాత్ర ధర్మానుసారం యుద్ధం చేయడమే నీకు శ్రేయస్కరం. యుద్ధం చెయ్యాలని నీకు లేకపోతే కులధర్మమైన యుద్ధంనుండి విరమించడమనే పాపాన్ని మెడకు చుట్టుకుంటావు. అపకీర్తి పాలవుతావు. అంతకంటే మరణం మంచిది.

నీకు రాజ్యకాంక్ష లేదు. నీవు ఎటువంటి ఫలాన్ని కోరటం లేదు. నీ స్వధర్మమైన యుద్ధమనే కర్మను ఆచరించట మందే నీ మనస్సును లగ్నం చెయ్యి. అదే నీ విధి.

అప్పుడే నీవు మోక్షానికి అర్హుడవవుతావు. తన ధర్మాన్ని ఆచరించి ఫలం సిద్ధించినా, సిద్ధింపకపోయినా సమబుద్ధితో ఉండటమే యోగం అనబడుతుంది.

కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన ।
మా కర్మఫలహేతుర్భూ ర్మా తే సంగోఽ స్త్వకర్మణి ॥ 47

నియమింపబడిన కర్మను చేసే అధికారమే నీకుంది. దాని ఫలమునందెంత మాత్రం అధికారంలేదని మరువకుము.

ఫలమును కోరక, విధియని కర్మ చేయటంలో జ్ఞాన ముంది. అందువలన అంతఃకరణ శుద్ధి ఏర్పడుతుంది. నీ బుద్ధి మనసులో నిలకడగా ఎప్పుడుంటుందో అప్పుడు నీవు జ్ఞాన యోగానికి తగినవాడవవుతావు.



కాబట్టి అర్జునా! అజ్ఞానాన్ని వదలి ఆత్మయందు స్థిత ప్రజ్ఞత్వం కలిగి నిస్సంగంగా లోకంలో వ్యవహరించు. కర్త వ్యాన్ని నిర్వహించు, అని భగవానుడన్న మాటకు- అర్జునుడిలా ప్రశ్నిస్తున్నాడు.

## అర్జునుడు అడుగుతున్నాడు

కృష్ణా! స్థితప్రజ్ఞుడంటే ఎవరు? అతని లక్షణాలు వివ రించు? మాట్లాడే విధానం ఏమిటి? ఎలా నడుచుకుంటాడు? ఈ అంశాలన్నీ నాకు కొంచెం విశదీకరించి చెప్పు అని అర్జు నుడు కృష్ణున్ని ప్రశ్నించాడు?

## కృష్ణుడు అంటున్నాడు

అర్జునా! జ్ఞానం స్థిరంగా కలవానిని స్థితప్రజ్ఞుడు అంటారు. స్థితప్రజ్ఞుడు ఆత్మయందే మనస్సును నిలిపి సంతుష్టుడై ఉంటాడు. కోరికలన్నిటిని వదలివేసి, రాగద్వేషాలకు అతీతంగా మంచి- చెడ్డలను నిశ్చింతగా స్వీకరిస్తాడు.

చెరువులో తాబేలు పరిసరాలు నిశ్శబ్దంగా ఉన్నప్పుడు తన అవయవాలను చాపి నీటిలో తిరుగుతూ ఏదైనా శబ్దం కలిగితే అవయవాలన్నిటినీ ముడుచుకొన్నట్లు, లోపలికి లాక్కొనే రీతిగా- విషయ సుఖాల నుండి ఇంద్రియాలతో నివారించేవాడు స్థిత ప్రజ్ఞుడు.

ఇంద్రియాలు గుఱ్ఱాల వంటివి. నా యందే మనసు నిలిపి ఇంద్రియాలను వశంలో ఉంచుకోవాలి. అర్జునా! అజ్ఞాని కామక్రోధాదులకు లోబడి పతనమైపోతున్నాడు. ఇంద్రియ వాంఛలను స్మరించడం వల్ల కామం ఏర్పడుతుంది. కామం అంటే కోరిక. కోరిక నెరవేరితే సుఖం. విఫలమైతే దుఃఖం. తుదకు క్రోధంగా పరిణమిస్తుంది.

క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్స్మృతి విభ్రమః ।
స్మృతిభ్రంశా ద్బుద్ధినాశో బుద్ధినాశా త్ప్రణశ్యతి ॥ 63

క్రోధం వల్ల మోహం ఉద్భవిస్తుంది. మోహము చేత స్మృతి భ్రంశం. తరువాత బుద్ధినాశం. దీనితో పురుషుడు సర్వనాశనం. కనుక ఇంద్రియాలులాగు వైపున నుండి మనసును ఆత్మవైపు మరల్చుటే ముఖ్యం.

యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ।
యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః॥ 69

సకలప్రాణులకు రాత్రి అనిపించే సమయం యోగికి పట్టపగలు. అలానే ప్రాణికోటికి ఏది పగలో జ్ఞానికి అదిరాత్రి అవుతున్నది. సామాన్యజీవులు లౌకికవ్యవహారాల్లో మెలకువగా ఉండి ఆత్మవిషయంలో నిద్రావస్థలో ఉంటారు. యోగి ఆత్మ విషయంలో జాగ్రత్తగా ఉండి లౌకిక విషయాల పట్ల నిద్రా వస్థలో ఉంటాడు.

సముద్రంలో అనేక నదులు ప్రవేశిస్తాయి. అందువలన సముద్రానికి వృద్ధి గాని, నదులు చేరకుంటే క్షీణతగాని కలు గదు. అట్లే ఆత్మ జ్ఞానిని ఇతర విషయాలు చలింపచేయవు. అతడు మనోవిజయాన్ని సంపాదించినవాడై పరమశాంతిని అనుభవిస్తాడు. మోక్షాన్ని అందుకుంటాడు.

శ్రీకృష్ణార్పణమస్తు.

### శ్రీరామకృష్ణ తీర్థముక్కోటి ఉత్సవం

**తిరుమల క్షేత్ర సానువుల్లో వెలసి ఉన్న అనేక పవిత్ర తీర్థాల్లో శ్రీరామకృష్ణతీర్థం ముఖ్యమైంది. ఇక్కడ తపస్సు చేసిన రామకృష్ణుడను యోగికి పుష్యమాసం పున్నమినాడు శ్రీనివాసుడు ప్రత్యక్షమై వరాలు ఇచ్చాడు. ఆనాడు ఈ క్షేత్రముక్కోటి ఉత్సవం జరుగుతుంది.**



**ప్రతి సంవత్సరం పుష్యమాసం పౌర్ణమి రోజున శ్రీవారి ఆలయంలో ఉదయం, మధ్యాహ్న పూజలు పూర్తి అయిన తర్వాత శ్రీవారి అర్చకులు, వేదపండితులు అధి కారులు, ఊరేగింపుగా శ్రీరామకృష్ణతీర్థానికి వెళతారు. అక్కడ ఉన్న శ్రీరామకృష్ణుల విగ్రహాలకు అభిషేక అర్చన నివేదనలు ఘనంగా నిర్వహించి అక్కడ చేరిన భక్తులకు ప్రసాద వితరణ చేస్తారు. ఈ రామకృష్ణ తీర్థం పాపవినాశన తీర్థానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉంది.**

# తిరుమల క్షేత్రము – ఆళ్వారుల శ్రీసూక్తులు

– శ్రీ జి.మురళీధర్

శ్రీరంగం తర్వాత శ్రీవైష్ణవులు భక్తితో కొలిచే నూట ఎనిమిది దివ్యదేశాల్లో 'తిరువేంగడం' (తిరుమల) చాల ప్రముఖమైంది. ప్రతిరోజూ లక్షలాది భక్తులను ఆకర్షించే ఈ పుణ్యక్షేత్రం 'భూలోక వైకుంఠము'గా పేరు పొందినది.

తిరుమలలో ప్రతిదినం జరిగే ఉత్సవాలలో స్వామి దేవేర్లతో సహా పెళ్లికుమారుని వలె సర్వాలంకార ఆభరణ భూషితుడై దర్శనం ఇస్తుంటాడు. కొన్ని శతాబ్దాల మునుపు ఆళ్వారుల కాలములో కూడ ఇలాగే ఉండేదట. 'స్వామి ధరించిన రత్నపు ఆభరణముల కాంతుల మెరుపు తిరుమల క్షేత్రపు రాత్రి యొక్క చీకటిని పారద్రోలింది' అని నమ్మాళ్వార్ తమ తిరువాయ్‌మొళి ప్రబంధంలో వర్ణిస్తారు. ***"సెందా మరగళ్ పగరల్లై పగల్‌సెయ్ తిరువేన్గడత్తానే" (తిరువాయ్ మొళి–పాశురం 6–10–9)***.

తిరుమళిసై ఆళ్వార్ తమ పాశురంలో **'కుమరన్'** (యౌవనుడు) అని పాడారు. 'ఎక్కడ శ్రీమన్నారాయణుడు సదా యౌవనరూపంతో నిలబడి సాక్షాత్కరిస్తున్నాడో ఆ తిరు వేంగడం క్షేత్రమును దర్శించండి' అని ఆళ్వారు వక్కాణిస్తారు. ఇక్కడ స్వామి శ్రీనివాసుడు ***'నిన్ర తిరుక్కోలం'*** అంటే భక్తుల రాక కోసం ఎదురు చూస్తూ ఉన్నాడా అని తెలిపే రీతిలో నిల్చుకొన్న భంగిమలో సాక్షాత్కరిస్తున్నాడు. పూర్వకాలాల్లో తిరుమల కొండకు యాత్ర చేయడం అన్నది చాలా కష్ట పూరితమైనది. అందుకే 'మనమంతా వయస్సు ముదిరి అశక్తులము కాక మునుపే, చిన్నవయస్సులో ఆరోగ్యంగా ఉన్నపుడే స్వామివారి సందర్శనం చేసుకోవాలి' అని ఆళ్వారులు చెబుతారు.

ఈ ఆత్మానుభవ విషయంలో ఆళ్వారులు మరియు మన ఆచార్యులు శ్రీనివాసునిపై పాడినట్టి శ్రీసూక్తులను స్మరించడంకన్నా వేరొక ఆనందం మనకు ఉండదు.

ఒకచోట ఆళ్వారులు శ్రీనివాసుని దివ్యమంగళశరీరం నల్లని మేఘపు వర్ణముతో ఒక మెరుపు తీగ లాగా ఉన్నదని పోల్చారు. అతనితో బాటు అతని వక్షస్థలమందు దేవేరి యగు అలమేలు మంగమ్మ ఎల్లవేళల కలసి ఉన్నదనియు ఆళ్వారులు కీర్తించారు **('కారైయల్ మన్నర్', 'అలర్మేల్ మంగయ్ ఉరై మార్బా')**. ఈ కలియుగ శ్రీనివాసుడే జగత్తులో ఉన్న సకల జీవాత్ములకు పెన్నిధి మరియు రక్షకుడు అగు శ్రీమన్నారాయణుడు. నిత్య విభూతియగు వైకుంఠమును విడచి మనకు అతిసులభముగ లభించునట్లు ఆ స్వామి తానే ఇష్టపడి ఈ తిరుమలలో వసింప వచ్చెను **('పరన్ సెను సేర్ తిరువేంగడ మామలై')**. త్రివిక్రముడు, రాముడు, కృష్ణుడు మరియు నిత్యసూరులకు దేవదేవుడుగా ఆళ్వారులు శ్రీనివాసుని కొనియాడారు. బ్రహ్మాది దేవతలు తిరుమలకు వచ్చి ప్రతిరోజు శ్రీనివాసునికి ప్రాతఃకాల పూజలు జరిపిస్తారని ప్రతీతి.

శ్రీవైకుంఠనివాసులగు నిత్యసూరులు తమ నాయకు డైన విష్వక్సేనులతో కలసి పూజించి అర్పించిన పుష్పములు ఈ తిరుమల గిరులలో పడి వికసించి తరించుచున్నాయి.

**"వానవర్ వానవర్ కోనొడుం!**
**సిందు పూ మగియుం! తిరువేంగడత్తు!"**
**(తిరువాయ్‌మొళి 3–3–2)**



స్వామి శ్రీనివాసుడు ఏడుకొండలు నెలకొన్న పవిత్ర మైన ఈ తిరుమలక్షేత్రమును తన నివాసముగా చేసు కొన్నాడు. ఇది ఆ శ్రీమన్నారాయణునికి అన్ని విధాల తగిన స్థలము. శ్రీవైకుంఠములో అన్ని వస్తువులు నిత్యసూరులుగా పరిగణించబడుతాయి.

అలాగే తిరుమల క్షేత్రములో ఉన్నట్టి సకలవస్తు వులు, జీవరాశులు మనందరికీ ఆరాధ్యమాన్యములు అని ఆళ్వారులు తలిచారు. ఈ కారణము చేతనే మహాత్ములగు కులశేఖరఆళ్వారులు శ్రీనివాసునికి అతని భక్తులకు సామీప్య మున ఉండడానికి వీలుగా తిరుమలలో మళ్లీ జన్మించాలని కోరుకొన్నారు.

"ఈ తిరువేంగడం క్షేత్రపు స్వామిపుష్కరిణిలో జీవించే ఒక కొంగగా జన్మించాలని ఆశపడుతున్నాను. ఈ పవిత్ర మైన కొండలోని ఏదో ఒక కొలనులో ఒక చేపగా పుట్టాలని అభిలాషపడుచున్నాను. నీ భక్తులు నాపై కాళ్ళు మోపి నడు స్తుంటే ఎల్లప్పుడూ పగడముల వంటి నీ ఎర్రని పెదవులను దర్శించుకొనునట్లు నీ గర్భగుడిలో నేను ఒక రాతి గడప (సోపానము)గా మారాలని కోరుకొంటున్నాను" అని అంటారు కులశేఖర్లు.

ఈ కొండలో ఉండే ప్రతి ఒక్క చేతన, అచేతన వస్తువులను అతి పవిత్రమైనవిగా మన ఆచార్యులు తలచారు.

దీనిని ఉదాహరణగా - పూర్వం శ్రీభగవద్రామా నుజుల శిష్యులైన అనంతాళ్వాన్ తిరుమలక్షేత్రములో ఉంటూ ఒక నందనవనాన్ని పెంచారు. వారు కార్యార్థమై కొండ దిగువన ఉన్న ఒక గ్రామమునకు వెళ్ళవలసి వచ్చింది. వారు మార్గములో భుజించడానికి పెరుగు అన్నమును పొట్లములో మూటకట్టుకొని తీసు కొని వెళ్లారు. సాయంకాల సమయమునకు కొండదిగువునకు చేరారు.



వారు సంధ్యావందనం చేసిన పిమ్మట భుజించుటకై తాము తెచ్చిన పెరుగన్నం పొట్లాన్ని తెరిచి చూడగా, ఆ అన్నపు పొట్లము పూర్తిగా చీమలతో నిండి ఉండింది. అది చూసిన అనంతాళ్వాన్లు చాల దుఃఖించారు. కొండమీద వసిస్తున్న ఈ చీమలన్నీ శ్రీనివాసుని సామీప్యం కోరుకున్నట్టి భాగవతులనియూ, అట్టి భాగవతులను భగవంతుని నుండి విడ దీయుటకు తాను కారణము కాకూడదని భావించి తక్షణమే చీమలతో కూడిన ఆ అన్నపు పొట్లాన్ని జాగ్రత్తగా మూసివేసి వాటిని తిరిగి తిరుమల కొండలో విడిచి పెట్టడానికి తిరుగు ప్రయాణం చేశారట.

**'తెయి కురళ్ అరువి తిరువేంగడత్తు, తెన్నిరై చున నీర్ తిరువేంగడత్తు'** అన్న పాశు రాలలో నమ్మాళ్వార్లు తిరుమల కొండల్లోని అనేక తటాకములు, చెవులు దద్దరిల్లే ధ్వను

లతో కొండ ఎత్తుల్లోంచి దిగువున పారే జలపాతాలను వర్ణించారు. ఈ జలపాతాలు భగవంతుని **"దయా"** గుణము యొక్క మూర్తీభవించిన ప్రతిరూపమేమో అని వేదాంత దేశికులవారు ఈ విధంగా తలచారు.

**"విగాహే తీర్థ బహులాం శీతలాం గురు సంతతిం**
**శ్రీనివాస దయామ్బోధి పరీవాహ పరంపరాం"**

**(దయాశతకం-2)**

పరమాత్మయైన శ్రీనివాసుడు తన విశేషప్రేమను, కరుణను తన భక్తులమీద ప్రసరింప చేస్తాడు.

**'వేఙ్గడమ్'** అనే ఈ క్షేత్రం పేరు మాత్రం పలికితే చాలు, స్వామి యొక్క కటాక్షం మనలను ఆ లక్ష్మీపతియగు శ్రీమన్నారాయణుని నిలయమునకు (వైకుంఠము) చేర్చు తుంది అని తిరుమళిశై ఆళ్వార్ అంటారు.

"శ్రీనివాసుని కరుణ అను ప్రవహించే చెఱకు రసపు నది ఇచ్చట ఘనీభవించి తిరుమల కొండగా మారింది అని పిస్తుంది. అట్టి ఈ తిరుమల కొండకు నేను సాష్టాంగ ప్రణామములు ఆచరిస్తున్నాను" అని అంటారు దేశికులు.

"అమూల్యమైన వజ్రము వంటి శ్రీనివాసుడు వసించు స్థలము వేఙ్గడం అనబడే ఈ తిరుమల. ఇచ్చట ఉండే క్రూరమృగములు, కురువ జాతికి చెందిన వేటగాళ్లు కూడా సాత్వికులై ఆ భగవంతుని సేవిస్తున్నారు. ఆ స్వామి పద కమలాలను ఆశ్రయిస్తే మన పాపకర్మలు, వ్యాధులు నశిస్తాయి" అని ఆళ్వారులు వక్కాణిస్తున్నారు.

గోదాదేవి (ఆండాళ్) తన 'నాచ్చియార్ తిరుమొళి' అను దివ్యప్రబంధములో "స్వామియొక్క కృపాకటాక్షములు తనమీద పడేలా చేయమని" తిరుమలకొండలలో విహరించే మేఘములను దూతగా పంపిస్తుంది.

నమ్మాళ్వార్లు తమ విశిష్టమైన భక్తి ద్వారా శ్రీనివాసుని పాదముల చెంత చేరి "స్వామి శ్రీనివాసా! నీవు మూడు లోకాలను సృష్టి చేసి వాటిని కాపాడుచున్నావు. నీ కీర్తి, శక్తి, సౌందర్యము, దయాగుణములను ఇతరులతో సరిపోల్చ లేము. క్షణకాలమైనా నిన్ను ఎడబాసి ఉండలేనట్టి జీవు లను పరమాత్మని కలుపుటలో పురుషకారత్వముతో వ్యవ హరించే దివ్యమాతయగు శ్రీదేవిని వక్షఃస్థలములో సదా వసింప చేసుకొన్న శ్రియఃపతివి కదా నీవు. నీవే తప్ప వేరే గతి నాకు లేదు. ఇతర ఫలములను ఆశించక దాసుడనగు నేను నీ తిరు చరణములను ఆశ్రయించి వచ్చాను" అని శరణాగతి చేశారు.

"వేయి సూర్యుల ప్రకాశముతో తళతళ మెరిసే నీలపు రత్నము వలె నున్నది ఆ స్వామి దివ్యమంగళ శరీరపు కాంతి. ఈ గోవిందుడే ఆ నాడు గోవర్ధన గిరిని ఒక వేలితో పైకెత్తి పట్టుకొని నందప్రజలను రక్షించాడు. అతడే త్రివిక్ర ముడుగా ముల్లోకాలను రెండు అడుగులతో కొలిచినాడు. ఆ పరమాత్ముడే ఈ పుణ్యగిరిలో నిలబడి మనపై తన కరుణను వెదచల్లుతున్నాడు. ఆ స్వామి యొక్క పాద పద్మ ములే మనకు శరణములు. శరణాగతి గావించి ప్రభు శ్రీనివాసుని భక్తితో కొలవండి" అని స్వామి నమ్మాళ్వార్లు మనకు ఉపదేశము చేస్తున్నారు.

పరంజ్యోతి స్వరూపుడైన శ్రీనివాసుడు మన తండ్రి తండ్రికి తండ్రి అయినవాడు. ఘోషణ జలపాతాలతో కూడి యున్న తిరుమలలో నెలకొనియున్నాడు ఆ స్వామి. మనము సర్వకాల సర్వావస్థల్లో ఎల్లప్పుడూ శ్రీనివాసుని భక్తితో కొలిచి ఎట్టి కొరత లేకుండ దాసభూతులమై సేవా కైంకర్యములు సలిపి ఆ స్వామి హృదయమునకు దగ్గరగా ఉండవలెను.

మనము భగవంతునికి చేయుసేవ, భక్తి అణకువలతో నిగర్వముగా ఉండాలి. అట్టి భగవత్ సేవయే మనందరి ఆత్మలకు పరిపూర్ణత, శాంతి, శాశ్వత సంతోషము లభింప చేస్తాయి.

**ఆళ్వార్ తిరువడిగళే శరణమ్**

**సద్గుణసంపన్నుడైన పరోపకారి**
**తాను బాధపడుతున్నప్పటికీ,**
**ఇతరులకు మేలు చేస్తాడు తప్ప**
**కీడు చేయాలనుకోడు.**
**గంధపు చెక్కను నరికి అరగదీసినా**
**అది ఆనందాన్ని ఇస్తుందే కాని,**
**చేటు చేయదు కదా!**

# భగవత్ స్వరూపం

- శ్రీ పి.వి. లక్ష్మీనారాయణరాజు

అపారజిజ్ఞాసాప్రేమికులైన మన పూర్వీకులు-నిరుపమాన భగవదానంద కాంక్షతో పరమాత్మ స్వరూప స్వభావ సంపత్తిపై నిరంతర తర్క- వితర్క సాధన చేసి, ఆయన గురించి స్వరూపనిరూపణం చేసి ఉన్నారు. భగవజ్జిజ్ఞాసాపరుడైన పోతనామాత్యుడు దేవదేవుని ఇలా మూర్తీభవింపచేశాడు.

**ఉ॥ ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై**
**యెవ్వనియందుడిందు పరమేశ్వరుడెవ్వడు, మూలకారణం**
**బెవ్వడనాది మధ్యలయు డెవ్వడు, సర్వము దానెయైన వా**
**డెవ్వడు వాని, నాత్మభవు నీశ్వరు నే శరణంబు వేడెదన్!**

**(భాగవతం)**

పై సిద్ధాంతం ప్రకారం...

ఈ ప్రపంచాన్ని సృష్టించినవాడు భగవంతుడు. ఈ సమస్త చరాచర విశ్వమంతా ఆయనలోనే నిక్షిప్తమై ఉంది. ప్రళయకాలంనాడు జగత్తు మొత్తం ఆయనలోనే ఇమిడి పోతుంది. ఆ సర్వేశ్వరుడే అన్ని ఘటనాఘటన సంఘర్షణలకు మూలం. 'పుట్టుక-స్థితి-లయం' ఈ మువ్వన్నెల జీవన చక్రానికి పరమాత్మే మూలం. ఇది-అది అనకుండా సర్వమూ ఆయనే.

భగవంతుడు వివిధ అవతారాలలో జనం మధ్యన తిరుగాడి, తన స్పష్టమైన మానవాతీత మహిమలు చూపించి- అబ్బురపరచిన పుణ్యభూమి **భారతదేశం!**

ధర్మభ్రష్టత కలిగినప్పుడల్లా తన మనుషుల్నెవరైనా పంపకుండా తానే స్వయంగా అవతరించి వచ్చి, ధర్మోద్ధరణ చేసిన భగవంతుడు!

భారత-భాగవత-రామాయణాలు కేవలం భగత్స్వరూప నిరూపణకే రచించిన మహోత్కృష్ట పారమార్థిక కథా కావ్యాలు! ప్రపంచవ్యాప్తంగా పరమాత్మ సుస్వరూప నిరూపణం కోసం అత్యద్భుతమైన కథాచక్రనిర్మాణం చేసిన ఇంతటి మహాకావ్యాలు లేవు!

ఈ మహాకావ్యాల కథాగమన మూలబిందువు జ్యోతిర్బిందు స్వరూపుడైన భగవంతుడే కావడం ఆశ్చర్యకరం!

జగత్తంతా నిత్య సంఘర్షణామయం.

గ్రహాలు పరిభ్రమిస్తున్నాయి. నక్షత్రాలు జ్వలిస్తున్నాయి, నిరంతరం చరాచర ప్రకృతి 'చరైవేతి, చరైవేతి' అంటూ ఘోషిస్తోంది. ఆ నిరంతర జ్వలిత- ప్రజ్వలిత బ్రహ్మాండభాండ ఘోషే దేవుడు! దేవుడు ఒక స్థితప్రజ్ఞాత్మక శక్తి పుంజం మాత్రమే కాదు-నరనరాన నర్తిస్తూ ఆపాదమస్తకం ప్రవహించే అపార కుండలినీ చైతన్యం కూడా!

పరమాత్మకు రూపం, ఆకారం లేవంటారు కొందరు. భగవంతుడు ఒక శక్తిస్వరూపం అంటారు మరి కొందరు.

దేవదేవుడు సర్వాంతర్యామి. ఆయన ఏ రూపంలో మలచినా అందులో ఉంటాడు అంటారు ఇంకొందరు! కొందరికి ఆయన సాకారరూపుడు, మరి కొందరికి నిరాకారబ్రహ్మ!

హిందువులు తమకు నచ్చిన రాముడు, కృష్ణుడు, వేంకటేశ్వరుడు మొదలైన ప్రసిద్ధ దేవుళ్ళ విగ్రహాలు రాతితో చెక్కించి, గుడిలో ప్రతిష్ఠించి పూజించుకుంటారు. భగవంతుణ్ణి కొలిచే హిందువుల విగ్రహారాధన ఎంతో సహేతుకమైంది.

భగవంతుడు సర్వాంతర్యామి; సర్వాత్మకుడు; విశ్వవ్యాపి. భగవంతుడు అన్ని వస్తువుల్లోనూ, పదార్థాల్లోనూ నిండి ఉన్నాడు. మరి ఆయన రాతి విగ్రహంలో ఉండడా? ఎందుకుండడు? దేవుడు సమస్తమైన ప్రకృతిలోని ప్రతి పదార్థంలోనూ ఉన్నాడు. రాతితో, కొయ్యతో, మట్టితో, మైనంతో తయారు చేసిన ప్రతి విగ్రహంలోనూ పరమాత్మ ఉంటాడు. సందేహమే లేదు.

దేవుడు ఒక్కడే. ఆయన అంశలు-మహిమలు సందర్భాన్ని బట్టి వేరువేరుగా ఉంటాయి.



ధర్మాన్ని ఆచరించే వ్యక్తికి 'అసాధ్యము' అనేది ఉండదు

ఇలాగ, పరబ్రహ్మ విశ్వవ్యాపి మాత్రమే కాదు, ఆయన కోరుకున్న వారికి కోరుకున్నట్లు గోచరించే "విశ్వభావనా తరంగం!" ఆయన సమంజస సుస్వరూపం సమస్తస్థావర, జంగమ ప్రకృతి నిండా నిబిడీకృతమై దర్శనమిస్తుంది.

"అది ఇది అననేల? ఈ లోకంలో ఒన గూడే సమస్త మైన సంపదలు, బలం, ఉత్సాహం, శక్తి, సామర్థ్యంలాంటి విశేషవిషయాలు కేవలం నా యొక్క అంశ మాత్రమైన తేజస్సు వల్లనే కలుగుతున్నాయి!" అని భగవంతుడు స్వయంగా గీతా శాస్త్రంలో చెప్పాడు!

నిర్మలమైన భగవత్స్వరూప దర్శనంకోసం స్వచ్ఛమైన, శుభ్రమైన పండిన మనస్సు కావాలి. భగవత్స్వరూప దర్శనం మామూలు కంటికి కాన రాదు. అంతరింద్రియదర్శనం చేసి, శుభ్రపడిన నేత్రం మాత్రమే భగవద్దర్శనం చేయగలదు! అందుకే రాయబారిగా వెళ్ళి కౌరవసభలో ధృతరాష్ట్రునికి, రథసారథిగా కురుక్షేత్రంలో అర్జునునికి శ్రీకృష్ణపరమాత్మ సాధారణ నేత్రాల స్థానంలో "దివ్యచక్షువు"లను ప్రసాదించి తన దివ్యరూప సందర్శనం చేసుకోమన్నాడు!

ఉగ్ర జప తప ధ్యానాలు మాత్రమే దేవదేవుని దర్శనం చేయించజాలవు. విద్యావినయ సంపన్నుడైన "సమద్రష్ట" మాత్రమే పరమాత్మను దర్శించగలుగుతాడు.

సృష్టి-స్థితి-లయ!

ఖచ్చితంగా-ఈ త్రిగుణాత్మక ఘటనల సమన్వయా న్వయ పర్యవేక్షక చిద్రూపశక్తే పరమాత్మ! దాన్ని మనం దర్శించలేం. మనకంత శక్తి లేదు. కానీ, అర్థం చేసుకోగలం. దానికి ఎంతో "ప్రజ్ఞ" కావాలి. మామూలు కన్ను కాదు; ప్రజ్ఞా నేత్రం మాత్రమే భగవత్స్వరూపదర్శనం చేసుకోగలదు!



ఏకమూర్తిలో దశావతార చిత్రీకరణ

## తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తులకు పదిరోజుల పాటు వైకుంఠద్వార దర్శనం

***తిరుమలలో డిసెంబరు 25 నుండి, వైష్ణవసంప్ర దాయాన్ని పాటిస్తూ ఎక్కువమంది భక్తులకు వైకుంఠద్వార దర్శనం చేయించడం కోసం మొదటి సారిగా తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని వైకుంఠద్వారాన్ని పది రోజులపాటు తెరచి ఉంచాలని తిరుమల తిరుపతి దేవ స్థానం నిర్ణయించింది. ఇందుకుగాను 26 మంది పీఠాధి పతులు, మఠాధిపతులతో చర్చించి, వారి అభిప్రాయాన్ని తీసుకున్న తర్వాత ఈ పద్ధతిని అమలు చేశారు. శ్రీవైష్ణవ సంప్రదాయం ప్రకారం దేశంలోని అనేకప్రముఖఆలయాలు వైకుంఠ ఏకాదశి నుండి పది రోజులపాటు ఉత్తరద్వారాన్ని తెరచి ఉంచుతారని ఏకగ్రీవంగా ఆమోదించి, వ్రాత పూర్వకంగా అంగీకరించారు. ఈ సందర్భంగా ఎంతోమంది భక్తులు శ్రీవారి వైకుంఠద్వార దర్శనాన్ని చేసుకున్నారు. ఈ అవకాశం భక్తులందరికీ ప్రత్యేకంగా కల్పించబడింది. ప్రత్యేకమైన వైకుంఠద్వార దర్శనం భక్తులకు ఎంతో సంతృప్తి నిచ్చింది. భక్తిమార్గానికి నాందిని కలిగించింది.***

*గత సంచిక తరువాయి భాగం.....*

## అన్నమయ్య వివాహం

తల్లిదండ్రులతో కలిసి ఇంటికి చేరుకున్న అన్నమయ్య హరిసంకీర్తనలతో సమయాన్ని గడిపేవాడు. కొంతకాలానికి అతను యవ్వనవంతుడైనాడు. లక్కమాంబ, నారాయణసూరి దంపతులు తమ గారాలపట్టికి వివాహం చేయదలిచారు. వివాహప్రయత్నంలో భాగంగా కుమార్తెలు కలిగిన వారిని పిల్ల నివ్వమని అడిగారు. కాని "ఎప్పుడూ పరధ్యానంలో గోవిందా! గోవిందా! అంటూ పాటలు పాడుకునే గోవిందనామాల దాస రయ్యకు పిల్లనివ్వము పొమ్మన్నారు". లక్కమాంబ నారాయణ సూరులు భారమంతా ఆ అఖిలభారకుడైన వేంకటేశ్వరునిపై వేశారు. మరుసటిరోజు రాత్రి ఎవరైతే పిల్లనివ్వనన్నారో వారి కలలో స్వామి సాక్షాత్కరించి కన్యలను ఇవ్వమని ఆజ్ఞాపించాడు. మరుసటి రోజు ఉదయం చేసిన పనికి, ఆడిన మాటకి వగచి తమ కుమార్తెలయిన అక్కలమ్మ, తిరుమలమ్మలను అన్నమయ్యకు ఇచ్చి, పెద్దల సమక్షంలో అంగరంగవైభవంగా పెళ్ళి జరిపించారు.




# అన్నమయ్య జీవితచరిత్ర

డా।। మన్నూరు శివప్రవీణ్

## అహోబిలయాత్ర

తిరుమలమ్మ, అక్కలమ్మలతో వివాహం జరిగిన తరువాత అన్నమయ్య వేదాంతవిద్యను అభ్యసించదలచి అహోబిల క్షేత్రానికి వెళ్ళాడు. అక్కడ వైష్ణవాచార్యుడైన శఠకోపముని వద్ద వేదాంతవిద్యను అభ్యసించాడు. బ్రహ్మవిద్యను నేర్చుకున్నాడు. ఆనాటి నుంచి ప్రతీరోజూ శ్రీహరిని పూజించడం, సేవించడం, కీర్తించడం, ఆలోచించడం, ధ్యానించడం వంటి పనులతోనే అన్నమయ్య కాలం గడుపుతున్నాడు.

## సంకీర్తనాయజ్ఞం

స్వామికి సమర్పించే కైంకర్యాలే తన భోగాలుగా భావించేవాడు అన్నమయ్య. వాల్మీకి రామయణంపట్ల మక్కువతో రామాయణ కథలను సంకీర్తనలుగా గానం చేశాడు. ఆ గానామృతాన్ని విన్న వారందరూ అన్నమయ్య తుంబురుడో, నారదుడో, లేక గంధర్వుడో అయి ఉంటాడు కాని సాధారణ మానవుడు మాత్రం కాదని ప్రశంసించే వారు.

## సాళువ నరసింహరాయలు

తాళ్లపాక సమీపంలోని టంగుటూరు అనే పట్టణానికి పరిపాలకుడైన, సంగమ వంశీయుడైన సాళువ నరసింహ రాయలు అన్నమయ్య గానామృతధారను గురించి విని, అట్టి మహానుభావుడిని దర్శించుకోవాలనే కుతూహలంతో అన్నమయ్య దగ్గరకు వెళ్ళి గౌరవపురస్సరంగా అభివాదం చేశాడు. తనతో తన ఊరు వచ్చి తన ఆస్థానాన్ని పావనం చేయమని అన్నమయ్యను అర్థించాడు.

వైష్ణవభక్తుణ్ణి తిరస్కరించకూడదని అన్నమయ్య సుముఖత వ్యక్తం చేసి, నరసింహరాయలు ఏర్పాటు చేసిన పల్లకీ ఎక్కి టంగుటూరుకు వెళ్ళాడు. అక్కడి చెన్నకేశవ స్వామిని దర్శించి, ఆ దేవాలయ సమీపంలోని విడిదిలో ప్రవేశించాడు. అది మొదలుగా నరసింహరాయలు అన్నమయ్యను హితుడుగా, గురువుగా, బంధువుగా భావించి గౌరవించేవాడు. ప్రతీపని అన్నమయ్యకు చెప్పి చేసేవాడు. అన్నమయ్య ఆశీర్వాద బలంతో సాళువనరసింహరాయలు పెనుగొండకు వెళ్ళి రాజ్య పాలనను సాగించాడు.



క్రమం తప్పకుండా 'జ్ఞానాన్ని' వినియోగం చేస్తే, అది ఎప్పుడూ పెరుగుతూనే ఉంటుంది

అన్నమయ్యను ఆ నగరానికి ఆహ్వానించి, గౌరవించి జనరంజకమైన శ్రీవేంకటేశ్వర కీర్తనలను ఒక్కసారి పాడి, విని పించి తన్ను తరింపజేయమని ప్రార్థించాడు.

'ఏమొకో చిగురు టధరమున యెడనెడఁ గస్తూరి నిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదు గదా!
కలికి చకోరాక్షికిఁ గడకన్నులు గెంపైతోఁచిన
చెలువంబిప్పు డిదేమో చింతింపరె చెలులు
నలువునఁ బ్రాణేశ్వరుపై నాటిన యాకొనచూపులు
నిలువునఁ జెరుకఁగ నంటిన నెత్తురు కాదుగదా! (5-82)

అంటూ నరసింహరాయల మాటను మన్నించి అన్న మయ్య తన గానామృతంతో వేంకటేశాంకితమైన సంకీర్తనలను పాడి, వినిపించాడు. పరిశుద్ధమైన తేనెలా, తేటపరచిన చెఱకు రసంలా, చల్లని మలయమారుతంలా, కర్పూరపు సువాసనలా, చెవులకు అమృతధారలా, పాల మీగడలా ఉండే అన్నమయ్య గానమాధుర్యానికి ముగ్ధుడయ్యాడు. 'ఆహా! ఓహో! అద్భుతం!' అంటూ అన్నమయ్యను స్తుతించాడు. పరిపరివిధాలుగా పొగి డాడు. పలుపలు విధాలుగా సత్కరించాడు. ఆనాటి నుండి సాళువ నరసింహరాయలు ప్రతిరోజూ అన్నమయ్య వేంకటేశ్వరుని స్తుతిస్తూ పాడే సంకీర్తనలు వింటూ కాలం గడిపేవాడు.

ఒకనాడు నరసింహరాయలు రాజరిక స్వతఃసిద్ధ తామసంతో వేంకటేశ్వరుని స్తుతిస్తూ పాడిన చందంగానే తనను కీర్తిస్తూ ఒక పదం పాడమన్నాడు.

ఆ మాట వినగానే అన్నమయ్య 'హరి! హరీ!' అంటూ–

బరమ పతివ్రతాభావంబు బూని
హరి ముకుందునిఁ గొనియాడు నా జిహ్వ
నిను గొనియాడంగ నేర దెంతైన
ననునెట్లు పలికితి నైచ్యంపుఁ బలుకుఁ
నాయచ్యుతునిఁ దక్క నన్యుల వినుతి
సేయుట నా కన్న చెలియలివావి
(అన్నమాచార్య చరిత్ర, పుట. 328)

"ఆ హరిని స్తుతించే నాలుకతో ఇతరులను స్తుతించ లేను. నాతో ఈ నీచమైన పలుకులెలా పలికావు. శ్రీనివాసుని తప్ప ఇతరులను స్తుతించడం నాకు చెల్లెలితో కాపురం చేయడం వంటిదని" తిరస్కరించాడు అన్నమయ్య. "నాకు



నువ్వూ వద్దూ, నీ స్నేహమూ వద్దని" తిరస్కరించాడు. ఆ మాటలకు కోపోద్రిక్తుడైన నరసింహరాయలు అన్నమయ్యను బంధించి మూరురాయరగండ సంకెళ్ళు తగలించమని సేవ కులకు ఆజ్ఞ ఇచ్చాడు. అన్నమయ్యను బంధించడం ఇష్టం లేక పోయినా వారు రాజాజ్ఞను శిరసావహించవలసి అన్నమయ్యను సంకెళ్ళతో బంధించారు.

ఆఁకటి వేళల నలపైన వేళలను
తేఁకువ హరినామమే దిక్కు మఱిలేదు
కొఱమాలి వున్న వేళ కులము చెడిన వేళ
చెఱవడి వొరులచేఁ జిక్కిన వేళ
వొఱపైన హరినామ మొక్కటే గతిగాక
మఱచి తప్పిననైన మఱిలేదు తెఱఁగు
.........................................
సంకెళ బెట్టిన వేళ చంపఁ బిలిచినవేళ
అంకిలిగా నప్పుల వా రాఁగిన వేళ
వేంకటేశు నామమే విడిపించ గతిగాక
మంకు బుద్ధిఁ బొరలిన మఱిలేదు తెఱఁగు (1-158)

అంటూ అన్నమయ్య సంకీర్తన పాడగానే బంధన శృంఖలాలు ఊడి పడిపోయాయి. కావలి వాళ్ళ గుండె లదిరాయి. భయంతో వెంటనే రాజు దగ్గరకు వెళ్ళి విషయాన్ని ఏకరువుపెట్టారు. రాజు నమ్మలేదు. నవ్వుకున్నాడు.

అన్నమయ్య దగ్గరకు వచ్చి "సేవకులను బెదిరించి మాయ చేస్తున్నావు. నీవెన్ని మాయలు పన్నినా నేను విడువను" అంటూ మళ్ళీ సంకెళ్ళు వేయమన్నాడు. రాజు మూర్ఖత్వానికి అన్నమయ్య నవ్వుకున్నాడు. సేవకులు మళ్ళీ అన్నమయ్యను బంధించారు.

మునుపటి సంకీర్తననే మళ్ళీ ఆర్తిగా పాడాడు అన్నమయ్య. చిటికెన వేలంత ఉన్న చీలలు ఊడిపోయి సంకెళ్ళు నేలరాలాయి. ఈసారి రాజు కూడ భయపడ్డాడు.

అన్నమయ్య పాదాలపై పడ్డాడు. కన్నీరు కార్చాడు. బొంగురుపోయిన గొంతుతో "గురువర్యా! చేయరాని పాపం చేశానని" మన్నించమని పరిపరివిధాల ప్రాధేయపడ్డాడు. నీవే నా వేంకటేశుడవని, తన మీద దయచూపమని వేడుకున్నాడు. పన్నీటితో కాళ్ళు కడిగాడు. పల్లకిలో కూర్చుండ బెట్టి తానే స్వయంగా పల్లకీ మోశాడు. అతని పశ్చాత్తాపాన్ని గమనించిన అన్నమయ్య అతన్ని మన్నించి "నేటి నుండి హరిని కీర్తించేవారిని సాధారణ వ్యక్తులుగా కాక పరమపూజ నీయులుగా భావించ మని" చెప్పాడు.

ఇంకా "ధ్యానం చేయడం వలన కృతయుగంలో, యజ్ఞం చేయడం వలన త్రేతాయుగంలో, అర్చించడం వలన ద్వాపరయుగంలో, నామసంకీర్తన ద్వారా కలియుగంలో ఆ శ్రీహరి భక్తులను అనుగ్రహిస్తాడు. కాబట్టి నీవు దేవాదిదేవు డైన శ్రీవేంకటేశ్వరునిపై భక్తితో ఆ స్వామి భక్తుల మీద భక్తితో జీవించు" అని అన్నమయ్య తిరుమలకు చేరుకున్నాడు.

తిరుమలకు చేరుకున్న అన్నమయ్య 516 ద్విపద పాదాలతో కూడిన 'శృంగార మంజరి' అనే ద్విపదకావ్యాన్ని రచించి శ్రీనివాసునికి అంకితమిచ్చాడు. అనేక సంకీర్తన లతో స్వామిని స్తుతించడం వలన అన్నమయ్యకు వాక్శుద్ధి కలిగి ఆయన మాటకు దివ్యత్వమబ్బింది. క్రమంగా అన్న మయ్య తిరువేంకటనాయకుడైన వేంకటేశ్వరుని ఆస్థానగాయకు డయ్యాడు.

*(ఇంకా ఉంది)*

**విశ్వదాభిరామం**

## స్థానబలం

**వేమన పద్యసూక్తి**

**నీళ్లలోన మొసలి నిగిడి యేనుగు బట్టు;**
**బయట కుక్కచేత భంగపడును;**
**స్థానబలిమి గాని తనబల్మి గాదయా!**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**అర్థాలు:** మొసలి = నీటిలోని బలమైన జంతువు; స్థాన బలిమి = అతడున్న స్థానమువలన కలిగినబలం; భంగపడును = అవమానపడును.

**భావం:** నీళ్లలో ఉన్నప్పుడు మొసలి ఏనుగునైనా బంధిస్తుంది. నీళ్లు దాటి బయటకు వస్తే కుక్కచేత కూడా అవ మానం పొందుతుంది. అది స్థానబలమే కాని తన బలం కాదు.

**వివరణ:** అధికారి తన అధికారం క్రింద ఉన్న వ్యక్తులపై అధికారశక్తిని చూపించగలడు. కాని, తన అధికార పరిధి కానిచోట అధికారాన్ని చూపాలనుకుంటే అతిసామా న్యుడు కూడ అతడిని లెక్క చేయడు.



రాజు అయినా ఇతరుల రాజ్యంలో సామాన్యుడే కదా. మంత్రి పదవిలో ఉంటే అది ఉన్నన్నాళ్ళూ అందరూ గౌరవిస్తారు. ఆ పదవి పోయిన తరువాత ఎవరూ పట్టించుకోరు. ఏదో ఒక విషయంలో తాము గొప్పవారు అయినంత మాత్రాన అన్నిచోట్ల తాము అంతే అధికులమని ఎవ్వరూ అహంకరించగూడదు. తమ శక్తి తెలుసుకుని తగిన విధంగా నడుచుకోవాలి.

– విద్వాన్ కట్టా నరసింహులు



ఆత్మయొక్క ధ్యానం పరమాత్మను చేరువగుటకు మార్గము

# శ్రీవారి సన్నిధిలో... పెద్దశాత్తుమొఱ

– ఆచార్య చక్రవర్తి రంగనాథన్

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీశ్రీనివాసుని దివ్యసన్నిధిలో సంవత్సరం పొడవునా అనేక ఉత్సవాలు జరుగు తూనే ఉంటాయి. అందులో నిత్యోత్సవ, వారోత్సవ, పక్షోత్సవ, నక్షత్రోత్సవ, మాసోత్సవ, అయనోత్సవ, సంవత్సరోత్సవా లని అనేకములు. వీటిలో మహదుత్సవంగా, పెద్దఉత్సవంగా పేర్కొనే వాటిలో దాదాపు ఇరవైఅయిదు రోజుల పాటు జరిగే **'అధ్యయనోత్సవం' (పెద్దశాత్తుమొఱ)** ఒకటి.

అగాధ భగవద్భక్తి సింధువులైన పన్నిద్దరు ఆళ్వార్లు చేత రచించబడిన నాలుగువేల దివ్యప్రబంధ సేవాకాలం (పారా యణం) తిరుమల తిరుపతి దేవస్థానపు పెద్దజియ్యంగార్ స్వామి ఆధ్వర్యంలో శ్రీవైష్ణవులందరూ కలిసి సామూహికంగా తిరుమల దేవాలయంలో రంగనాయకమండపంలో శ్రీభూసమేతుడై మలయప్పస్వామి పెద్దశేషవాహనంలో సుఖాసీనుడై ఉండగా, విష్వక్సేనులవారు మరియు పన్నిద్దరు ఆళ్వారులకు ప్రతినిధిగా భగవద్రామానుజాచార్యులవారు వేంచేసియుండగా, పారాయణం చేయడం జరుగుతుంది.

ఇదొక అద్భుతమైన, అద్వితీయమైన,అనుపమమైన, అందమైన, అధ్యయనోత్సవం. కవీ వినీ ఎరుగని రీతిలో తిరు మలలో మాత్రమే 25 రోజులపాటు జరిగే దివ్య, భవ్య, నవ్య, అధ్యయనోత్సవం.

## అధ్యయనోత్సవమనగా...

భగవంతుని యొక్క ఉచ్ఛ్వాస-నిశ్వాసరూపములైన వేద ముల యొక్క అధ్యయన, అధ్యాపన నియమాలను పరిశీలించిన యెడల సంవత్సరంలో ఉత్తరాయణంలో వేదాధ్యయనం, దక్షిణా యనంలో వేదాంగాల అధ్యయనం చేయాలి. అలాగే శుక్లపక్షం, కృష్ణపక్షం అనే విభాగం ద్వారా ప్రతిమాసంలోనూ అష్టమితిథి,



చతుర్దశితిథి, పౌర్ణమితిథి, పాడ్యమితిథులు, అమావాస్యతిథులు వేదాధ్యయనానికి అనర్హమైన తిథులుగా పరిగణించబడు తాయి. అలాగే ఆళ్వార్ల ముఖారవిందముల నుండి వెలువడిన **నాలాయిర దివ్యప్రబంధానికి** కూడ పైన చెప్పిన నియమాలు ఇంచుమించు ఒకే మాదిరిగా ఉంటుంది.

కానీ, దివ్యప్రబంధవిషయంలో కొంతమార్పు ఉన్నది. సంవత్సరంలో దాదాపు రెండునెలల పాటు ఈ దివ్యప్రబంధా ధ్యయనం నిలిపి వేయబడుతుంది. దానికి కారణం ప్రపన్నజన సంతాన కూటస్థులైన శ్రీనమ్మాళ్వార్ల విగ్రహాన్ని, తిరుమంగై ఆళ్వార్లు అనబడు పరకాలసూరులు వేంచేపు చేసుకొని ఆ విగ్రహాన్ని ప్రతిష్ఠించి దివ్యప్రబంధానుసంధానం చేశారు. ఆ మధ్యకాలంలో నమ్మాళ్వార్లు లేనందువల్ల దివ్యప్రబంధాను సంధానం చేయలేదు. కనుక దానిని 'అనధ్యయన' కాలంగా పూర్వాచార్యులు పరిగణించి, వైకుంఠఏకాదశికి ముందు పదిరోజుల నుండి ఏకాదశి తరువాత పదిరోజుల వరకు 21 రోజులపాటు స్వామి సన్నిధిలో నిలిచిపోయిన "ఈ నాలాయిర దివ్యప్రబంధాన్ని" తిరిగి విన్నవించే విధానాన్ని ఏర్పరచారు, కనుక ఈ విన్నపం **"అధ్యయనోత్సవం"(పెద్దశాత్తుమొఱ)**గా ప్రసిద్ధిచెందినది.

దివ్యప్రబంధ నిషేధకాలం "సౌరమానం ప్రకారం, తమిళ సంప్రదాయానుసారం, కార్తికనెల కృత్తికాదీపోత్సవం మొదలు వైకుంఠ ఏకాదశిముందు పదిరోజులవరకు ఉంటూ, కూరత్తాళ్వారుల అవతారనక్షత్రమైన తమిళ తై నెల హస్తానక్షత్రం వరకు ఈ అనధ్యయనకాలం ఉంటుందని పూర్వాచార్యుల నియమం".

108 దివ్యదేశాలలోను, అభిమానస్థలాలలోను, శ్రీవైష్ణవ ఆలయాలలోను ఈ నియమం కొనసాగుతుంది. శ్రీవైష్ణవులు తమ తమ ఇండ్లలో ఈ కాలంలో దివ్యప్రబంధాన్ని పఠించరు. ఆ యా దేశాలలో, తత్తత్ సంప్రదాయానుసారం అధ్యయ నోత్సవాలు జరిగిన తరువాత తమ తమ గృహాలలో

దివ్యప్రబంధాన్ని తిరిగి కొనసాగిస్తారు. ఈ అనధ్యయనకాలంలో శ్రీవైష్ణవులు దేశిక 'ప్రబంధాలను', మణవాళమహామునుల 'ఉపదేశరత్తినమాలై' మొదలగు ప్రబంధాలను అనుసంధానం చేసుకొంటారు. తిరుమంగై ఆళ్వారులు నమ్మాళ్వార్లను స్వతంత్రంగా వేంచేపు చేసిన కాలానికి ఒక సంకేతమే ఈ అనధ్యయన కాలం. తదుపరి అధ్యయనాన్ని ఆరంభించడమే ఈ అధ్యయనోత్సవ పరమార్థం.

శ్రీవైష్ణవదివ్యదేశాలలో, ఆలయాలలోనూ దివ్యప్రబంధ అధ్యయనం తప్పక జరిగితీరాలని పాంచరాత్ర సంహితలు స్పష్టంగా పేర్కొంటున్నాయి. ఈ విషయాన్ని ఈశ్వర, శ్రీప్రశ్నాది సంహితలలో మనం చూడవచ్చు. నిత్యమూ జరగకపోయినా కనీసం సంవత్సరంలో ఒక్కసారైనా ఈ నాలుగు వేల దివ్య ప్రబంధం తప్పక దేవదేవుని ఎదుట విన్నవించాలని ఆచార్య సార్వభౌములైన శ్రీరంగనాథమునుల కట్టడి. కనుక ఆనాటి నుండి ఈ నాటి వరకూ అవిచ్ఛిన్నంగా ఈ సంప్రదాయం అన్ని దివ్యదేవాలయాల్లో కొనసాగుతూనే ఉన్నది.

## అధ్యయనోత్సవ సమయనియమం

ఈ అధ్యయనోత్సవం *'వైకుంఠ ఏకాదశి'* నుండి ప్రారంభించి, పదిరోజులపాటు జరగాలని ఒక నియమం ఉన్నది. నమ్మాళ్వార్ల **'తిరువాయ్‌మొళి'** ప్రబంధాన్ని రోజుకొక **'పత్తు'** (పది పాశురములు) చొప్పున అనుసంధానం చేయవలె. తదుపరి నమ్మాళ్వార్లకు **'తిరువడి తొళుదల్'** అంటే నమ్మాళ్వార్ల విగ్రహాన్ని స్వామి పాదారవిందాలయందు వేంచేపు చేసి (ఉంచి), తులసీదళాలతో కప్పి, ఆళ్వార్లు పరమపదాన్ని పొందినట్లు, తరువాత లోకోద్ధరణం కొరకు "మా ఆళ్వారులను మాకు ప్రసాదించమని" ప్రార్థించగా, దేవదేవుడు భక్తులకోరిక మేరకు ఆళ్వారులను తిరిగి పంపించి అనుగ్రహిస్తారు. దీనినే **"పరమపదోత్సవం, ప్రపన్నోత్సవం, అధ్యయనోత్సవం, మోక్షోత్సవం"** అని వ్యవహరిస్తారు పెద్దలు.

**తిరుక్కుడందై ఆరావముదన్** సన్నిధిలో మాత్రం ఈ అధ్యయనోత్సవం ప్రతి సంవత్సరం మార్గళిమాసం, ధనుర్మాసం ప్రారంభదినం నుండి ఆరంభించి 20 రోజులపాటు జరుగుతుంది. మిగతా దివ్యదేశాలలో వైకుంఠ ఏకాదశిని ఉద్దేశించి ముందు పదిరోజులపాటు **'పగల్‌పత్తు ఉత్సవాన్ని'**, వైకుంఠ ఏకాదశి నుండి **'రాపత్తు ఉత్సవాన్ని'** నిర్వహిస్తారు.

## అధ్యయనోత్సవం ఎలా...

శ్రియః పతికి నిత్యారాధనలు పూర్తి అయిన తరువాత ఆ యా దివ్యదేశ దేవాలయాల నియమానుసారం ఒక్కొక్క ఉత్సవానికి ఒక్కొక్క మండప విధానంగా అధ్యయనోత్సవ మండపానికి శ్రీభూసమేతుడై స్వామిని వేంచేపు చేసికొని విష్వక్సేనులు, ఆళ్వార్లు, ఆచార్యులు వెంటరాగా, సింహాసనంలో స్వామిని అధిష్ఠింపచేసి, లక్ష్మీవల్లభునికి ఇరువైపులా ఆళ్వారాచార్యాదులను వేంచేపు చేసి, స్వామికి నైవేద్యాన్ని సమర్పించి **"సాదిత్తు అరుళాయ్"** (విన్నవించండి) అని స్థానాచార్యులు ప్రార్థించగా, శ్రీవైష్ణవులు దివ్యప్రబంధాలను మొదలుపెట్టి శాత్తుమొఱైను నిర్వహిస్తారు. **'పగల్‌పత్తు'** (తెల్లవారి చెప్పే ప్రబంధాలు)లో 3వేల పాశురాలను పఠిస్తారు పదిరోజులపాటు. **'రాపత్తు'** (రాత్రి పూట చెప్పే ప్రబంధం)లో నమ్మాళ్వార్ల "తిరువాయ్‌మొళి" దివ్యప్రబంధాన్ని పదిరోజులపాటు అనుసంధిస్తారు. ఇదే అధ్యయనోత్సవ క్రమం.

## తిరువేంగడంలో అధ్యయనోత్సవాలు

**తిరుమంగై ఆళ్వార్లచేత** ప్రారంభించబడిన ఈ అధ్యయనోత్సవం తిరుమల శ్రీవారి సన్నిధానంలో అత్యంత వైభవోపేతంగా జరుగుతాయి. తిరుమల శాసనాల ప్రకారం 1253, 1360, 1446 సంవత్సరాలలో అధ్యయనోత్సవాలు పాక్షికంగా, సంపూర్ణంగా జరిగినట్టు ఋజువు చేస్తున్నాయి. ఏది ఏమైనా జగద్గురువులైన భగవద్రామానుజాచార్యుల వారి కట్టుదిట్టమైన విధివిధానాలతో తిరుమల క్షేత్రంలో ఆగమ, సంప్రదాయాలు కొనసాగుతూ ఉండటానికి ఈ అధ్యయనోత్సవమే ఒక నిదర్శనం. తిరుమల ప్రథమ పౌరునిగా, శ్రీవారికి తీర్థకైంకర్యం చేసి తరించిన మహిమాన్వితులైన **తిరుమలనంబి** వారు, స్వామివారికి పుష్పకైంకర్యం చేసి తరించిన **అనంతాళ్వానులు** ఈ అధ్యయనోత్సవానికి సాక్షీభూతులని పూర్వాచార్యుల విశ్వాసం. **అన్నమయ్య** పదాలలోను అధ్యయనోత్సవం తొణికిసలాడుతుంది.

వైకుంఠ ఏకాదశికి 11 రోజులముందు మలయప్ప స్వామి గర్భాలయం నుండి శ్రీభూసమేతుడై, విమానప్రాకార ప్రదక్షిణంగా అలనాడు కావేరీనదీతీర విహార రసికుడైన శ్రీరంగనాథుడు కొద్దికాలం పాటు వేంచేసియుండి నిత్యారాధనలు గైకొన్న "రంగనాయకుల మండపానికి" విచ్చేయగా, స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడైన విష్వక్సేనులవారు, పన్నిద్దరు


శ్రద్ధగా పనిచేయకుండా ఎవరూ మంచి ఫలితాన్ని పొందలేరు

ఆళ్వారుల ప్రతినిధిగా, ఆదిశేషావతార సంభూతుడైన భగవద్రామానుజాచార్యులవారు, విమానప్రదక్షిణంగా రంగనాయకుల మండపానికి వేంచేస్తారు. శేషాద్రిశుణ్ణి ఆదిశేషునిపై శ్రీభూసమేతంగా వేంచేపు చేసి, సకలాభరణాలను, సుగంధభరితమాలలను ధరింపజేసి, నైవేద్యాన్ని సమర్పించి, విష్వక్సేనులను, భగవద్రామానుజాచార్యులను శ్రీవారి వామభాగంలో సుఖాసీనులు చేసిన పిదప, తిరుమల తిరుపతి దేవస్థానపు పెద్ద జియ్యంగార్ స్వామి ఆధ్వర్యంలో, చిన్నజియ్యంగార్ స్వామి, ఏకాంగి, ఆచార్యపురుషులు, అధ్యాపకులు, మరియు ఇతర శ్రీవైష్ణవులందరూ సామూహికంగా **"సాదిత్తు అరుళాయ్"** (విన్నవించండి) అని పెద్దజియ్యర్ స్వామి ప్రారంభింపగా అందరూ దివ్యప్రబంధాన్ని అనుసంధానం చేస్తారు. దాదాపు తిరుమలలో 25 రోజుల పాటు ఈ అధ్యయనోత్సవం నిర్వహింపబడుతుంది. **'పగల్‌పత్తు'** అనే పదిరోజులలో రాత్రిపూట, తదుపరి రోజు తెల్లవారి పఠించబోయే దివ్యప్రబంధం యొక్క ఆరంభపాశురాలు స్వామి వారికి విన్నవించబడుతాయి. **'రాపత్తు'**లో తిరువాయ్‌మొళి దివ్యప్రబంధంలోని ఒక్కొక్కపత్తు (నూఱు పాశురాలు) విన్నవించబడుతాయి. తిరుమలలో నమ్మాళ్వార్ల విగ్రహం లేనందువల్ల పరమపదోత్సవం నిర్వహింపబడదు. మిగతా దివ్యదేశాల్లో పరమపదోత్సవం అత్యంత మనోహరంగా నిర్వహింపబడుతుంది. తిరుమలలో సర్వమూ 'భగవద్రామానుజులే' కనుక వారికే సకల విధ మర్యాదలు జరుగుతాయి. పగల్‌పత్తులో జరిగే శాత్తుమొఱను 'చిన్నశాత్తుమొఱ' అని రాపత్తులో జరిగే శాత్తుమొఱను **'పెద్దశాత్తుమొఱ'** అని తిరుమల క్షేత్రంలో వ్యవహరించడం సత్సంప్రదాయం.

## సప్తాద్రీశుని సన్నిధిన అధ్యయనోత్సవ పరంపర

మొత్తం 25 రోజులపాటు ఈ అధ్యయనోత్సవం జరుపబడుతుంది. మొదటి పదిరోజులు ఇయఱ్పా, ముదలాయిరం, పెరియతిరుమొళి అనే 3 ప్రబంధాలలోని మూడువేల పాశురాల పఠనం తెల్లవారి తోమాలసేవ అయిన తరువాత రంగనాయకుల మండపంలో అనుసంధింపబడుతాయి. రాపత్తులో "తిరువాయ్‌మొళి" ప్రబంధానుసంధానం. తరువాత 22వ రోజు కణ్ణినుణ్ శిఱుత్తాంబు, 23వ రోజు ఇరామానుశనూత్తందాది, ఉపదేశరత్తినమాలై, 24వ రోజు క్షేత్రాధీశుడైన వరాహస్వామివారి సన్నిధిలో అధ్యయనోత్సవం, 25వ రోజు తిరుమలనంబి వంశీయులద్వారా 'తణ్ణీర్ అముదు' ఉత్సవం ("తీర్థాభిగమన అమృతోత్సవం" అని వ్యవహరిస్తారు.) జరుగుతుంది.

## అధ్యయనోత్సవాలు - తిరుమల

| రోజు | పగల్‌పత్తు ఉత్సవం-పాశురాలు | ఆళ్వారుల పేరు |
|---|---|---|
| 01. | "ఇయఱ్పా" తొడక్కం | పొయ్‌గై, పూద, పేయ్, తిరుమళిశై, శఠకోపన్ |
| 02. | "తిరుప్పల్లాండు" తొడక్కం | పెరియాళ్వార్ |
| 03. | "శెన్నియోంగు"తొడక్కం | పెరియాళ్వార్ |
| 04. | "విణ్ణీలమేలాప్పు" | ఆండాళ్ నాయ్‌చ్చియార్ |
| 05. | "ఊనేఱు శెల్వత్తు" | కులశేఖరాళ్వార్ |
| 06. | "వాడినేన్ వాడి" | తిరుమంగైఆళ్వార్ |
| 07. | "వాడమరుదిడైపోగి" | తిరుమంగైఆళ్వార్ |
| 08. | "పండైన్నాత్తెయుమ్" | తిరుమంగైఆళ్వార్(5-7) |
| 09. | "తెళ్లియార్ దేవర్క్కుం" | తిరుమంగైఆళ్వార్(8-2) |
| 10. | "కాదిల్ కడిప్పిట్టు" | తిరుమంగైఆళ్వార్(10-7) |
| 11. | 'చిన్నశాత్తుమొఱ' "తిరునెడుందాండగమ్" | తిరుమంగై ఆళ్వార్ |
| | **రాపత్తు ఉత్సవం-పాశురాలు** | |
| 12 | "తిరువాయ్‌మొళి" ముదల్‌పత్తు | నమ్మాళ్వార్లు |
| 13 | "తిరువాయ్‌మొళి" రెండవపత్తు | " |
| 14 | "తిరువాయ్‌మొళి" మూడవపత్తు | " |
| 15 | "తిరువాయ్‌మొళి" నాల్గవపత్తు | " |
| 16 | "తిరువాయ్‌మొళి" ఐదవపత్తు | " |
| 17 | "తిరువాయ్‌మొళి" ఆరవపత్తు | " |
| 18 | "తిరువాయ్‌మొళి" ఏడవపత్తు | " |
| 19 | "తిరువాయ్‌మొళి" ఎనిమిదవపత్తు | " |
| 20 | "తిరువాయ్‌మొళి" తొమ్మిదవపత్తు | " |
| 21. | "తిరువాయ్‌మొళి" పత్తాంపత్తు 'పెద్దశాత్తుమొఱ' | " |
| 22. | 'కణ్ణినుణ్ శిరుత్తాంబు' | మధురకవి ఆళ్వారు |
| 23. | 'ఇరామానుశనూత్తందాది' 'ఉపదేశరత్తినమాలై' | అముదనార్, వరవరముని |
| 24. | వరాహస్వామి సన్నిధిలో అధ్యయనోత్సవం (ఏకాంతం) | |
| 25. | తణ్ణీర్అముదు ఉత్సవం (తిరుమలనంబి వంశీయులు) (అధ్యయనోత్సవ సమాప్తి) | |



తిరుమల పెద్దజియ్యంగార్ స్వామి ఆధ్వర్యంలో దివ్యప్రబంధానుసంధానం వలె, తిరుమలనంబి వంశీయులైన, ప్రథమాచార్య పురుషులైన **'తోళప్పాచార్య'**స్వామి ఆధ్వర్యంలో వైకుంఠ ఏకాదశినాడు మలయప్పస్వామివారికి చతుర్వేద విన్నపం పారాయణం ప్రారంభింపబడి, పదిరోజులపాటు దేవస్థాన వేదపారాయణదారులచేత ఋగ్వేద, యజుర్వేద, సామ వేద, అథర్వణవేదాల పారాయణం నిర్వహింపబడి 10వ రోజు సాయంకాలం రంగనాయకుల మండపంలో శ్రీభూసమేతుడైన మలయప్పస్వామి పెద్దశేషవాహనంలో సుఖాసీనుడై ఉండగా, అత్యద్భుతంగా, అద్వితీయంగా ఎక్కడలేనటు వంటి విధంగా, చతుర్వేదపారాయణ శాత్తుమొఱ జరుగును.

శ్రీవేంకటవిభునికి సంస్కృతవేదం, ద్రావిడ వేదం సూర్యచంద్రులవలె రెండునేత్రాలు కదా! వేంకటగిరి వైభవం వలె వేంకటగిరీశుని సన్నిధానంలో నిర్వహింపబడే "అధ్యయనోత్సవం" కూడ అత్యంత వైభవోపేతమే. ఈ అధ్యయనోత్స వాలలో భగవద్రామానుజాచార్యులవారికి మూడు రోజులు శ్రీవారి జయవిజయుల దగ్గర విశేష మంగళాశాసనం ఉంటుంది. శ్రీనివాసుని శఠారి మర్యాదలను శ్రీభాష్యకారులు అందుకోవడమే విశేషమైన విషయం.

తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో అధ్యయ నోత్సవాలు తిరుమలలో సమాప్తమైన తరువాతి అమావాస్య నుండి 24రోజుల పాటు జరుగును. జనవరి 14 నుండి ఫిబ్రవరి 6వ తేది వరకు జరుగును.

భక్తాదులు ఈ అధ్యయనోత్సవాలలో పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులగుదురుగాక!

*"నమామ్యహం ద్రావిడ వేదసాగరం"*

## శ్రీవారి పారువేట ఉత్సవం

అరిషడ్వర్గాల ప్రభావానికి లోనైన ఇంద్రియాల ప్రేరణతో నిలకడలేక పోరాడుతూ ఉండే చంచలమైన మనస్సే ఒక మృగం. అలాంటి స్థిరత్వం లేని భక్తుని మనస్సును పంచాయుధాలతో (శంఖ, చక్ర, గదా, ధనుః, ఖడ్గము) శ్రీవేంకటేశ్వరస్వామి వేటాడి పట్టుకొని ఏకాగ్రతను ప్రసాదించడమే ఈ 'పారువేట' ఉత్సవ నిర్వహణలోని అంతరార్థంగా అధ్యాత్మవిదులు ప్రవచిస్తారు.

శ్రీస్వామివారు పంచాయుధాలను ఎక్కుపెట్టి పరు గెడుతుండగా, శ్రీస్వామివారు ముందు శ్రీవారి రూపంగా భాసించిన అర్చకస్వామి వెండిబల్లెన్ని(ఈటెను) చేతబట్టుకొని మహాఅట్టహాసంగా ముందుకు పరుగెడుతూ జంతువులను వేటాడతారు. ముందున్న మృగాలు పారిపోతాయి. ఆ వెంటనే మళ్లీ వెనక్కు వెళ్లి యథాస్థానంలో నిలబడతారు. మళ్లీ శ్రీస్వామివారు వేగంగా ముందుకు పరుగెడుతూండగా, వారి రూపంగా ఉన్న అర్చకస్వామి ముందుకురికి ఈటెను విసురుతాడు.

ఈ ఉత్సవం అత్యంత ఉత్సాహంగా, ఆనందభరి తంగా సాగుతుంది. సంక్రాంతి తర్వాత వచ్చే కనుమపండుగ రోజున శ్రీస్వామివారు పారువేటకు వెళతారు. పరమ శాంతమూర్తి, కరుణామూర్తి అయిన శ్రీవేంకటేశ్వరస్వామి ఈ పారువేట ఉత్సవంలో మనలోని దుష్టశక్తులను, దురాలోచన లను వేటాడి సంహరించి మనకు సర్వసౌభాగ్యాలను అనుగ్రహించవలసినదిగా శ్రీస్వామివారిని ప్రార్థిద్దాం, స్వామి అనుగ్రహాన్ని పొందుదాం.

# తిరుమల తిరుపతి దేవస్థానములు

## జనవరి, 2021

గోవిందా...గోవిందా...గోవిందా...

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| | | | | | 1 | 2 |
| 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 |
| 17 | 18 | 19 | 20 | 21 | 22 | 23 |
| 24 | 25 | 26 | 27 | 28 | 29 | 30 |
| 31 | | | | | | |

## ఫిబ్రవరి, 2021

గోవిందా...గోవిందా...గోవిందా...

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
| 28 | | | | | | |

## మార్చి, 2021

గోవిందా...గోవిందా...గోవిందా...

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
| 28 | 29 | 30 | 31 | | | |



### జనవరి - 2021

01 ఆంగ్లసంవత్సరాది
06 - 12 శ్రీఆండాళ్ నీరాట్టోత్సవం
13 భోగి పండుగ, భోగి తేరు
14 సంక్రాంతి పండుగ
15 కనుమ, శ్రీగోదాదేవి పరిణయోత్సవం
26 భారత గణతంత్ర దినోత్సవం
28 శ్రీరామకృష్ణతీర్థ ముక్కోటి

### ఫిబ్రవరి - 2021

11 శ్రీపురందరదాసుల ఆరాధన మహోత్సవం
13 - 21 దేవునికడప శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం
19 రథసప్తమి, భీష్మాష్టమి
20 - 26 తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారి తెప్పోత్సవం
23 భీష్మఏకాదశి
27 కుమారధార తీర్థ ముక్కోటి

### మార్చి - 2021

02 - 10 శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం
04 - 13 తిరుపతి శ్రీకపిలేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవం
11 మహాశివరాత్రి
13 - 21 తిరుపతి శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం
20 - 28 తరిగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవం
24 - 28 తిరుమల శ్రీవారి తెప్పోత్సవం
28 శ్రీలక్ష్మీజయంతి, తుంబుర తీర్థ ముక్కోటి

# తిరుమల తిరుపతి దేవస్థానములు



## ఏప్రిల్, 2021

గోవిందా...గోవిందా...గోవిందా...

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| | | | | 1 | 2 | 3 |
| 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 |
| 18 | 19 | 20 | 21 | 22 | 23 | 24 |
| 25 | 26 | 27 | 28 | 29 | 30 | |

## మే, 2021

గోవిందా...గోవిందా...గోవిందా...

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| | | | | | | 1 |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 |
| 16 | 17 | 18 | 19 | 20 | 21 | 22 |
| 23 | 24 | 25 | 26 | 27 | 28 | 29 |
| 30 | 31 | | | | | |

## జూన్, 2021

గోవిందా...గోవిందా...గోవిందా...

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| | | 1 | 2 | 3 | 4 | 5 |
| 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 13 | 14 | 15 | 16 | 17 | 18 | 19 |
| 20 | 21 | 22 | 23 | 24 | 25 | 26 |
| 27 | 28 | 29 | 30 | | | |

### ఏప్రిల్ - 2021

08 అన్నమాచార్య వర్ధంతి
13 శ్రీప్లవనామ సంవత్సర 'ఉగాది'
14 మత్స్య జయంతి, తమిళవత్సరాది
16-24 వాయల్పాడు శ్రీపట్టాభిరామస్వామివారి బ్రహ్మోత్సవం
18 శ్రీరామానుజ జయంతి
19 శ్రీరామ జయంతి
21 శ్రీరామనవమి
21 - 29 ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం
24 - 26 తిరుమల శ్రీవారి వసంతోత్సవం
26 నుండి మే, 04 వరకు
నాగులాపురం శ్రీవేదనారాయణస్వామివారి బ్రహ్మోత్సవం

### మే - 2021

14 అక్షయతృతీయ, శ్రీపరశురామజయంతి
17 శ్రీశంకరాచార్య జయంతి
18 తిరుపతి గంగజాతర
18 - 26 తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం
20 - 22 తిరుమల శ్రీపద్మావతీశ్రీనివాసుల పరిణయమహోత్సవం
23 - 31 హృషికేష్ మరియు నారాయణవనం, శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం
24 - 27 తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి వసంతోత్సవం
25 శ్రీనృసింహ జయంతి, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ జయంతి, శ్రీఅన్నమాచార్య జయంతి
26 శ్రీకూర్మజయంతి

### జూన్ - 2021

02 - 10 కార్వేటినగరం శ్రీవేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవం
04 శ్రీహనుమజ్జయంతి
19 - 27 అప్పలాయగుంట శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం
20 - 24 తిరుచానూరు శ్రీపద్మావతీ అమ్మవారి తెప్పోత్సవం
22 - 24 తిరుమల శ్రీవారి జ్యేష్ఠాభిషేకం
29 నుండి జూలై, 01 వరకు
తిరుచానూరు శ్రీసుందరరాజస్వామివారి అవతారోత్సవములు

# తిరుమల తిరుపతి దేవస్థానములు



## జూలై, 2021

గోవిందా...గోవిందా...గోవిందా...

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| | | | | 1 | 2 | 3 |
| 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 |
| 18 | 19 | 20 | 21 | 22 | 23 | 24 |
| 25 | 26 | 27 | 28 | 29 | 30 | 31 |

## ఆగస్టు, 2021

గోవిందా...గోవిందా...గోవిందా...

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 |
| 29 | 30 | 31 | | | | |

## సెప్టెంబరు, 2021

గోవిందా...గోవిందా...గోవిందా...

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | 30 | | |

### జూలై - 2021

| | |
|---|---|
| 13 - 15 | శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి సాక్షాత్కారవైభవం |
| 16 | తిరుమల శ్రీవారి ఆణివర ఆస్థానం |
| 19 - 21 | తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారి జ్యేష్ఠాభిషేకం |
| 20 - 23 | తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామివారి పవిత్రోత్సవం |
| 24 | గురుపూర్ణిమ, వ్యాసజయంతి |

### ఆగస్టు - 2021

| | |
|---|---|
| 08 | శ్రీచక్రత్తాళ్వార్ వర్షతిరునక్షత్రం |
| 11 | ఆండాళ్ తిరువాడిపూరం |
| 12 | నాగచతుర్థి |
| 13 | గరుడపంచమి |
| 15 | భారతస్వాతంత్ర్య దినోత్సవం |
| 16 | మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వర్ధంతి |
| 17 - 20 | తిరుమల శ్రీవారి పవిత్రోత్సవం |
| 20 | శ్రీవరలక్ష్మీవ్రతం |
| 22 | శ్రీహయగ్రీవ జయంతి, శ్రీవిఖనసమహాముని జయంతి |
| 23 | గాయత్రీజపం |
| 30 | శ్రీకృష్ణజన్మాష్టమి, గోకులాష్టమి |

### సెప్టెంబరు - 2021

| | |
|---|---|
| 08 | శ్రీబలరామ జయంతి |
| 09 | శ్రీవరాహ జయంతి |
| 10 | వినాయకచవితి |
| 15 - 18 | తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారి పవిత్రోత్సవం |
| 17 | శ్రీవామన జయంతి |
| 18 - 21 | తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి పవిత్రోత్సవం |
| 19 | అనంతపద్మనాభవ్రతం |

# తిరుమల తిరుపతి దేవస్థానములు



## అక్టోబరు, 2021 గోవిందా...గోవిందా...గోవిందా...

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| | | | | | 1 | 2 |
| 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 |
| 17 | 18 | 19 | 20 | 21 | 22 | 23 |
| 24 | 25 | 26 | 27 | 28 | 29 | 30 |
| 31 | | | | | | |

## నవంబరు, 2021 గోవిందా...గోవిందా...గోవిందా...

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
| 28 | 29 | 30 | | | | |

## డిసెంబరు, 2021 గోవిందా...గోవిందా...గోవిందా...

| ఆదివారం | సోమవారం | మంగళవారం | బుధవారం | గురువారం | శుక్రవారం | శనివారం |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | 30 | 31 | |

### అక్టోబరు - 2021

06 - 15 తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి నవరాత్రి ఉత్సవం
07 - 15 తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం
11 తిరుమల శ్రీవారి గరుడసేవ
12 సరస్వతీపూజ
13 దుర్గాష్టమి
14 మహర్నవమి
15 విజయదశమి

### నవంబరు - 2021

03 నరకచతుర్దశి
04 దీపావళి, శ్రీకేదార గౌరీ వ్రతం
08 నాగులచవితి
11 తిరుమల శ్రీవారి పుష్పయాగం
16 కైశికద్వాదశి
30 నుండి డిసెంబరు 08 వరకు తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి బ్రహ్మోత్సవం

### డిసెంబరు - 2021


02 శ్రీధన్వంతరీ జయంతి
04 తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి గజవాహనసేవ
08 పంచమితీర్థం
09 తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి పుష్పయాగం
14 శ్రీగీతాజయంతి
15 శ్రీచక్రతీర్థముక్కోటి
16 ధనుర్మాసం ప్రారంభం
18 శ్రీదత్త జయంతి

# శ్రీగోదాదేవి చరితం భక్తిదాయకం

– ధర్మప్రచారపరిషత్



పూర్వము త్రేతాయుగమున విదేహదేశములో మిథిలా నగరమున జనకచక్రవర్తి తాను తలపెట్టిన యజ్ఞనిర్వహణార్థము భూమిని దున్నుచుండగా నాగటిచాలులో లక్ష్మీదేవి సీతాదేవి రూపమున ఆవిర్భవించినట్లే, కలియుగములో పాండ్య మండలమునందలి శ్రీవిల్లిపుత్తూరులో శ్రీభట్టనాథులు (పెరియాళ్వార్లు) పుష్పోద్యానమున తులసీవనమును పెంచుటకై భూమిని తవ్వునపుడు భూదేవి చిన్న శిశువుగా ఆవిర్భవించెను.



ఆమె ఆవిర్భావము కర్కటకమాసమున, పూర్వఫల్గునీ నక్షత్రమున సంభవించెను. ఆ శిశువును చూచిన నిస్సంతువగు భట్టనాథులు ఆమె భగవానుడు తనకు ప్రసాదించిన సంతానముగా భావించి, ఆమెకు **'కోదై'** అని పేరు పెట్టెను. (ఈ పేరు సంస్కృత భాషలో "గోదా" అని వ్యవహరింపబడుచున్నది). పరమానందముతో ఆమెను పెంచసాగెను.



వయసుతోపాటు గోదాదేవికి భగవ ద్భక్తియు పెరుగజొచ్చెను. ఆమె భక్తి క్రమముగా పరభక్తి-పరజ్ఞాన-పరమభక్తులనెడి ఉచ్ఛదశలను చేరుకొన్నది. "తమంతరేణ నైవాన్యం మనసాఽపి పతిం వృణే" అనునట్లు భగవానుడగు శ్రీమన్నారాయణుని మాత్రమే భర్తగా వరింప నిశ్చయించుకొనెను. నిత్యము ఆ స్వామి వైభవమును స్మరించుచూ, కీర్తించుచూ కాలమును గడుపసాగెను.




ప్రతిదినము శ్రీవిల్లిపుత్తూరులో వెలసియున్న వటపత్రశాయిస్వామికి సమర్పించుటకై పూమాలికను కట్టుట భట్టనాథులకు అలవాటు. తన తండ్రి కట్టియుంచిన పూలమాలికలను రహస్యముగా తాను ధరించి, అద్దములో తన రూపమును చూచుకొనుచు, తనకు భగవానునకు అనురూపమైన సౌందర్యము ఉన్నదా? లేదా? అని గోదాదేవి పరిశీలించుకొనుచుండెడిది.

ఇట్లు ఆమె స్వామికి అర్పించుటకుముందే పూమాలికలను ధరించుట భట్టనాథులకు తెలియదు. ఆ మాలికనే ఆయన వటపత్రశాయి స్వామికి సమర్పించుచుండెను. ఇట్లు చాల కాలము గడిచెను. ఒకనాడు తాను స్వామికై సిద్ధము చేసియుంచిన మాలికలను గోదాదేవి ముందుగనే తలలో ధరించుటను

చూచిన భట్టనాథులు ఆమెపై మిక్కిలి కోపించి, "అయ్యో! ఎంత పని చేసితివి? భగవానునకు అర్పింపదగిన మాలికలను నీవు ముందుగా దాల్చితివే! ఈ విధముగా నిత్యము చేయుచున్నావా ఏమి? ఎంత అపచారము జరిగినది!" అని పల్కి చాలా బాధపడి, ఆ దినమున వటపత్రశాయికి పూమాలికలను సమర్పింపలేదు.



ప్రతిదినము తాను చేయుచున్న పుష్పమాలికా సమర్పణ కైంకర్యమును ఆనాడు చేయలేకపోయితినే! అను బాధతో తపించు భట్టనాథులకు ఆనాటి రాత్రి వటపత్ర శాయి స్వామి కలలో కనుపించి- "భట్టనాథా! ఎందుల కీనాడు నీవు పూమాలికలను సమర్పింపలేదు?" అని ప్రశ్నించెను. అపుడు భట్టనాథులు జరిగిన సంగతిని నివేదించుచూ, "స్వామీ! చాల కాలముగా నాకు తెలియకనే నేను ఉచ్ఛిష్టమైన మాలికలను సమర్పించుచుంటిని. నా ఈ అపరాధము మన్నింపుము" అని వేడెను.


అపుడు స్వామి "ఓయీ! గోదాదేవి ముడుచుకొని విడచిన మాలికలే నాకు మిక్కిలి ఆనందదాయకము సుమా! నీవు సంకోచింపక, ప్రతిదినము పూర్వమువలెనే గోదాదేవి అలంకరించుకొనిన పూమాలికలనే నాకు అర్పింపుము" అని ఆదేశించి, అంతర్ధానమయ్యెను.




నిద్రనుండి లేచిన భట్టనాథులు గోదాదేవి సామాన్యురాలు కాదని, సాక్షాత్తు దివ్యమైన అంశతో జన్మించిన మహనీయురాలని గుర్తించి, అప్పటినుండి ఆమెపట్ల మరింత గౌరవముతో, అనురాగముతో ప్రవర్తించుచు, భగవానుడు ఆదేశించినట్లే గోదాదేవి ముడుచుకొని తీసియుంచిన మాలికలను సమర్పింపసాగెను. దీనివలన గోదాదేవికి **"శూడిక్కొడుత్త నాచ్చియార్" (స్వోచ్ఛిష్టమాల్యదాత్రీ - ఆముక్తమాల్యదా)** అను పేరు కలిగినది. ఇట్లు గోదాదేవికి ముందు మాలికలను అర్పించి, పిమ్మట వటపత్రశాయి భగవానునకు సమర్పించు ఆచారము ఈనాటికిని శ్రీవిల్లిపుత్తూరు దివ్య క్షేత్రములో ఆచరణలోనున్నది.

క్రమముగా గోదాదేవి వివాహమునకు తగిన వయస్సును పొందెను. ఆమెకు గల జ్ఞాన-భక్తి-వైరాగ్యములను, భగవానునియందు గల అనన్యమైన అనురాగమును చూచిన భట్టనాథులు, **"పతిసంయోగ సులభం వయో దృష్ట్వా చ మే పితా, చింతార్ణవగతః**

పారం నాససాదాప్లవో యథా" అని జనకచక్రవర్తి, సీతాదేవి వివాహ విషయములోవలె, గోదాదేవి వివాహవిషయమునందు చింతాక్రాంతు లయ్యెను. భగవానుని తప్ప వేరొకనిని పరిణయ మాడననెడి ఆమె సంకల్పము ఎట్లు ఫలించునోకదా! అను ఆలోచన భట్టనాథులకు అధికము కాసాగెను. ఇక, గోదాదేవి విషయమును గమనించినచో, ఆమెకు గల భగవత్ప్రేమ దిన దినము ఉత్కంటము కాజొచ్చెను. ఆ ప్రేమ ప్రవాహముయొక్క పరిణామరూపముగా ఆమె రెండు దివ్యప్రబంధములను విరచించి, లోకమునకు అందించినది. అవి ఏమనగా 'తిరుప్పావై', 'నాచ్చియార్ తిరుమొళి' అనునవి.



ఒకనాడు భట్టనాథులు గోదాదేవిని పిలిచి, "అమ్మా! నీవు ఎవరిని వివాహమాడ గోరుచున్నావు?" అని అడుగగా, ఆమె భగవానుని తప్ప వేఱొకనిని వివాహమాడనని పల్కెను. అపుడు భట్టనాథులు 108 విష్ణుక్షేత్రములలోని ఏ స్వామిని పరిణయమాడెదవని మరల ప్రశ్నింపగా, ఆయా క్షేత్రములలోని అర్చామూర్తుల వైభవమును తనకు తెలుపవల సినదిగా గోదాదేవి తన తండ్రిని ప్రార్థించెను. భట్టనాథులును వరుసగా అన్ని శ్రీవైష్ణవ క్షేత్రములలోని భగవన్మూర్తుల మహిమనుగూర్చి ఆమెకు తెలిపిరి. అపుడు గోదాదేవి శ్రీరంగములో వెలసియున్న శ్రీరంగనాథుని వివాహము చేసికొందుననుచూ, తన నిర్ణయమును భట్టనాథులకు తెలియజేసెను. ఆమెకు తగిన వరుడు శ్రీరంగనాథుడే! అని విష్ణుచిత్తులు నిశ్చ యించుకొనిరి. కాని, గోదాదేవి అర్చామూర్తియగు శ్రీరంగనాథుని వివాహము చేసికొనుట ఎట్లు సాధ్యమో తెలియక విచారముగా ఆనాటి రాత్రి భట్టనాథులు నిద్రింపగా, శ్రీరంగనాథుడు స్వప్నములో సాక్షాత్కరించి– "భట్టనాథా! మీరు విచా



రింపకుడు, మీరు గోదాదేవిని తీసికొని శ్రీరంగమునకు రండు. నేనామెను వివాహమాడెదను" అని పల్కి అంతర్ధానమయ్యెను. అట్లే, ఛత్రచామరాది మర్యాదలతో గోదాదేవిని తీసికొనిరావలసినదిగా శ్రీరంగనాథుడు శ్రీరంగాలయార్చకులను ఆజ్ఞాపించెను. వారును సకలమర్యాదలను గైకొని శ్రీవిల్లిపుత్తూరునకు పోయి, శ్రీరంగ నాథుని ఆజ్ఞను భట్టనాథులకు తెలుపగా, ఆయనకూడ పరమ సంతోషముతో అంగీకరించెను. గోదాదేవిని వెంట నిడికొని, అందఱు ఛత్రచామరాది మర్యాదలతో శ్రీరంగమును చేరిరి. గోదా దేవి శ్రీరంగనాథుని దరిచేరి, ఆ మూర్తికి పాద సంవాహనము చేయుచు అంతర్ధాన మందెను. భట్టనాథులు, ఆ దేశప్రభువు, ఆర్చకులు మొదలగు వారందఱును ఆ దృశ్యమును చూచి మిక్కిలి ఆశ్చర్యపడిరి. భట్టనాథులకు శ్రీరంగనాథుడు విశేషముగా సమ్మా నము చేసి, యథా పూర్వము శ్రీవిల్లిపుత్తూరునకు చేరి, అచట పుష్పమాలికాకైంకర్యమును చేసికొనవలసినదిగా తెలిపెను. భట్ట నాథులును శ్రీవిల్లిపుత్తూరులో వటపత్రశాయి స్వామికి సేవచేసు కొనుచు కాలము గడపి చివరకు భగవదనుగ్రహముతో పరమ పదమును చేరిరి.

శ్రీగోదామాత్రే నమః

బాలప్రబోధం

# సక్రమజీవితం

- శ్రీమతి జి.సత్యవతి

ఒక ఊళ్లో ఒక పండితుడు ఉండేవాడు. అతను చాలా గ్రంథాలు చదివేడు. మిగతా వాళ్లని చూసి జాలి పడేవాడు. తానంటే ఇన్ని విషయాలు తెలుసుకున్నాడు గనుక ధర్మాచరణ వగైరా విషయాలన్నీ తెలుసనీ, పాపం ఏ శాస్త్రాలూ చదవని వాళ్లకి ఏం తెలుస్తుందని భావించేవాడు.

ఆ ఊళ్లో 'రంగడు' అనే పేదరైతు, తల్లిదండ్రులూ ఉండేవారు. అతను వారందరిని పోషించేవాడు. అతనికున్న కొద్దిపాటి పొలంలో వ్యవసాయం చేసుకుంటూ, తీరిక సమయాలలో ఇతరుల పొలంలో పనిచేసి డబ్బు సంపాదించే వాడు. ఇంకా ఊళ్లో ఎవరికే పని కావల్సినా చేసి, కూలి ఎక్కువగా పుచ్చుకునేవాడు.

చాలామందికి ఇది కష్టంగానే ఉన్నా, మంచి పని వాడూ, సమర్థవంతుడూ ఏ పని చెప్పినా బాగా ఇతరులకి తృప్తి కలిగేలాగా చేస్తాడు గనుక విధిలేక ఎక్కువ డబ్బు ఇచ్చి అతని చేత పని చేయించుకునేవారు.

ఒకసారి మన పండితులవారికి ఏదో పని చేయించుకోవలసి వచ్చి, విధిలేక ఎక్కువ డబ్బు ఇచ్చేటప్పుడు కష్టంగా తోచి, "అవును నువ్వు ఇంత సంపాదిస్తున్నావు కదా, ఈ డబ్బంతా ఏం చేస్తావురా?" అని ప్రశ్నించాడు.

అందుకు రంగడు నవ్వుతూ, "కొంత డబ్బు అప్పు తీరుస్తానండి. కొంత డబ్బు అప్పుగా ఇస్తానండి. కొంత దాచుకుంటానండి. కొంత గోతిలో పోస్తానండి" అన్నాడు. పండితుడికేమీ అర్థం కాలేదు.

ఎందుకంటే, తనకు తెలిసినంతవరకూ అప్పులు లేవు. మరి అప్పు ఎవరికి తీరుస్తాడు. రంగడు చాలా జాగ్రత్త పరుడని, ఎవరినీ నమ్మడని అంటారు. అలాంటివాడు అప్పు ఇస్తాడంటే ఎవరు నమ్ముతారు? దాచుకోవడం సరే, గోతిలో ఎవరైనా పారపోస్తారా? అందులోనూ రంగడిలాంటి ఆశా పరుడు, ఈ సంగతే ప్రశ్నించాడు.

అందుకు సమాధానంగా రంగడు "దానర్థం ఇదండీ, అప్పు తీరుస్తాను అంటే మా అమ్మా, నాన్నా, నన్ను పెంచి, పెద్ద చేసేరుకదండీ, వాళ్లకి నేను ఎంతో ఋణపడి ఉన్నాను కదా! వాళ్లని పోషించడానికి కొంత డబ్బు ఖర్చు పెడతాను. ఆ విధంగా ఆ ఋణం కొంత తీర్చుకుంటున్నాను. అప్పు తీర్చడమంటే అదండి. ఇంక అప్పు యిస్తాను అన్నాను కదా! నా పిల్లల్ని పోషించడానికి కొంత డబ్బు ఖర్చు పెడతాను. వాళ్లు పెరిగి పెద్దవాళ్లయ్యాక నన్ను పోషిస్తారు కదా! మరి అది అప్పు ఇవ్వడం లాంటిదే కదా!

ఇంక దాచుకోవడం అంటే, మీకు తెలియనిదేముంది బాబయ్యా! ఈ జన్మ శాశ్వతం కాదండి. ఇలాంటి జన్మలు ఎన్నో ఎత్తామండి. ఇంకా ఎన్నో జన్మలు ఎత్తవలసి ఉందండి. ఏ జన్మలో అయినా సరే మనం చేసిన పుణ్యమేనండి దయతో చేసిన దానము, ధర్మము అవే మనం పట్టుకు వెళ్తామండి. మిగతాది ఎంత సంపాదించినా ఇక్కడ వదలి పోవాల్సినదేనండి.

అందుకనీ, నాకు తోచినంత, వీలైనంత దానధర్మాలకి ఖర్చు చేస్తానండి. అదే దాచుకోవడమంటేనండి. ఇంక గోతిలో పారబోయడమంటేనండి, నా కోసం నేను ఖర్చు పెట్టుకునే డబ్బండి. మనకోసం మనం ఎంత ఖర్చు పెట్టుకున్నా, ఏం ప్రయోజనం లేదండి. మన భోజనం వాటి కోసం చేసే ఖర్చు అదంతా పెద్దగోతిలో పారబోసినట్టే లెక్కండి నా దృష్టిలో" అన్నాడు.

ఈ సమాధానం విని పండితుడు నిర్ఘాంతపోయాడు. ఇన్నాళ్లుగా తాను, చదువుకోని వారికి ఏమీ తెలీదని, తానేదో శాస్త్రాలు చదివిన జ్ఞానినని, ధర్మాచరణ తనకే తెలుసని అనుకున్నాడు. కానీ భగవంతుడు ప్రతి మనిషికి విచక్షణ, వివేకం



ఇచ్చాడని, అది ఉపయోగించడానికి శాస్త్రజ్ఞానం అక్కర్లేదని, ప్రతి మనిషీ ఆ విచక్షణాజ్ఞానంతో కొంత చూసి, కొంత విని తెలుసుకుని, ఆసక్తి ఉన్నావాళ్లు ఆచరణలో పెడుతూనే ఉన్నారనీ తెలుసుకుని, తనకే తెలుసుననే గర్వాన్ని మానుకున్నాడు.

# ధర్మప్రబోధకులు 'సప్తమహర్షులు'

– శ్రీ అత్తివిల్లి బాలసుబ్రహ్మణ్యం

'సప్తఋషు' లనబడేవారు ఒకగణం. ఈ గణంలో ఏడుగురు ఋషులుంటారు. ప్రతిమన్వంతరంలో ఒకగణం ఉంటుంది. మహాప్రళయానికి ముందయితే 14 మన్వంతరా లుంటాయి కనుక 98 మంది సప్తర్షులు ఉంటారు!

మనది కర్మభూమి అయిన ఋషుల భూమి. ఈ జగత్తును పాలించేది రాజులయినా, వారిని తమ సలహాలతో, శిక్షణలతో రాజ్యపాలనలో ముందుకు నడిపించేది వారివారి గురువులయిన ఋషులే! అంతేకాదు, మానవాళికి కూడా ఋజువర్తన, సత్ప్రవర్తనలకు మార్గం నిర్దేశించింది కూడా మహనీయులయిన ప్రాచీనఋషులేనంటే అతిశయోక్తి కాదు! ఆ రకంగా వీరికెంతో ఋణపడి ఉంది మానవజాతి! అందుకే, మనుష్యజన్మనెత్తిన ప్రతిఒక్కరూ *పితృఋణం, మాతృఋణం, గురుఋణం* (అదే ఋషి ఋణం), దైవఋణాలను తప్పక తీర్చుకోవాలని మన శాస్త్రాలు పేర్కొన్నాయి.

తమ అమోఘమయిన తపశ్శక్తితో, నియమనిష్ఠలతో మానవజాతికి సన్మార్గాన్ని నిర్దేశించి, వినువీథిలో 'సప్తఋషి మండలం' గా వెలుగుసొబగులు గుప్పిస్తున్న ఈ మహనీయ, ఋషిపుంగవులగురించి కొంతయినా తెలుసుకోవడం మన కనీసవిధి!

సప్తఋషిగణంలోని ఏడుగురుమహర్షులు వరుసగా **కశ్యపుడు, అత్రి, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, వశిష్ఠుడు, జమదగ్ని.**

**కశ్యపుడు** సూర్యునిమానసపుత్రుడైన మరీచి తనయుడు. దక్షునికుమార్తెలయిన అదితి, దితి మొదలయిన పన్నెండు మందిని పెళ్లాడి, సృష్టిని వృద్ధి చేసిన ఇతనికి దేవదానవులు, నరులేగాక, మృగాలు, పశు, పక్షి, వృక్షాదులను కూడా ఇతని సంతతిగానే పేర్కొంటారు.

విష్ణువు వామనావతారంలో ఇతనికి పుత్రుడుగా జన్మించాడు. అలాగే, రామ కృష్ణావతారాల్లో కూడా కశ్యపుడే దశరథుడుగా, వసుదేవుడుగా జన్మించాడని మనపురాణ వచనం. ధర్మప్రబోధం గావించే **'కశ్యపధర్మసూత్రాలు'**, క్షమా గుణాన్ని చాటిచెప్పే 'కశ్యపగీత'ను రచించిందితడే!

బ్రహ్మమానసపుత్రుడు, మహాసాధ్వి అనసూయాభర్త అయిన **అత్రి** మహాముని, ఘోరతపస్సుతో త్రిమూర్తుల అంశలో చంద్ర, దత్తాత్రేయ, దూర్వాసులను కుమారులుగా పొందాడు. దేవదానవయుద్ధంలో, చంద్రుడు రాహువుచేత కబళించబడగా, సూర్యుడు పాలిపోవడంతో జగత్తంతా అంధకారమయమైన తరుణంలో, అత్రి, సూర్యునికి ధైర్యాన్నిస్తూ, చంద్రుడి, సూర్యుడి శరీరాలు, నక్షత్రాలు సృష్టించి, ప్రకాశాన్ని తిరిగి రప్పించాడు.

రామాయణం జరిగిన మహాకాలంలో, వనవాస దీక్షతో తన ఆశ్రమానికి వచ్చిన సీతారామలక్ష్మణులకు ఆతిథ్యమివ్వగా, అతని ధర్మపత్నియైన అనసూయ– నూతన వస్త్రాభరణాలను సీతమ్మ కిచ్చి, పతివ్రతా ధర్మసూక్ష్మాలను ఎరుక పరచింది. అత్రి మహాముని **'అత్రిసంహిత', 'అత్రి స్మృతి'** అనే రచనలు గావించాడు. 'అత్రిస్మృతి' కాలక్రమంలో 'ఆత్రేయ ధర్మశాస్త్రంగా' జగద్విఖ్యాతి నొందింది.

దేవగురువైన బృహస్పతికుమారుణ్ణి, మరుత్తులు పెంచి, భరతునికి అప్పగించగా, భరతునిచే స్వీకరించబడిన వాడు కావడంచేత **'భారద్వాజుడు'** గా పిలువబడ్డాడు.

గంగానదీ తీరంలో ఆశ్రమవాసియైన ఈయన, సీతారామలక్ష్మణులకు, అరణ్యవాససమయంలో ఆతిథ్యమిచ్చాడు. అదే విధంగా, రాముణ్ణి వెదకుతూ వచ్చిన భరతునికీ, అతని పరిజనులకూ గొప్పగా విందు నొసగి, రాముడు వెళ్ళిన దిక్కును దెలిపాడు. రావణవధానంతరం తిరుగు ప్రయాణంలోకూడా వారికి ఆతిథ్య మిచ్చినట్టు

రామాయణ కావ్యం తెలియజేస్తుంది. ఈయన వ్రాసిన **'భరద్వాజస్మృతి'** అనే శాస్త్రం – వశిష్ఠాదిమహర్షులకోరిక మేరకు – ఏయే కర్మలను, ఎప్పుడెలా ఆచరించాలో వివరిస్తుంది.

గాధిపుత్రుడైన **విశ్వామిత్రుడు**, తండ్రి అనంతరం రాజయి, వేటకు వెళ్ళినపుడు, వశిష్ఠాశ్రమానికి వెళ్లడం, అక్కడున్న కామధేనువును కోరటం; వశిష్ఠుడు నిరాకరించడం, కదనానికి దిగి భంగపడడం జరిగింది. అమోఘమయిన అతని తపశ్శక్తిని చూచిన విశ్వామిత్రుడు, రాజ్యాన్ని త్యజించి, ఘోరతపస్సుకు కూర్చున్నాడు. అయితే, మహేంద్రుడు పంపగా వచ్చిన మేనకవల్ల తపోభంగమవ్వగా, ఆమెతో కొద్దికాలం గడపి, శకుంతల జన్మకు కారణమయ్యాడు. అయితే, తొందరలోనే తనతప్పు తెలుసుకొని, తిరిగి ఘోర తపస్సు గావించాడు.

ఆ క్రమంలో తీవ్రక్షామాన్ని అనుభవించి, ఎన్నో పడరానిపాట్లు పడి, బ్రహ్మసృష్టికి ప్రతి సృష్టిగా, త్రిశంకు డనే రాజును బొందితో స్వర్గానికి పంపబోయి, సాధ్యంకాక, అతనికోసం 'త్రిశంకు స్వర్గాన్నే' సృష్టించాడు.

వశిష్ఠునినోట 'బ్రహ్మర్షి' అని పిలిపించుకునేందుకు ఎన్నెన్నో ప్రయత్నాలు చేసి, ఎన్నో వెతలు అనుభవించి, కోపాన్ని సమూలంగా జయించి, చివరకు ఆయనచే 'బ్రహ్మర్షి' అనిపించుకుని తృప్తి చెందాడు.

విశ్వామిత్రుడే రామలక్ష్మణులకు ఎన్నో శస్త్రాలూ, మంత్రవిద్యలూ ఉపదేశించి, ఎందరో దుష్టరాక్షసులను సంహారం చేయించాడు. అలాగే వాళ్ళను మిథిలకు తోడ్కొని పోయి, సీతారామకల్యాణహేతువూ అయ్యాడు. సంధ్యా వందన గాయత్రీ మంత్రాన్ని ప్రపంచానికి బహూకరించిన ఇతడు **'విశ్వామిత్ర స్మృతి'** అనే గ్రంథరచనకూడా గావించాడు.


**గౌతముడు–** ప్రచేతసుని మానసపుత్రుడు, 'తను చల్లే విత్తనాలు వెంటనే మొలిచి పంట పండా'లని ప్రార్థిస్తూ, బ్రహ్మను స్మరిస్తూ, గొప్పతపస్సు చేశాడు. వర్షాభావంతో, క్షామం ఏర్పడినప్పుడు, ప్రజలకు తను స్వయంగా వండి, అన్నదానం చేసి, రక్షించాడు.

అసూయాపరులైన కొందరు మునులు, గౌతముని సంపదను చూచి, అసూయతో ఒక గోవును అతనిపొలం లోకి తరిమారు. పైరు మేస్తున్న గోవును అదిలిస్తూ, ఒక దర్భ మంత్రించి వదలగా, గోవు మరణించింది. 'ధేనువును గంగాజలంతో' ప్రోక్షిస్తే తిరిగి బతుకుతుంది లేదా గోహత్యా పాతక ఘోరదోషం నిన్ను చుట్టు కుంటుందని మునులు నిష్కర్షించారు.

అంతట, గౌతమమహర్షి పరమేశ్వరుని గురించి ఘోరతపస్సు చేసి, శివుణ్ణి మెప్పించి, ఆయనజటాజూటంలో ఉన్న గంగను ఆవుపై ప్రోక్షించగా, అది బ్రతకడమే కాకుండా, నీటి బిందువులు పడినచోట నుంచి ఒక నది పుట్టింది. గౌతముని కారణంగా పుట్టడంచేత 'గౌతమి', గోవును బ్రతికించింది కనుక 'గోదావరి' అనే పేర్లు ఆ నదికి వచ్చాయి. గౌతముడు ధర్మసూత్రాలు, న్యాయ శాస్త్రం, **'గౌతమసంహిత'** అనే జ్యోతిష శాస్త్రగ్రంథాన్ని కూడా రచియించి, రాబోయే తరాలకు అందించాడు.

**వశిష్ఠుడు**–పరమపతివ్రతాశిరోమణి అరుంధతిభర్త. సూర్యవంశ క్షత్రియుల కులగురువైన వశిష్ఠుడు, శ్రీరామ

మనిషి తనకు ఇవ్వబడిన బుద్ధితో సకల మానవాళికి లాభదాయకమైన పనులు చేస్తే చరిత్రలో చిరస్థాయిగా నిలచిపోతాడు. మానవ అస్తిత్వంలో ఉన్న దేహం, మనస్సు, బుద్ధి, ఆత్మ అనే నాలుగింటిలో అధికార క్రమంలో ఆత్మ సమున్నతస్థానంలో ఉంటుంది. దాని క్రింద బుద్ధి, బుద్ధి క్రింద మనస్సు, మనస్సు క్రింద దేహం అధికార క్రమంలో ఉంటాయి. మూడోస్థానంలో ఉండే బుద్ధి, తన పైన ఉన్నట్టి అంటే నాల్గవస్థానంలో ఉన్న ఆత్మతో జత కూడినప్పుడు లోకహితకార్యాలలో నెలకొంటుంది. బుద్ధినాశనమైన సర్వనాశనం జరిగినట్లే అని తెలుసుకోవాలి. మనిషి తన బుద్ధితో లోకవినాశకర మైన పనులు చేస్తే, పరమపాపిగా దుర్మార్గుడిగా దూషించ బడతాడు. మనము దేనినైతే మస్తిష్కంలో పదిలపరచు కుంటామో, అదే విద్య. దేనినైతే వాడుకుంటామో, అదే తెలివి. ఇవి మనం గుర్తించినప్పుడు ఉన్నతలక్ష్యాలను సాధించగలుగుతాం.



లక్ష్మణ భరతశత్రుఘ్నులకు జాతవివాహాది శుభకర్మలు జరిపినవాడు. ఆశ్రమానికి వస్తే, అన్నం పెట్టిన పాపానికి, కామధేనువును అపహరించబోయిన విశ్వామిత్రుడికి గుణ పాఠం నేర్పాడు. ఆ కారణంవల్ల అనేకకష్టాల నెదుర్కొన్నా, కాలపరీక్షలన్నిటినీ ఓర్పుతో, ధైర్యంతో ఎదుర్కొని, చివరికి ధర్మం, శాంతం, సత్యగుణాలే విజయానికి సోపానాలని జగత్తుకు చాటి చెప్పిన జితేంద్రియుడు, సత్యస్వరూపుడు, ధర్మమూర్తి– వశిష్ఠుడు.

హరిశ్చంద్రునికీర్తి చిరస్థాయిగా నిల్పినవాడు, శ్రీరాముణ్ణి ధర్మపథంలో నడిపినవాడు అతడే! స్మృతికర్తలలో ముఖ్యుడైన అతడు, **ప్రపంచలహరి, వసిష్ఠ ధనుర్వేదసంహిత, వసిష్ఠస్మృతి** అనే గ్రంథాలు రాశాడు.

**జమదగ్ని–** సత్యవతీ ఋచీకుల పుత్రుడు. రేణుకా దేవిని పెళ్ళాడాడు. గొప్పతపశ్శాలి అయినా, రేణుక మనస్సులో జరిగిన తడబాటును ఒకరోజు గ్రహించగానే, ఆగ్రహంతో ఆమెను వధించుమని పుత్రులను ఆజ్ఞాపించాడు. అయిదుగురు పుత్రులలో చివరివాడైన పరశురాముడు పరశువుతో తల్లిని వధించి, తిరిగి తండ్రి ఇచ్చిన వర ప్రభావంతో ఆమెను బ్రతికిస్తాడు.

అధికారమదంతో, దురహంకారియైన రాజు కార్త వీర్యార్జునుడు – తన తండ్రిని, సోదరులను చంపినందున అతణ్ణి హతమారుస్తాడు. అతడి రక్తతర్పణంతో జమదగ్ని పునర్జీవితుడౌతాడు. జమదగ్ని తన అమోఘమయిన తపశ్శక్తితో సప్తఋషిమండలంలో స్థానం పదిలపరచు కున్నాడు.

ఈ సప్తమహాఋషుల ప్రస్తావన రామాయణంలో కూడా చూడవచ్చు.

ప్రచేతసుడి కుమారుడయిన వాల్మీకిమహర్షిపూర్వ జీవితం ఎంతో విచిత్రమయిందే కాదు, క్షుద్రమయిందికూడా!

ఆదికావ్యమయిన రామాయణాన్ని రచించిన ఆది కవి పూర్వాశ్రమంలో కిరాతకుడుగా జీవిస్తూ, దొంగతనం వృత్తిగాకాలం గడిపేవాడు. అడవిలోని అమాయక, సాధు జంతువులను, పక్షులను వేటాడి, కర్కశంగా వధించి, భార్య

చేత ఆ మాంసాదులతో వంటకాలు చేయించి, తృప్తిగా ఆరగించేవాడు!

అంతేకాదు! దారిన సాగిపోయే అమాయకజనాన్నీ, సాధుపుంగవులనుకూడా కత్తితో, ధనుర్బాణాలతో బెది రించి, వాళ్ళ దగ్గరున్న ధనాన్ని, ఆభరణాలను, వస్తు సామగ్రినీ అమానుషంగా దోచుకునేవాడు!

ఇలా కొద్దిరోజులు గడిచాయి. అన్నిరోజులూ ఇట్లాగే గడిచిపోతే పరమపవిత్రమయిన, ఆదికావ్యమయిన రామా యణ రచనకెవరు పూనుకుంటారు? మానవాళికి ధర్మ మూర్తియైన శ్రీరామునిగాథనూ, ఆదర్శదాంపత్యానికి, ఏకపత్నీవ్రతానికి తలమానికాలైన సీతారాములపుణ్య చరితనూ ఎవరు నివేదిస్తారు? అందుకే– విధి సప్తమహర్షుల రూపంలో తన విధ్యుక్త ధర్మాన్ని నెరవేర్చింది!

వశిష్ఠవిశ్వామిత్రాదిగా గల మహర్షులు ఏడుగురూ ఒకరోజు ఆ దారిలో పోవడం కాకతాళీయమో, విధి విలాసమో గాని తటస్థించింది.

అయితే, మనవాడికి సామాన్యజనులూ, మహర్షులూ, మహామునులూ అందరూ ఒకటే కాబట్టి, యథావిధిగా వారినీ అటకాయించాడు.

"ఓ స్వాములూ! ఆగిపోండి అక్కడే! ఎక్కడికా ఉరుకులూ, పరుగులూ? నిజంగా మీకు ప్రాణాల మీద ఆశ ఏమాత్రం ఉంటే, మీ దగ్గరున్నదంతా ఇచ్చి, మీ కిష్టమైన చోటుకు పోండి!" అన్నాడు.

అందుకు సప్తమహర్షులు, "నాయనా! మేము ముక్కు మూసుకుని, తపస్సులు చేసుకునే సర్వసంగ పరి త్యాగులమైన మునులం! మా దగ్గర నీకు పనికివచ్చేది ఏముంటుంది గనుక?" అన్నారు.

వాల్మీకి మొండిగా వారిని సోదా చేయబోయాడు.

"ఒక్కమాట, నాయనా! ప్రతిదినం ఈ దారి కాచి, ఇన్నిరకాలుగా దోపిడీలు, దౌర్జన్యాలు చేస్తున్నావు, సాధు జంతువులను ఎన్నింటినో అమానుషంగా వధించి, పొట్టన బెట్టుకుంటున్నావు. వీటివల్ల నీకు కలిగే ఘోర పాపంలో నీ ఇల్లాలికి భాగం ఉంటుందా? ఏనాడైనా కను గొన్నావా?"

వాల్మీకి తెల్లమొగం వేసి, "కాస్సేపాగండి, స్వాములూ! మా ఇంటిదాన్ని కనుక్కొచ్చి చెప్తాను", అని ఇంటిదారి పట్టాడు.

కాస్సేపటికే దుఃఖిస్తూ వస్తున్న అతణ్ణి చూచి, "ఏమనింది, నీభార్య? నీపాపకృత్యాల్లో తన కేమీ భాగం ఉండదనిందా?" అని వాళ్లు పలుకగా, వాల్మీకి "భర్తగా నీవు ఏంచేసి మమ్మల్ని పోషిస్తావో అది నీవిధి. నీపాపంలో మాకు భాగంలేదు.'' అనిందంటూ జీవితంలో ప్రప్రథమంగా కన్నీళ్లు కారుస్తూ, వాళ్ల పాదాలు తాకి, క్షమించమని వేడుకున్నాడు, అంతే కాకుండా, ఇన్నిరోజుల తన పాపకృత్యాలకు ప్రాయశ్చిత్తమార్గాన్ని చూపించమని అర్థించాడు!

సప్తమహర్షులు, అతనిలోని పరివర్తనకు సంతో షిస్తూ, "నాయనా, చింతించకు! ఆ కనిపించే చెట్టుక్రింద కూర్చొని, మేము ఇటువైపు తిరిగి వచ్చేవరకు 'మరా, మరా' అంటూ– జపం చేస్తూండు" మని ఆదేశించి, వెళ్లిపోయారు.

వాళ్లు చెప్పినవిధంగా అతడు ఆ చెట్టుక్రింద కూర్చుని, అచంచలదీక్షతో, మొక్కవోనిధైర్యంతో 'మరా మరా' అంటూ జపం సాగించాడు. అతనికి తెలియకుండానే ఆ విధంగా ఎన్నో సంవత్సరాలు గడిచిపోయాయి. అతడిచుట్టూ ఒక వల్మీకం (పుట్ట) ఏర్పడి, క్రమంగా అతణ్ణి పూర్తిగా కప్పివేసింది. అతడు అదే పనిగా జపిస్తున్న 'మరా' పదం కాస్తా 'రామ' గా, తారకమంత్రంగా రూపాంతరం చెందింది.

కొన్నేళ్ళతర్వాత, అటుగా వచ్చిన సప్తఋషులు, అతని నిజాయితీని మెచ్చుకుని, క్రమ్ముకున్న వల్మీకంనుండి బయటికి రప్పించి, ఒక విధంగా పునర్జన్మ నెత్తిన అతనికి **'వాల్మీకి'** అని నామకరణం చేశారు.

దివ్యతేజస్సుతో, ఋషిగా మారి, బయటికి వచ్చిన వాల్మీకిని సప్తమహర్షులూ మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. అంతే కాకుండా, పరమపవిత్రమైన, ఆదికావ్యమయిన రామాయణ రచనకు అతణ్ణి నియోగించారు!


ఈ సప్తఋషులూ, మనపురాణగాథల్లో, మన దివ్య సంస్కృతికి గుర్తులుగా నింగిలో నక్షత్రరూపులై శాశ్వత మహోన్నతులుగా ప్రఖ్యాతి గడించి, నిలిచిపోయారు!

గృహలక్ష్మి

# సహనవతి సీతమ్మ

– శ్రీ దీవి సుబ్బారావు

శ్రీమద్రామాయణం బాలకాండలో విశ్వామిత్రుడు, రామలక్ష్మణుల్ని వెంటబెట్టుకొని జనకమహారాజు పాలించే మిథిలా నగరానికి వస్తాడు. ప్రసంగవశాత్తు, జనకుడు తన కూతురు సీత గురించి చెప్తూ అంటాడు, 'సీత 'లాంగలాత్ ఉద్గీతా' నాగలి నుండి లేచినది, 'భూతలాత్ ఉద్గీతా' భూమి నుండి లేచినది, అని. జనకుడు యజ్ఞభూమిని నాగలితో దున్నుతుండగా సీత ఆ భూమిని పెకలించుకొని బైటకు వచ్చిందట.



అట్లాంటి సీత రాముడికి భార్య అయింది. కొంత కాలం గడిచాక రాముడు అరణ్యవాసం చేయవలసిన పరిస్థితి ఎదురైనపుడు, తానూ వెంటవస్తానని పట్టుపడుతుంది. ఆ సందర్భంగా అయోధ్యకాండలో సీత అంటుంది, 'తండ్రి, తల్లి సోదరుడు, పుత్రుడు, కోడలు – వీళ్ళు ఎవరి పాపపుణ్యాల్ని వారే అనుభవిస్తారు. ఇతరులు అనుభవింపరు. భార్య ఒక్కతే భర్త అదృష్టాన్ని పంచుకుంటుంది. కాబట్టి, రాముణ్ణి అడవికి వెళ్ళమని ఆజ్ఞాపిస్తే తననూ ఆజ్ఞాపించినట్లే అని 'భర్తా హి మమ దైవతం', 'నాకు భర్తే దేవుడుకదా' అని కూడా అంటుంది.



వనవాసంలో ఉన్న సీతారామలక్ష్మణులు ఒక పర్యాయం అత్రిముని ఆశ్రమానికి వెళ్తారు. అత్రిముని భార్య అనసూయ సీతను ఎంతో ప్రేమగా పలుకరించి అభిమానం చూపెడుతుంది. సీత స్వయంవర వృత్తాంతాన్ని అనసూయ పూర్వం ఆనోట ఈనోట విన్నదిగాని, స్వయంగా సీతే చెబితే వినాలని ఉవ్విళ్ళూరుతుంది. సీత కూడా అంతా పూసగుచ్చినట్లు చెబుతుంది. తన తండ్రి జనకుడు భూమిని దున్నుతుండగా, తాను బైటపడిన వైనం, అప్పుడు ఆకాశవాణి జనకుడితో ఈమె 'అమానుషీ', మనుష్య జాతికి చెందినది కాదు, దేవతా స్త్రీ అని పలకటం మొదలైనవన్నీ చెబుతుంది.

ఈడేరిన కూతురు పెళ్లికాకుండా ఇంట్లో ఉంటే, తండ్రి ఎలాంటి బాధపడతాడో అది కూడా సీత ఆ సందర్భంలో చెబుతుంది. తనతోటి వారు, తనకంటే తక్కువ వారు, పెళ్లికాకుండా ఇంట్లో ఉన్న అమ్మాయి తండ్రిని చులకనగా చూస్తారుట. అలా జనకుడు పెండ్లి కాకుండా ఉన్న సీతను చూసి బాధపడేవాడట.

సీత మాట్లాడిన విధం చూసి అనసూయ చాలా ముచ్చట పడుతుంది. మెచ్చుకుంటుంది. ఒక్క అక్షరం పొల్లు పోకుండా, ఒక్కపదం తడబడకుండా అందంగా స్పష్టంగా మధురంగా మాట్లాడిందట సీత.


అరణ్యకాండలో రాముడు ప్రతిజ్ఞ చేస్తాడు, తాను రాక్షసులను సంహరిస్తాను అని. అనవసరంగా రాక్షసులతో గొడవలెందుకు అని వారించబోతుంది సీత. ఆ సందర్భంలో వ్యసనాలను గురించి చెబుతూ అవి మూడురకాలుగా ఉంటాయి అని అంటుంది. 'అబద్ధాలాడటం, వేరేవాళ్ళ భార్యల్ని ఇష్టపడటం, వైరం లేకుండా ఇతరులపట్ల క్రూరంగా ప్రవర్తించటం' అనేవి ఆ మూడు.

రావణుడికి పట్టుబడ్డ సీత లంకకు బలవంతంగా తీసుకొని రాబడుతుంది. సుందరకాండలో సీత, రావణుడు చేసిన పని ఎంతటి హేయమైనదో అతడి ముఖాన్నే చెబుతుంది. 'నీ భార్యలను ఇతరులు వాంఛిస్తే నీకెలాగ ఉంటుందో ఆలోచించుకొని, ఇతరుల భార్యల పట్ల నీవు మంచిగా ప్రవర్తించు. చపలబుద్ధి పతనానికి కారణమౌతుంది. అట్టి వాని సంపదలు నశిస్తాయి. వాడికి చావు మూడితే, అందరూ సంతోషిస్తారు' అని హెచ్చరిస్తుంది.

యుద్ధకాండలో రామరావణ యుద్ధం వర్ణితమవుతుంది. రావణవధ, రామజయం జరుగవలసిన రీతిలో జరుగుతుంది. సీతను విడిపించుకొని వెళ్ళటానికి రాముడు పంపగా హనుమంతుడు వస్తాడు. అప్పటి దాకా సీతను బాధలకు గురిచేసిన రాక్షసులను చూస్తాడు. కోపం పట్టలేక వాళ్ళను చంపేస్తాను, అనుమతించమని సీతను అడుగుతాడు. సీత ఒప్పుకోదు.



"రాక్షసులు స్వతంత్రులు కాదు. రావణుడు దగ్గర పని చేసే వాళ్ళు. అతడు ఎలా చెబితే అలా చేయవలసిన వాళ్ళు. వీళ్ళను నిందించి లాభమేమిటి? వీళ్ళు అమాయకులు. రావణుడు పోయాక వీళ్ళు చేసేదేం లేదు. కాబట్టి వీళ్ళను క్షమించి వదిలివెయ్యి", అని గొప్ప దయాశాలిగా మాట్లాడుతుంది.



సీత చూపిన క్షమాగుణం ప్రస్తుత కాలంలో కూడా, ఎన్నో సందర్భాల్లో ఎంతోమందికి కనువిప్పు కలుగజేసేదిగా ఉండగలదు. మార్గదర్శకంగా ఉండగలదు.

అమానుషీ, మానవమాత్రురాలు కానిదీ, దేవతా స్త్రీ వంటిదీ, భర్త కష్టసుఖాల్లో పాలు పంచుకొనేదీ, మధురమైన వాక్కుగలదీ, భర్త హితాన్ని కోరేదీ, ధర్మాన్ని ఆచరించేదీ, హృదయం నిండుగా దయగలదీ, సర్వప్రాణులకు అమ్మ వంటిదీ అయిన సీతను మెచ్చుకొంటూ యుద్ధకాండ చివర్లో బ్రహ్మదేవుడు అంటాడు 'సీతాలక్ష్మీః' సీత సాక్షాత్తు లక్ష్మీదేవి అని. సీత లక్ష్మీదేవి అయితే రాముడు విష్ణుమూర్తే కదా!



శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే।
సహస్రనామ తత్తుల్యం రామనామవరాననే॥

# శ్రీరామ పుణ్యక్షేత్రం

- శ్రీ చివుకుల రమాకాంత శర్మ

మన దేవాలయాలు

దక్షిణే లక్ష్మణో యస్య వామే తు జనకాత్మజా
పురతో మారుతిర్యస్య తం వందే రఘునందనమ్ ।

శ్రీమహావిష్ణువు ఎన్ని అవతారాలు ప్రదర్శించినా, ఏ అవతారానికి ఉన్న విశిష్టత, వైభవం ఆ అవతారానికి ఉంది. త్రేతాయుగంలోని శ్రీరామావతారం, ద్వాపరయుగంలోని శ్రీకృష్ణావతారం పరోక్ష, ప్రత్యక్ష అనుగ్రహంతో, ఆశీస్సులతో పంచపాండవులు అరణ్యవాసం ప్రారంభించిన సందర్భంలో స్థాపించబడిన ఆలయమే శ్రీరామతీర్థంలోని శ్రీరామస్వామి ఆలయం. భారతీయుల ఇష్టదైవం శ్రీరాముడు. శ్రీరామస్వామి ఆలయం భక్తుల కొంగు బంగారం. దాని వైభవం ఏమిటో తెలుసుకుందాం.

'శ్రీరామతీర్థం' ఉత్తరాంధ్రదేశంలో విజయనగరం పట్టణానికి ఈశాన్య భాగంలో చంపావతీనది సమీపంలో భాస్కరపుష్కరిణికి– నీలాచలమునకు మధ్యన పచ్చనికొండలు, పచ్చికబయళ్ళే హద్దులుగా ఉంటూ నిత్య భక్తజన సందోహంతో అలరారుచున్నది.

## క్షేత్రమాహాత్మ్యము

ద్వాపరయుగంలో జూదములో అపజయం పొందిన పాండవులు అరణ్య వాసం చేయవలసిన దుస్థితి కలిగింది. వారందరూ అరణ్యవాసానికి వెళ్తూ శ్రీకృష్ణ పరమాత్మని తమ వెంట రమ్మని అభ్యర్థించారు.

అందుకు సమాధానంగా శ్రీకృష్ణుడు "వేము రామావతార సమయమున దండకారణ్య ప్రాంతమున సీతాలక్ష్మణ సమేతులమై ప్రయాణించాము. ఆ ప్రాంతమునే మీరు గూడ ప్రయాణించునప్పుడు, ఆనాటి వనవాస మూర్తులైన సీతాలక్ష్మణ సమేత శ్రీరాముని విగ్రహ ప్రతిమలను తన భగవత్ లీలలచే సృష్టించి పాండవులకు అందించి, వారిని భక్తితో పూజించినచో శ్రీరాముడు మీ వనవాసకాలమున మీ అయిదుగురిని సర్వకాల సర్వావస్థలయందునూ రక్షణ చేకూర్చగలరు" అని చెప్పి, ఆశీర్వదించి వనవాసమునకు సాగనంపాడు.


శ్రీకృష్ణుడు ఉపదేశించిన ప్రకారం పాండువులు ఆ ప్రాంతమందే సంచరిస్తూ, వనవాసమూర్తులైన సీతారామ లక్ష్మణులకు అక్కడనే దేవాలయము నిర్మించి స్వామివారిని సేవిస్తూ, వనవాసకాలమును ఆనందముగా, విఘ్నములు కలుగ కుండా గడిపారు.

ఆ దండకారణ్య ప్రాంతమును వదలి వెళ్ళుచూ, 'వేదగర్భుడు' అను వైఖానస వైష్ణవునికి వారు నిర్మించిన దేవా లయమును అప్పగించి, పాండవులు అచటి నుంచి మరొక ప్రదేశానికి వెళ్లారు. ఆ వేదగర్భుడు, అతని పుత్రులు, పౌత్రులు శ్రీస్వామివారిని సేవిస్తూ ఉన్నారు.



## నామౌచిత్యము

శ్రీరామస్వామివారి విగ్రహములు నీటియందు లభించినవి. నీరు అనగా 'తీర్థం'. కనుక, ఈ క్షేత్రమునకు





'శ్రీరామతీర్థం' అను పేరు సార్థకమైందని స్థలపురాణం చెపుతోంది. రాముడి పేరుతో ఊరు ఏర్పడటం, శ్రీవారు స్వామి ఆలయం ప్రతిష్ఠించటం భక్తులు అదృష్టంగా భావిస్తున్నారు.

## భాస్కర సరస్సు

దేవాలయమునకు దక్షిణభాగములో సుమారు 13 ఎకరముల విస్తీర్ణం కలిగి, స్వచ్ఛమైన జలముతో పచ్చని తామర పత్రముల నడుమ, ఎర్రని తామర పుష్పముల మకరందములను ఆస్వాదించుటకై అన్వేషిస్తున్న తుమ్మెదల గుంపులతో చల్లని చిరుగాలులతో విరాజిల్లుతున్న ఒక సరస్సు గలదు. దీనినే 'భాస్కర సరస్సు' అని పిలుస్తారు.



ఈ సరస్సు మధ్యలో ఒక మండపము ఉంది. ఈ క్షేత్రమునకు విచ్చేసిన భక్తులు ఈ సరస్సులో స్నానమాచరించి పునీతులగుచున్నారు.

## స్వామి ఉత్సవములు

సీతారాముల కల్యాణోత్సవం ప్రతి సంవత్సరము మాఘశుద్ధ ఏకాదశి రోజున అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవములు ఏకాదశి మొదలు పూర్ణిమ వరకు అయిదు రోజులు ఎంతో శోభాయమానంగా జరిపిస్తారు. స్వామి వారు సీతాలక్ష్మణ సమేతుడై రోజుకొకవాహనం పై అధిష్ఠించి పురవీథులలో ఊరేగుతారు. శ్రీరామనవమి అత్యంత భక్తి శ్రద్ధలతో తొమ్మిది రోజులు ఘనంగా నిర్వహిస్తారు.

## ఉపాలయాలు

శ్రీరామస్వామి ఆలయప్రాంగణములో వైకుంఠనాథ స్వామి, వేణుగోపాలస్వామి; లక్ష్మీదేవి, మాధవస్వామి; భూభుజంగ వరాహలక్ష్మీనరసింహస్వామి; ఆంజనేయస్వామి వార్ల దేవాలయాలు ఉపాలయాలుగా ప్రసిద్ధి పొందాయి.

ఈ ఉపాలయాలలో కూడ సీతారామలక్ష్మణులతో సమానంగా నిత్యం ధూపదీపనైవేద్యములు శాస్త్రోక్తముగా నిర్వహిస్తున్నారు.

## ఇలా వెళ్లాలి...

చెన్నై-కలకత్తా రైలుమార్గములో విజయనగరం స్టేషను ఉంది. విజయనగరం స్టేషనులో దిగిన వెంటనే కార్లు, ఆటోలు, సర్వీసు ఆటోలు శ్రీరామతీర్థగ్రామం చేరుకోటానికి అందుబాటులో ఉంటాయి. విజయనగరానికి 12 కి.మీ. దూరంలో శ్రీరామతీర్థగ్రామం ఉంది.

సర్వేజనాఃస్సుఖినోభవన్తు



# తిరుమళిశై ఆళ్వార్

- శ్రీ పి. బాలాజీ

శ్రీమహావిష్ణువుయొక్క పరమాయుధం సుదర్శనచక్రాంశ సంభూతులైన 'తిరుమళిశై ఆళ్వార్' కూడా సిద్ధార్థి నామసంవత్సరంలోనే జన్మించారు. జన్మరీత్యా అంత్యజుడైన ఈ ఆళ్వార్ - సుమారుగా 720వ సంవత్సరంలో; చెన్నపట్టణం పరిసరాల్లోని 'తిరుమళిశై' అనే గ్రామంలో ఉద్భవించడం వల్ల వీరికా పేరు స్థిరపడింది.

ఒక కిరాతునిచే పెంచి పెద్ద చేయబడ్డ ఈ ఆళ్వార్ పూర్వజన్మ సుకృతం వల్ల ఆగమశాస్త్రాలను కూలంకషంగా, స్వయంగా అభ్యసించగలిగానని; శ్రీహరి యందున్న అనురక్తితో వైష్ణవ మతావలంబియై, పంచసంస్కారాలను గావించుకొని శ్రీవైష్ణవునిగా పునర్జన్మనొంది, శ్రీమన్నారాయణుని ప్రాభవాన్ని నలుదెసలా చాటి చెప్పటానికై సంకల్పించానని-స్వయంగా ప్రకటించుకున్నాడు.

అత్యంత వినయ సంపన్నుడైన ఈ ఆళ్వార్, భగవంతుని సంపూర్ణ కటాక్షానికి కూడా నోచుకోని తాను వేదవేదాంగాలను అభ్యసించలేదని, అరిషడ్వర్గాలపై విజయం సాధించలేదని, ఐహిక బంధాలనుండి విముక్తి పొందలేకపోయానని వాపోయాడు. అయినప్పటికీ తాను శ్రీహరి పాదపద్మాలను విడువనని, తనను కడతేర్చడం వారికే సాధ్యమని ఆర్తిగా పేర్కొన్నాడు.



శ్రీవేంకటేశ్వరుని పాదపద్మాలను సతతము తమ శిఖరాలపై నుంచుకొనే మహద్భాగ్యానికి తిరుమల నోచుకుందని; శ్రీవారు వనవిహారానికి వేంచేసినప్పుడు, బ్రహ్మదేవుడు గగనాన ఉండే మేఘాలను ఛత్రంగా చేసి వారికి నీడ కల్పిస్తాడని; దేవేంద్రుడు శ్రీవారికి నీరాజనాలు సమర్పిస్తాడని భావయుక్తంగా అభివర్ణించాడు. ఇలాంటి వారి రచనలు భక్తిపారవశ్యము మరియు కవితావేశాల మేళవింపుగా పరిఢవిల్లాయి.

ఆనాడు ద్వాదశి మరియు శ్రవణానక్షత్రదినాలలో ప్రత్యేక పూజలు జరిగేవి. భక్తులు తమకు తోచిన రీతిలో శ్రీనివాసుణ్ణి అర్చించుకునే వారని, అప్పటికింకా ఆగమశాస్త్రబద్ధమైన వైదిక కార్యక్రమాలు ఆచరణలోకి రాలేదని వీరి రచనల ద్వారా అవగతమవుతోంది.

మొదటి ముగ్గురు ఆళ్వారులూ శ్రీమహావిష్ణువుతో పాటుగా, ఇంద్ర, బ్రహ్మ, రుద్రాదిదేవతలను కూడా ఆరాధించేవారు. కానీ తిరుమళిశై ఆళ్వారు మాత్రం, యోగిత్రయానికి భిన్నంగా శ్రీవేంకటేశ్వరుణ్ణి తప్ప అన్యదైవాలను సేవించనని కరాఖండిగా చెప్పాడు.

చక్రాంశయోగి, భక్తిసారముని అనే నామాంతరాలు కలిగిన ఈ ఆళ్వార్ రచించిన నూరు పాశురాల సంకలనాన్ని 'నాన్ముగన్ తిరువందాది' గాను; మరో 120 పాశురాల సంకలనాన్ని 'తిరుక్కంద వృత్తమ్'గాను వ్యవహరిస్తారు.

ఈ రెండూ నాలాయిర ప్రబంధం యొక్క అంతర్భాగాలే! వీటిలోని 96 పాశురాలను బ్రహ్మోత్సవాలలో నాల్గవ రోజు ఉదయం **కల్పవృక్షవాహనోత్సవంలోను**, అదే రోజు సాయంకాలం జరిగే **సర్వభూపాల వాహనోత్సవంలోనూ** పారాయణం చేస్తారు.

**'ఆళ్వార్ తిరువడిగళే శరణమ్'**

# భక్తిమకరందం
## (మొదటి భాగం)

రచన-డా॥ కప్పగంతు రామకృష్ణ, సైజు-1/8డెమ్మీ, పుటలు-224, ధర- రూ.99/-, (పోస్టల్ ఖర్చు రూ.50/- అదనం) ప్రతులకు- ఎస్.ఆర్.పబ్లికేషన్స్, డి.ఆర్.ఆర్. స్ట్రీట్, ఇన్నర్ రింగ్ రోడ్డు (అంబాపురం), విజయవాడ రూరల్- 520 012, ఆంధ్రప్రదేశ్, ఫోన్‌నెంబర్లు: 0866-2436 959, 9494875959

అధ్యయనశీలత ననుసరించి అభివ్యక్తి సామర్థ్యం సమకూడుతుంది. ప్రాచీన సాహిత్యాన్ని 'లోనారసి' అవలోఢనం చేసిన ప్రజ్ఞతో, రసగ్రహణపారీణుడైన వ్యక్తి ఏ విషయవివరణం చేసినా అందులో సారభూతమైన అనుభూతి ఉంటుంది. పాతకొత్తల మేలుకలయిక సాహిత్యానికి భిత్తికను, విశాలతను కూడా సమకూరుస్తుంది. మన ప్రాచీనభక్తి, ధార్మికసాహిత్యంలోని సార్వజనీనత, సార్వకాలికతలను ఆకళింపు చేసుకుని, ఈతరం పాఠకులకు, ఆ రచనల్లోని భావరమ్యతను, అనుభూతిని, సాహిత్యమకరందాన్ని, భారతీయ ధార్మిక సాహిత్య ఆత్మగత హృదయసంస్కృతిని కమనీయంగా '**భక్తిమకరందం**' అనే పేరుతో వ్యాస సంకలనంగా అందించిన శేముషీసంపన్నుడు డా॥ కప్పగంతు రామకృష్ణ.




సమాజభవనాలు శిథిలస్థితికి చేరుకుంటున్నా, లేక మరో అంతస్తుపైన నిర్మించాలన్నా పునాదుల గురించిన పునర్వివేచన అనివార్యం. మూలాల గురించి తెలుసుకుంటే, ఏ మూలన ఉన్నా అభద్రతా స్థితి లేకుండా జాగ్రత్త పడవచ్చు. నిజమే! ముందు వాటిలో నేటికి పనికివచ్చేవీ, మనలను ముందుకు తీసుకువెళ్లేవీ ఏమిటో తెలుసుకోవాలి. 'గతకాలము మేలు వచ్చుకాలము కంటెన్' అనే నిర్వేదం వదలి, 'మంచిగతమున కొంచెమేనోయ్!' అని మంచికి సంకల్పించాలి. సమాజంమారుతూ ఉంటుంది. విలువలూ మారుతూ ఉంటాయి. కాలానుగుణంగా ఆ పరిణామాలు సాహిత్యంలోనూ ప్రతిబింబిస్తాయి. కొత్త పాతల మేలు కలయిక క్రొమ్మెఱుంగులు చిమ్మగా అడుగుజాడ సాగడమే అసలైన అభ్యుదయం. వర్తమానంలో విజృంభిస్తున్న అనేక సామాజిక దుష్టశక్తులనుండి మనల్ని మనం కాపాడుకోవడానికి, నైతిక బలం చేకూర్చుకోవడానికి ఇలాంటి పుస్తకాల పఠనం ఎంతో అవసరం. ఈ సామాజిక అవసరాన్ని గుర్తించి డా॥ కప్పగంతు రామకృష్ణ ఎన్నో ధార్మిక, ఆధ్యాత్మికరచనలు చేస్తున్నారు. ముసురుతున్న మసకచీకట్లలో మినుకు మినుకు మంటూన్న వెలుగురేఖ ఈ "భక్తిమకరందం" పుస్తకం.

సమాజంలో ప్రతి ఒక్కరూ గ్రహించాల్సిన అమూల్యమైన జ్ఞానసంపద ఈ 'భక్తిమకరందం' (మొదటి భాగం)లో నిక్షిప్తమై ఉంది. వ్యక్తి సామాజికునిగా అనుసరించాల్సిన ధర్మం గురించీ, అతనికి సమాజం పట్ల గల బాధ్యతల గురించీ, వ్యక్తిగా, సమష్టిగా మెలగాల్సిన తీరు తెన్నుల గురించీ డా॥ కె.రామకృష్ణ ఈ పుస్తకంలో పేర్కొన్న విషయాలు సర్వకాలాలకు అనుసరణీయాలైనవి.

ప్రతివ్యాసంలో ఎన్నుకున్న విషయానికి న్యాయం చేయాలనే నిర్ణయాన్ని రచయిత పాటించి, గమ్యం చేరారు. ఈ పుస్తకంలోని 35 వ్యాసాలలో ప్రతి వ్యాసమూ ఏదో ఒక కొత్త విషయాన్ని పాఠకులకు తెలియజేసేదే! డా॥ కప్పగంతు పత్రికారంగంలో కూడా విశేషానుభవం ఉన్నవారు గనుక ముద్రణవిషయంలో కూడా చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రతి హైందవుడు, ధార్మికజ్ఞాన జిజ్ఞాసువు తప్పక చదివి, అర్థం చేసుకుని, మనిషి మనీషిగా మారడానికి కావాల్సిన పునాదుల్ని నిర్మించుకోవచ్చు ఈ పుస్తకంద్వారా! నిజానికి ఈ 'భక్తిమకరందం'లోని వ్యాసాల గురించి ఎంతగానో ఉదాహరించి వివరించాలన్న తపన పరిహరించుకుంటున్న కారణం వాటిని చదివి పాఠకులు ఎవరికివారు ఆ అనుభూతిరమ్యతను, రసోల్లాసాన్నీ స్వయంగా అందుకుని ఆనందించ గలరనే విశ్వాసమే! ముఖ్యంగా యువపఠితృ లోకం ఈ గ్రంథ గంధాన్ని అలదుకుని, జీవితాలను పరిమళభరితమూ, ప్రయోజనదాయకమూ చేసుకుంటుందని ఆకాంక్ష!

*- డా॥ కంపల్లె రవిచంద్రన్*

# తిరుప్పావైలో... శ్రీవేంకటేశ్వరుడు

- డా॥ ఈ.ఏ. శింగరాచార్యులు



నాలాయిర దివ్య ప్రబంధమనే మధురభక్తి సాహిత్యాన్ని రచించిన ఆళ్వారులు (దివ్యసూరులు) పన్నెండుమందిలో **'గోదాదేవి'** మాత్రమే స్త్రీమూర్తి. ఈమె పెరియాళ్వార్లు అనబడే విష్ణుచిత్తుల ప్రియ పుత్రిక. **'తిరుప్పావై'** అనే ధనుర్మాస వ్రతప్రబంధాన్ని, **'నాచ్చియార్ తిరుమొళి'** అనే ఇంకొక దివ్య ప్రణయరసాత్మక ప్రబంధాన్ని ఈమె రచించింది. వైష్ణవాలయాలలో నిత్యం ప్రాతఃకాలికారాధనలో తిరుప్పావై అనుసంధింపబడుతుంది. ధనుర్మాసం నెల రోజులపాటు తిరుమలలో తెల్లవారుజామున సుప్రభాతానికి బదులు తిరుప్పావై గానం చేయబడడం సంప్రదాయం.

తిరుప్పావైలో ఎక్కడా ఏ అర్చామూర్తి ప్రసక్తి స్పష్టంగా గోచరించకపోయినా, ఈ ప్రబంధ ప్రతిపాద్యుడు శ్రీవేంకటేశ్వరుడేనని సాంప్రదాయికమైన వివరణం. ఈ ప్రబంధానికి ప్రార్థనా పాశురాన్ని (తనియన్)ను రచించిన ఉయ్యక్కొండార్ అనే ఆచార్యులు *"తొల్‌ప్పావై పాడియరుళ వల్లపల్‌వళైయాయ్! నాడి నీ వేఙ్గడవఱ్కెన్నైవిది ఎన్ఱ ఇమ్మాట్రమ్ నామ్ కడవా వణ్ణమేనల్ గు"* (తిరుప్పావై ప్రబంధాన్ని గానం చేసిన, అందమైన పలుకులను కల గోదా! నీవు, "నన్ను వేంకటేశునకు చెందేటట్లు చేయాలి" అని మన్మథునితో పల్కినమాటను మేముదాటకుండా ఉండేటట్లు అనుగ్రహించు) అని అనడం దీనికి ఒక ప్రమాణం.

నాచ్చియార్ తిరుమొళి అనే ఇంకొక ప్రబంధం ఆరంభంలో కూడా *'వేఙ్గడవఱ్కెన్నై విదిక్కిట్రియే'* (వేంకటేశునకు చెందేటట్లు నన్ను చేశావు కదా) అని పల్కడం, అందులో ఒక దశకంలో శ్రీవేంకటేశ్వరుని వద్దకు మేఘ సందేశాన్ని పంపడం కూడా ఈ అభిప్రాయాన్ని బలపరచే బలమైన సాక్ష్యాలు. దీనిని మరింత సప్రమాణంగా నిరూపించే ఆంతరమైన సాక్ష్యాలను తిరుప్పావైలోనే గమనించవచ్చు. వాటిలో కొన్ని సంగ్రహంగా ప్రస్తావింపబడతున్నాయి.

గోదాదేవి తిరుప్పావైలో భగవంతుని ఉద్దేశించి పలు సంబోధనలను చేసింది. ఇటువంటి ప్రయోగాలనే మిగిలిన ఆళ్వార్లు కూడా తమ ప్రబంధాలలో శ్రీవేంకటేశ్వరుని విషయంలో చేశారు. ఆళ్వార్లు అందరు అర్థప్రతిపాదనలో ఐక్యకంఠ్యాన్ని కల్గినవారైనందున, తిరుప్పావైలో వేంకటేశ్వరుని ప్రస్తావన స్పష్టంగా లేకపోయినా, అటువంటి ప్రయోగాలను మిగిలిన దివ్యసూరులు వేంకటేశుని

విషయంలో చేసినందున, తిరుప్పావైలోని ప్రయోగాలు వేంకటేశ్వరుని విషయంలో సమన్వయిస్తాయని అనడంలో లోటు లేదు కదా! వాటిలో మచ్చుకు కొన్ని ఇందు చూప బడుతున్నాయి.

**01)** తిరుప్పావై రెండవపాశురంలో 'పాఱ్కడలుళ్ పైయత్తు యిన్ఱ పరమన్' (పాలకడలిలో శేషశయనంలో తూగే పరమపురుషుడు) అని ప్రయోగింపబడింది. తిరుమంగై ఆళ్వార్లు పెరియతిరుమొళి ప్రబంధంలో (1–8–1) "శజ్గుతజ్గుతడజ్గడల్ తుయిల్ కొణ్డ.... తిరువేఙ్గడమ్" (శంఖాలు నిండుగా ఉండే చల్లని సముద్రంలో తూగే... వేంకటేశ్వరుని కొండ) అని వేంకటేశుడే క్షీరాబ్ధిశయనుడని అన్నారు.


**02)** అయిదవ పాశురంలో "తాయ్క్కుడల్ విళక్కమ్ శెయ్ద దామోదరన్" (తల్లికడుపును ప్రకాశింపజేసిన దామో దరుడు) అని ప్రయోగింపబడగా, నమ్మాళ్వార్లు తిరువాయ్మొళి ప్రబంధంలో "వేఙ్గడనల్ వెఱ్పన్ ఎన్ఱై దామోదరన్" (3–7–11) (వేంకటాద్రి విభుడైన దామోదరుడు నా తండ్రి) అని అన్నారు.

**03)** ఎనిమిదవపాశురంలో "దేవాదిదేవనై" అని ప్రయో గింపబడింది. ఈ దేవాధిదేవుడు వేంకటేశుడేననే విషయాన్ని పూదత్తాళ్వార్లు "వేఙ్గడత్తాన్ దేవాదిదేవన్ ఎనప్పడువాన్"(28) అని తెలిపారు.

**04)** ఇరవై ఆరవపాశురంలో "మాలే" అని ప్రయోగింప బడింది. పెరియాళ్వార్లు తమ ప్రబంధంలో వేంకటేశ్వ రుని ఉద్దేశించి "కడియార్పొళిల్ వేఙ్గడవా!... మాలే" (3–3–4) (పరిమళం నిండుగా కల్గిన తోట లను కల వేంకటాద్రిలోని స్వామీ! భక్త వ్యామోహం మూర్తీభవించిన వాడా!) అని "మాలే" అనే పదం చేత చెప్పబడే వాడు వేంకటేశుడే అన్నారు.

**05)** ఇక, చివరిగా, 'మణివణ్ణన్' అని 16వ పాశురంలో, "మణివణ్ణా!" అని 26వ పాశురంలో ప్రయోగింప బడింది. తిరుమంగైఆళ్వార్లు "మల్లాళ్ తిరడోళ్ మణి వణ్ణన్" (మల్లులను జయించిన బలిష్టబాహువులను కలవాడు వేంకటేశ్వరుడు) (1–8–2) అని అన్నారు.

ఇవి కేవలం దిఙ్మాత్రంగా ప్రమాణాలు. దీనిని బట్టి తిరుప్పావైలో శ్రీకృష్ణభగవానుని ఉద్దేశించి చేసిన ప్రయోగాలు ఇంచుమించుగా అన్నీ వేంకటేశ్వరుని విషయంలో అన్వయిస్తున్నందున ఆ ప్రబంధ ప్రతిపాద్యుడు వేంకటేశుడేనని అనడంలో లోటు లేదు. "మత్వాదౌ శరణం వ్రజేత' అనే విధంగా ఉండే శ్రీకృష్ణభగవానునకు, శ్రీవేంకటేశునకు మధ్య ఉండేసామ్యం స్వరూపంలో కూడా స్ఫుటమే కదా!



*శ్రీవ్రతాఖ్య ప్రబంధస్య*
*ప్రమేయాయ భవేత్ సదా।*
*స్వామినే వేంకటేశాయ*
*నిత్యశ్రీః నిత్యమంగళమ్ ॥*

# ఆయుర్వేదం

## ఆయుర్వేద దివ్యౌషధం

# 'త్రికటు చూర్ణం'

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ

సనాతన భారతీయ ఋషిప్రణీత సంప్రదాయ ఆయుర్వేద వైద్యవిధానంలో ఆయా వ్యాధుల నివారణ, నిరోధాలకు చూర్ణాలు, కషాయాలు, లేహ్యాలు, మాత్రలు, భస్మాలు, అరిష్టలు, ఘృతాలు, తైలాలు, లేపనాలు ఇలా ఎన్నెన్నో రకాల ఔషధ యోగాల గురించి సమగ్ర వివరణ ఇవ్వడం జరిగింది.

అందులో సర్వసాధారణంగా ఉపయోగించుకొనే చూర్ణ ఔషధం **త్రికటుచూర్ణాన్ని,** ఏ ఏ అనారోగ్య సమస్యల్లో మనం ఎలా వాడుకుని సత్ఫలితం పొందవచ్చో తెలుసు కుందాం.

సంస్కృతంలో 'కటు' అంటే కారం అని అర్థం. మూడు విధాలైన కారం రుచి గల పదార్థాల సమ్మిశ్రిత చూర్ణాన్ని త్రికటుచూర్ణం అంటారు. అంటే మిరియాలు, (ఇంగ్లీషునామం- పెప్పర్, శాస్త్రీయ నామం- పైపర్ నైగ్రం), శొంఠి (ఇంగ్లీషునామం- డ్రై జంజిర్, శాస్త్రీయ నామం- జింజిబర్ అఫీషనాలిస్), పిప్పళ్ళు (ఇంగ్లీషు నామం- లాంగ్ పెప్పర్, శాస్త్రీయనామం- పెప్పర్ లాంగం) చూర్ణాలను సమానంగా కలిపితే త్రికటుచూర్ణం తయారవుతుంది.

ఈవిధంగా తయారుచేసిన చూర్ణం ఆయుర్వేద ఔషధ విక్రయశాలలో కూడా సంవత్సరమంతా లభ్యమవు తుంది.

ఈ ఔషధానికి శరీరంలో వేడిని, పిత్తప్రకోపాన్ని కలుగజేసే స్వభావం ఉండటం వల్ల ఉష్ణశరీరతత్త్వం ఉన్న వారు, జీర్ణవ్యవస్థలో వ్రణాలు ఉన్నవారు, ముక్కు, నోరు, మలమూత్ర ద్వారాల గుండా రక్తస్రావం అయ్యేవారు మినహా మిగిలిన వారు దీనిని నిరభ్యంతరంగా ఉపయోగించు కోవచ్చు.

*"మాసద్వయా త్తథా చూర్ణం హీన వీర్యత్వమాప్నుయాత్"- (శార్ఙధర సంహిత)*

అను ప్రామాణిక ఆయుర్వేద వచనానుసారం ఔషధాలను చూర్ణంగా తయారుచేసుకున్న తర్వాత రెండు మాసాల వరకు వాటిల్లో ఔషధ శక్తులు సంపూర్ణంగా ఉండి, క్రమ క్రమంగా రోజులు గడిచే కొద్ది అవి శక్తిని కోల్పోవటం జరుగుతుంది. కాబట్టి అత్యంత శక్తిమంత ఔషధగుణాలతో కూడిన చూర్ణ ఔషధాన్ని తయారు చేసిన పిదప రెండు మాసాల్లో ఉపయోగించటం శ్రేష్ఠదాయకం.

**అధిక బరువు తగ్గేందుకు -** 60 గ్రాముల త్రికటుచూర్ణం, 60 గ్రాముల త్రిఫలచూర్ణం (కరక్కాయ, తానికాయ, ఉసిరి కాయ పెచ్చుల చూర్ణాలను సమంగా కలిపి చేసిన చూర్ణం) (ఆయుర్వేద ఔషధ విక్రయశాలలో కూడ దొరుకుతుంది) 20 గ్రాముల జీలకర్రపొడి, 20 గ్రాముల చిత్రమూలం పొడి, 7.5 గ్రాముల ఇంగువను నేతితో వేయించిన చూర్ణం కలిపి ఉంచుకొని రోజు ఉదయం, సాయంత్రం పూటకు ఒక గ్రాము పొడిని తగినంత తేనెతో కలిపి సేవిస్తూ ఆహార నియమాలు పాటిస్తూ చక్కటి దైహిక వ్యాయామాలు చేస్తుంటే త్వరలోనే దేహంలో అధికంగా సంచితమైన క్రొవ్వు కరుగు తుంది. కీళ్ళనొప్పులు కూడా తగ్గి శరీరం తేలికతనం సంత రించుకుంటుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఈ ఔషధాన్ని ఇదే పరిమాణంలో 200 మి.లీ. పలుచటి మజ్జిగలో కలిపి సేవిస్తుండాలి.









**వర్షాకాలంలో జలుబు, దగ్గు రాకుండా ఉండేందుకు-** 100 గ్రాముల బెల్లంలో 50 గ్రాముల త్రికటుచూర్ణం కలిపి దంచి నిల్వవుంచుకొని వర్షాకాల ప్రారంభంలో కొన్నాళ్ల పాటు ఉదయం, సాయంత్రం పూటకి కుంకుడు గింజంత చప్పరించి కప్పు గోరువెచ్చని నీరు త్రాగుచుండాలి.

**గర్భాశయ, అండాశయ గడ్డలు, నీటి బుడగలకు-** 90 గ్రాముల త్రికటుచూర్ణం, 10 గ్రాముల కరక్కాయ పెచ్చుల చూర్ణం, 10 గ్రాముల సైంధవ లవణం పొడి కలిపి నిల్వ ఉంచుకోవాలి.

రోజు ఉదయం పరగడుపున 100 మి.లీ. కాచిన పాలు లేదా నీటిలో 20-30 గ్రాములు కలబంద గుజ్జు వేసి మిక్సీలో కలియ తిప్పి చివరగా ఒక టీ స్పూను ఈ పొడిని కలిపి సేవిస్తూ ఉంటే త్వరలో పరిష్కారం దొరుకుతుంది.

## సైనసైటిస్‌కి..

**ముక్కులోనికి –** 5 మి.లీ. నీటిలో చిటికెడు త్రికటు చూర్ణం కలిపి వడగట్టి రోజు రెండు సార్లు పూటకు 3 లేదా 4 చుక్కలు ఒక్కొక్క ముక్కు రంధ్రంలో వేస్తుండాలి.

**కడుపులోకి –** 45 గ్రాముల త్రికటు చూర్ణంలో, 15 గ్రాముల ఉసిరిక చూర్ణం, 15 గ్రాముల గంధ కచోరాల చూర్ణం కలిపి ఉంచుకొని ఉదయం, సాయంత్రం పూటకు ఒక గ్రాము పొడిని తగినంత తేనె కలిపి సేవిస్తూ ఉండాలి.

పై విధంగా ఔషధాలను వాడుకోవడం వల్ల ముక్కు దిబ్బడ, తలబరువు లాంటి సమస్యలు కూడా త్వరగా తగ్గుతాయి. దీర్ఘకాలికంగా వేధిస్తున్న తుమ్ముల సమస్య తగ్గుతుంది.

**పొట్టలో క్రొవ్వు కరిగేందుకు-** త్రికటుచూర్ణం 75 గ్రాములు, జీలకర్రను వేయించి చేసిన చూర్ణం 25 గ్రాములు, సైంధవ లవణం పొడిని 25 గ్రాములు కలిపి ఉంచుకొని రోజు రెండు పూటలా పూటకు 200 మి.లీ. పలుచటి తాజా మజ్జిగలో 2-3 గ్రాముల పొడిని కలిపి సేవిస్తూ ఉండాలి.

**చర్మరోగాలకు -** 75 గ్రాముల త్రికటు చూర్ణము, 25 గ్రాముల కరక్కాయ పెచ్చుల పొడి, 25 గ్రాముల బెల్లం పొడి కలిపి ఉంచుకొని రోజు ఒకట్రెండు సార్లు పూటకు అర టీ స్పూను పొడిలో తగినంత నువ్వుల నూనె కలిపి సేవిస్తు వుంటే గజ్జి, తామర, సోరియాసిస్ లాంటి చర్మ రోగాలు, దురదలు తగ్గిపోతాయి.

**దగ్గు తగ్గేందుకు-** 30 గ్రాముల త్రికటు చూర్ణంలో 10 గ్రాముల లవంగాల చూర్ణం కలిపి ఉదయం, సాయంత్రం పూటకు అరగ్రాము నుంచి ఒక గ్రాము చూర్ణాన్ని తగినంత తేనెతో కలిపి సేవిస్తూ ఉండాలి.

## ధర్మరక్షణ

'ధర్మో రక్షతి రక్షితః' అన్నారు మహాత్ములు. ధర్మాన్ని మనం రక్షిస్తే, ఆ ధర్మం మనల్ని రక్షిస్తుంది. ఓ మహావృక్షం మనకు నీడను, ఫలాలను ఇవ్వాలి అంటే మనం దాన్ని కాపాడుకోవాలి. ధర్మమూ అంతే..

మన హైందవ ధర్మం సనాతనమైనది. మానవ జీవనం సుఖంగా, సంతోషంగా సాగటానికి, అంతిమంగా అనంతుడైన ఆ పరమాత్మను చేరుకోవడానికి హైందవ ధర్మాన్ని మించింది ఏదీ లేదు. ఆకాశమంత విశాలం, భూదేవికున్నంత క్షమ కలిగిందే హైందవ ధర్మం.

మన ధర్మానికి, సంస్కృతికి, చరిత్రకు, జీవనవిధానానికి, ఆధ్యాత్మిక ఔన్నత్యానికి ప్రతీకలు మన ఆలయాలు. కలియుగ ప్రత్యక్ష దైవము, ఆపదమ్రొక్కులవాడు అయిన శ్రీవేంకటేశ్వరస్వామి వారు వెలసిన తిరుమల అతిపవిత్ర క్షేత్రం. కలియుగ వైకుంఠం ఇది. ఆ ఆదిమధ్యాంతరహితుడు మానవాళిని ఉద్ధరించడానికి అవతరించిన అనన్యసామాన్య పుణ్య క్షేత్రం ఇది. పాదం సోకినా పాపం అంటుతుందన్న సందేహంతో శ్రీశ్రీభగవద్రామానుజులు మోకాళ్ళతో తిరుమలను ఎక్కాడు. మరి అంత పవిత్ర ప్రదేశాన్ని మనం ఎంత పరిశుభ్రంగా ఉంచాలో, ఎంత పవిత్రంగా చూసుకోవాలో ఆలోచించండి! అందుకని మానవతా వికాసం అనేది వ్యక్తి జీవితంపై ఆధారపడి ఉంటుంది. ఆ మానవతా వికాసానికి ప్రధాన నిలయాలు ఆలయాలు. అందులో దైవానికి నిలయం దేవాలయాలు. ప్రశాంతవాతావరణానికి దేవాలయాలు నిలయాలు. అవి ధర్మస్థైర్యాలకు ప్రాకారాలు.




# పోయిన పుస్తకం దొరికింది!

శ్రీమతి జోగి మహంతి సుధాకర్ రావు పట్నాయక్

నేను గతంలో శ్రీవారిసేవలో కొన్ని పర్యాయాలు పాల్గొని స్వామివారి సేవలో తరించాను. శ్రీస్వామివారు ఆపదలో తలచినంతనే తరచూ ఏదో ఒక లీల, నేను నీ చెంతనే ఉన్నానని అభయహస్తంతో లీలగా చిరుమందహాసంతో కనిపిస్తూ దీవిస్తూ ఉంటారు. ఒక పర్యాయం మా శ్రీవారి బృందంతో శ్రీస్వామివారి సన్నిధానంలో సేవ చేసే భాగ్యం శ్రీస్వామివారు కలిగించారు.

ప్రస్తుతం స్వామివారు నాకు చేసిన లీలను తెలుపుతాను. నేను మా ఊరు హెడ్‌పోస్టాఫీసులో సేవింగ్స్‌ఖాతాను ప్రారంభించాను. సుమారు ఆరుసంవత్సరాల క్రితం అప్పుడప్పుడు కనీసం నెలకు రూ. 60/- రూపాయలు జమ చేస్తూ ఉంటాను.

అసలు సేవింగ్స్ చేయడానికి కారణం ఏమిటి అంటే ఇక్కడ పోస్టాఫీస్‌లో టి.టి.డి.కి సంబంధించిన దర్శనం టిక్కెట్ కౌంటర్ కలదు. నేను పొదుపు చేసిన పైకం శ్రీస్వామివారి యొక్క అనుగ్రహం కలిగిన రోజున తిరుమల-తిరుపతి, తిరుచానూరు యాత్రలకు ఖర్చులకు సమయానికి కలిసి వస్తుందన్న ఆలోచనతో సేవింగ్స్ ఎకౌంట్ ప్రారంభించాను.


ఆ సేవింగ్స్ ఎకౌంట్‌లో నెలకు కొన్ని వందలు జమ చేయగలిగాను. ఓ రోజు ఒకే నెలలో మళ్లీ పైకం జమ చేద్దామని, పాస్‌బుక్ పైకంతో బయలుదేరాను, కానీ ఆరోజు సేవింగ్ కౌంటర్ దగ్గర సేవింగ్స్ చేసే జనం ఎక్కువగా ఉన్నారు.

ఎందుకో ఆ రోజు నిరీక్షణ చేయలేక సొమ్ము జమ చేయలేకపోయాను. పాస్‌పుస్తకం నా చేతి సంచిలో పెట్టుకొని (ఒక పాత పత్రిక న్యూస్‌పేపర్ కవరుగా చుట్టి) మిత్రులను కలవడం కోసం జిల్లా కోర్టు కాంపౌండ్ ఆవరణకు వెళ్లాను, కొన్ని ఆఫీసు పేపర్స్ వెదుకుతూ ఉన్న సమయంలో అంతకు ముందు ఉదయం పెట్టిన సేవింగ్స్ ఎకౌంట్ బుక్ నాకు తెలియకుండా జారి పడిపోయింది.

ఆ రాత్రి ఇంటికి వెళ్లి, సంచి దులిపి వెదికాను. మా ఇంట్లో ఉన్న గ్రంథాలయం పుస్తకాలు కొన్ని తీసి వెదికాను. రాత్రి 11 గంటలు దాటింది, కానీ సేవింగ్స్ బుక్ జాడ కనిపించలేదు. పదేపదే *'గోవిందా! గోవిందా! సర్వాంతర్యామి నమో నమః'* అని స్మరిస్తూ కలవరంగా నిద్రించాను.

సుమారు వారం రోజులు గడిచాయి, ఆ రోజు నేను ఎక్కడ కూర్చుని సంచిలో కొన్ని ఆఫీస్ పేపర్స్ తీసి హడావిడిగా సర్దుకున్నానో ఆ పోస్టల్ సేవింగ్స్ బుక్ ఎక్కడ జారవిడిచానో అక్కడే అదే పాత న్యూస్ పేపర్లో చుట్టిన ఆ పాస్‌బుక్ నా కళ్ళకు కనిపించింది.

ఆరోజు శ్రీస్వామివారి రోజు శనివారం, ఆ అద్భుత శ్రీవారి లీలను అక్కడే ఉన్న ఒక అపరిచిత వ్యక్తి (నల్లని దేహచ్ఛాయగల వ్యక్తి)ని చూడగానే సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామివారిని చూసిన సంతోషం కలిగింది. ఆయనకు ముందుగా పోయిన పుస్తకం దొరికింది అని చెప్పి భక్తి పరవశం చెందాను. అంతకు ముందు మా అల్లుడికి విశాఖపట్నం ఫోన్ చేశాను, ఫోన్‌రింగ్ టోన్ 'కౌసల్యాసుప్రజారామపూర్వా సంధ్యా ప్రవర్తతే' అని వినిపించింది. మరో మిత్రునికి యోగక్షేమాలకు ఫోన్ చేశాను. అతని పేరు శ్రీనివాసరావు. ఇలా శ్రీస్వామివారు నిత్యం ఏదో లీలను నాకు చూపిస్తూనే ఉన్నారు.




***గోవిందా! గోవిందా!***
***గోవిందా శరణమ్.***

పాఠం-03

# సంస్కృతం నేర్చుకుందాం..!!

రచన- మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య

నిర్వహణ- మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

## పాఠకులకు కొన్ని సూచనలు

01) ప్రతిపాఠములోని పదాలను కంఠస్థము చేయాలి.

02) చదివిన పాఠములను నిత్యము ఐదు (లేక) ఆరుసార్లు చింతన చేయాలి.

03) ప్రతిపాఠము క్రింద అభ్యాసార్థము సంస్కృతములో వ్రాయబడిన వాక్యాలను తెలుగులోకి, తెలుగులో ఉన్న వాటిని సంస్కృతములోకి సరిగా మార్చి చెప్పాలి.

04) మార్చునపుడు ఆయా పాఠంలోని పదాలను చూడరాదు.

05) మీ ఇంటిలోని వారితోను/తోటివారితోను సిగ్గుపడక వచ్చినంతవరకు సంస్కృతంలో మాట్లాడాలి. వారిని కూడా మాట్లాడమని ప్రోత్సహించాలి.

06) అభ్యాసములో ఇచ్చిన వాక్యముల వంటి వాటిని అనేకములు కల్పించుకొని ప్రయత్నించాలి.

07) చిన్న చిన్న కథలను చిన్న చిన్న సంస్కృత వాక్యములో చెప్పుచు వ్రాయుచు ఉండాలి.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| एषः | = | వీడు | वा | = | ఆ, ఓ | आसीत् | = | ఉండెను |
| कः | = | ఎవడు? | न | = | లేదు, కాదు | आसीः | = | ఉంటివి |
| सर्वः | = | ప్రతివాడు | बत | = | అయ్యో! | आसं | = | ఉంటిని |

### అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) एषः तदा कुत्र आसीत्?
02) सः तदा अत्र नासीत्।
03) त्वं कुत्र आसीः
04) अहं तत्रासम्
05) कः तत्रासीत्?
06) वयं तत्र न स्मः।
07) ते तत्र न सन्ति।
08) बत! सः तत्रास्ति वा?
09) एषः तत्र नास्ति वा?
10) सर्वः तत्रास्ति।

అ) జవాబులు

01) వీడు అప్పుడు ఎక్కడ ఉండెను? 02)అతడు అప్పుడు ఇక్కడ లేడు.
03) నీవు ఎక్కడ ఉంటివి? 04)నేను అక్కడ ఉంటిని?
05) ఎవ్వడు అక్కడ ఉండెను? 06)మేము అక్కడ లేము.
07) వారు అక్కడ లేరు. 08)అయ్యో!వాడు అక్కడ ఉన్నాడా?
09) వీడు అక్కడ లేడా? 10)ప్రతివాడు అక్కడ ఉన్నాడు.

### ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) నీవు అప్పుడు ఎక్కడ ఉంటివి?
02) నేనపుడక్కడ ఉంటిని.
03) అయ్యో! వారక్కడనున్నారా?
04) నేనిక్కడ లేకుంటిని.
05) వాడెవడు?
06) నీవెవడవు?
07) నీవిపుడెక్కడనున్నావు?
08) వారిక్కడనున్నారా?
09) మీరిపుడెక్కడనున్నారు?
10) మేమిపుడిక్కడ లేము.

ఆ) జవాబులు

01) त्वं तदा कुत्र आसीः? 02) अहं तदा तत्र आसम्।
03) बत! ते तत्र सन्ति वा? 04) अहं अत्र नासम्।
05) सः कः? 06) त्वं कः?
07) त्वं इदानीं कुत्र असि? 08) ते अत्र सन्ति वा?
09) यूयं इदानीं कुत्र स्थ? 10) वयं इदानीं अत्र न स्मः।




# కేశవుడి పూజ

- డా॥ శ్రీనివాసరావు

ఒక ఊళ్లో ఒక దేవాలయం ఉంది. ఆ దేవాలయంలో చాలా సంవత్సరాలుగా పూజాది కాలు లేవు. ఆ పాడుపడిన గుడి చుట్టూ బోలెడు చెట్లు ఉన్నాయి. ఆ చెట్ల ఆకులన్నీ రాలి, గుడి ప్రాంగణమంతా చెత్తా, చెదారంతో నిండి ఉంది. గుడిలోపల సాలెగూళ్లు, బూజులతో ఉంది. సున్నం లేకపోవడం వల్ల గోడలన్నీ నల్లగా ఉన్నాయి.



ఒక రోజు ఆ గుడిగంటలు మ్రోగాయి. హారతులిస్తూ ఎవరో గంట వాయించారు. అందరూ ఆశ్చర్యంగా గుడివద్దకు పరుగులు తీసారు. కేశవుడనే కుర్రాడు పూజ చేస్తున్నాడు. హారతులిచ్చాడు. గంటలు వాయించాడు. పూలు విగ్రహానికి సమర్పించాడు. కానీ, ఎవరూ ఆ గుడి లోపలికి ప్రవే శించలేకపోయారు.

కారణం ఆ గుడి ముంగిట ఉన్న చెత్తా, చెదారం తుడవలేదు. అది అలాగే ఉంది. బూజులూ దులపలేదు. గుడి, యథాప్రకారం సాలెగూళ్లతో, బూజులతో ప్రవేశించడానికి వీలులేకుండా ఉంది. పూజమాత్రం యథావిధిగా జరిగిపోతోంది.


ఆ పూజ చూసి, అందరూ నవ్వారు. విరగబడి నవ్వారు. పూజ చేసే విధానం అదికాదనీ, మొదట గుడి ముంగిట శుభ్రం చేసి, చక్కగా నీళ్లు జల్లి మంచి రంగవల్లులు తీర్చిదిద్ది, గుడి లోపల గోడలన్నీ శుభ్రం చేసి, బూజులన్నీ దులిపి, విగ్రహాన్ని చక్కగా అభిషేకించి, నూతనవస్త్రాలతో, పూలమాలలతో అలంకరించి, ఆ తరువాత పూజ చేయాలని, అంతే కానీ ఇలా అవకతవకగా చేయకూడదనీ వివరించారు, కేశవుడికి బోధపరచారు.


మనం చేసే పూజ కూడా అచ్చం కేశవుడి పూజలాగే ఉంది. మన హృదయాలలో చెత్తా, చెదారాలుగా నిండిపోయిన అసూయ, ఈర్ష్యలను మనం తుడిచివేసే ప్రయత్నం చేయడం లేదు.


కోరికలు, కాంక్షలు అనే బూజుతో, విషయ వాసనలనే సాలెగూళ్లతో నిండిన మన మనస్సుని, శుభ్రపరచుకోవడమూ లేదు. పాపప్రక్షాళనమనే అభిషేకము చేయడము లేదు. సుఖము, సంతోషము, ఆనందము అనే రంగవల్లులను తీర్చిదిద్దడమూ లేదు. భక్తి, శ్రద్ధ అనే గుణాలు అలవర్చుకోవడమూ లేదు. ఇవేమీ చేయకుండానే, హారతులిస్తున్నాం. గంటవాయించుతున్నాం. పూలు కష్టపడి కోసి, పూజచేస్తున్నాం. ఏం ప్రయోజనం!

**నీతి**

**మనం చిత్తశుద్ధితో దైవాన్ని పూజించాలి.**


చిత్ర కథ
శ్రీగోదాకల్యాణం
కథ - డి. శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు - కె. తులసీప్రసాద్
ద్రవిడదేశంలోని శ్రీవిల్లిపుత్తూర్ అనే గ్రామంలో వటపత్రశాయి ఆలయం ఉంది.
ఆలయం దగ్గరే విష్ణుచిత్తుడు తులసి తోటని పెంచి స్వామికి మాలా కైంకర్యం చేస్తున్నాడు. ఒకనాడు ఆయనకు ఆ తోటలో ఒక పసిపాప దొరికింది.
అప్పుడు విష్ణుచిత్తుడు (పెరియాళ్వార్)....
స్వామి నా మాలాకైంకర్యానికి మెచ్చి ఒంటరినైన నాకు ఈ పాపని అనుగ్రహించాడు. ఈమెకి కోద్దై (పూదండ) అని పేరు పెడుతున్నాను.
ఒక్క పేరుతో తనివితీరక విష్ణుచిత్తుడు ఆమెను 'గోదాదేవి... ఆండాళ్' అని కూడా పిలుస్తున్నాడు.
గోదమ్మ అల్లారుముద్దుగా పెరిగి పెద్దదయింది. సాటిలేని సౌందర్యంతో అలరారుతున్న ఆమెను విష్ణుచిత్తుడు...
నా బంగారు గోదమ్మా! నా దిష్టి నీకు తగులుతుందేమో... నువ్వు స్వామి సొత్తువి గోదమ్మా!!
నాన్నా! నేను నీ కూతుర్ని గోదని. అంతే...
స్వామికోసం నిత్యం తండ్రి తులసీమాలల్ని కడుతుంటే చూసి వాటిని తాను ధరించాలనుకుంది. వెంటనే, ఆ మాలల్ని ఆమె ధరించి బావి నీళ్ళలో తన నీడని చూసుకుని మురిసి పోయింది గోదమ్మ.
ఆ దృశ్యం చూసి విష్ణుచిత్తుడు...
స్వామికి అర్పించాల్సిన మాలల్ని నువ్వు ధరించావా? ఎంత అపచారం చేసావు తల్లీ!
అపచారమా...
1


అవును. అపచారమే తల్లీ! ఈ రోజు స్వామికి.. మాలల్ని అర్పించలేను!
నాన్నా! దిగులు పడకండి!!
ఆ రోజంతా విష్ణుచిత్తుడు పరితపిస్తూనే ఉన్నాడు. ఆనాటి రాత్రి ఆయనకి కలలో స్వామి కనిపించి...
విష్ణుచిత్తా! గోదాదేవి ధరించి ఇచ్చిన మాలలే నాకు ఇష్టం. అవే నాకు అర్పించు.
అలాగే స్వామీ!
నిద్రనుంచి మేలుకుని గోదమ్మకి విషయమంతా చెప్పాడు విష్ణుచిత్తుడు. తానెప్పుడూ తప్పు చెయ్యనని చెప్పింది గోదమ్మ. అది తన గొప్పదనం కాదని తండ్రి పెంపకం గొప్పదనం అని చెప్పింది. అప్పుడు విష్ణుచిత్తుడు గోదాదేవితో...
అమ్మా! నువ్వు కారణజన్మురాలివి. స్వామికి ఇష్టురాలివి.
స్వామినే... నా పతిగా వరిస్తాను.
2







వచ్చే సంచికలో మరో దివ్యలీలా విలాసాన్ని దర్శించి... తరిద్దాం! స్వస్తి! 4



# క్విజ్

నిర్వహణ- డా॥ అల్లాడి సంధ్య

**1)** చక్రవ్యూహం నిర్మించిందెవరు?
- అ) భీష్ముడు
- ఆ) శిశుపాలుడు
- ఇ) ద్రోణాచార్యుడు
- ఈ) కృపాచార్యుడు

**2)** ధృతరాష్ట్రుని భార్య ఎవరు?
- అ) అంబ
- ఆ) అంబాలిక
- ఇ) గాంధారి
- ఈ) కుంతి

**3)** ఐరావతం ఏ దేవుని వాహనం?
- అ) ఇంద్రుడు
- ఆ) బ్రహ్మ
- ఇ) లక్ష్మి
- ఈ) విష్ణువు

**4)** తల్లిదండ్రులను సేవించినవారిలో సర్వశ్రేష్ఠుడు ఎవరు?
- అ) ప్రహ్లాదుడు
- ఆ) ధ్రువుడు
- ఇ) శ్రవణకుమారుడు
- ఈ) అర్జునుడు

**5)** అర్జునుని కుమారుడెవరు?
- అ) అభిమన్యుడు
- ఆ) ఘటోత్కచుడు
- ఇ) సహదేవుడు
- ఈ) సుబాహు

**6)** గాండీవం ఏ వీరుని ధనస్సు?
- అ) భీముడు
- ఆ) యుధిష్ఠరుడు
- ఇ) నకులుడు
- ఈ) అర్జునుడు

**7)** ఏకదంత ఏ దేవుని నామం?
- అ) ఇంద్రుడు
- ఆ) గణేశుడు
- ఇ) శివుడు
- ఈ) బ్రహ్మ

**8)** పాండవుల దూతగా దుర్యోధనుని దగ్గరకు ఎవరు వెళ్లారు?
- అ) ద్రోణాచార్యుడు
- ఆ) భీష్ముడు
- ఇ) కృష్ణుడు
- ఈ) బలరాముడు

**9)** శ్రీకృష్ణుని మాతామహుడు (తల్లికి తండ్రి) ఎవరు?
- అ) వాసుదేవుడు
- ఆ) నందుడు
- ఇ) కంసుడు
- ఈ) ఉగ్రసేనుడు

జవాబులు

1) ఇ 2) ఇ 3) అ 4) ఇ 5) అ
6) ఇ 7) అ 8) ఇ 9) ఈ

## చిత్రలేఖనం

ఈ బొమ్మకు రంగులు వేద్దామా...



పై బొమ్మను క్రింది గళ్ళలో గీయండి...



Edited and published on behalf of T.T.Devasthanams by Prof. K.Rajagopalan, Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by Sri P.Ramaraju, M.A., Special Officer (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.



ధనుర్మాస సందర్భంగా తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామివారి సమక్షంలో
శ్రీగోదాదేవి రచించిన 'తిరుప్పావై' ప్రవచన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామివారు,
తి.తి.దే. తిరుమల అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డిగారు పాల్గొన్న దృశ్యం
'తిరుప్పావై' ప్రవచనం చేస్తున్న ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆచార్య కె.రాజగోపాలన్ గారు




తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో 'తిరుప్పావై'
ప్రవచన కార్యక్రమాన్ని 15-12-2020న ప్రారంభించిన
తి.తి.దే. తిరుపతి సంయుక్త కార్యనిర్వహణాధికారిణి
శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్. గారు, ఇతర తి.తి.దే. ఉన్నతాధికారులు




తిరుమలకు 27-12-2020న విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు
ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీ జె.కే.మహేశ్వరి గారికి
తి.తి.దే. తిరుమల అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డిగారు
శ్రీవారి క్యాలెండరు, డైరీని అందజేస్తున్న దృశ్యం



తిరుమలకు 24-12-2020నాడు విచ్చేసిన భారత ప్రధాన న్యాయమూర్తి
జస్టిస్ శ్రీ అర్వింద్ బాబ్డే గారికి శ్రీవారి చిత్రపటాన్ని
తి.తి.దే. అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి
డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్. గార్లు అందజేస్తున్న దృశ్యం




ఢిల్లీ శ్రీవేంకటేశ్వర కళాశాలలో నూతన భవనాలను 29-12-2020న ప్రారంభించిన
తి.తి.దే. అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి డా॥ కే.ఎస్.జవహర్ రెడ్డి, ఐ.ఏ.ఎస్. గార్లు.
ఈ కార్యక్రమంలో తి.తి.దే. ఆర్థికసలహాదారుడు & ముఖ్యగణాంకాధికారి శ్రీ ఓ.బాలాజి, పాలకమండలి సభ్యులు
శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి, డా॥ ముప్పవరపు నిశ్చిత, శ్రీ డి.పి.అనంత మరియు శ్రీ రాకేష్ సిన్హా గార్లు పాల్గొన్నారు.



“వాత్సల్యాది గుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరమ్”